
సాహితీ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
రాజమహేంద్రవరం
: fb.com/vaartha Digital
Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
9-4-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 67 పేజీలు: 12 వెల: 6.50

## యుఎస్‌లో వేగంగా కారు నడిపినా వీసా రద్దు

5లో

## తమిళనాడు గవర్నర్‌పై సుప్రీం సీరియస్




## ప్రభుత్వ భాగస్వామ్యంతోనే
# లక్ష్యాల సాధన

### • పి4 పటిష్టతకోసం రాష్ట్ర స్థాయిలో కమిటీ • మిత్ర వాట్సప్ గవర్నెన్స్‌పై అవగాహన • సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఏప్రిల్ 8,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజల భాగస్వామ్యంతో ప్రభుత్వం చేపట్టే సంక్షేమ కార్యక్రమం లక్ష్యాలను అధిగమిస్తుందని సిఎం చంద్రబాబు తెలిపారు.పేదరిక నిర్మూలన లక్ష్యంగా చేపట్టిన జీరో పావర్టీ, పి4 కార్యక్రమాన్ని విస్తృత పరిచేలా పటిష్ట వ్యవస్థను నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసిందన్నారు. ఇందుకు సంబంధించి స్టేట్ లెవెల్ సొసైటీని ఏర్పాటు చేస్తోందన్నారు. దీనికి ముఖ్యమంత్రి ఛైర్‌పర్సన్‌గా, డిప్యూటీ సిఎం వైస్ ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారని వివరించారు. సిఇఒ, డైరెక్టర్, వారికి అనుసంధానంగా కాల్ సెంటర్, టెక్ టీమ్, ప్రోగ్రాం టీమ్, వింగ్ టీమ్ ఉంటాయని తెలిపారు. జిల్లా చాప్టర్‌కు జిల్లా మంత్రి ఛైర్‌పర్సన్‌గా, నియోజకవర్గ చాప్టర్‌కు ఎమ్మెల్యే ఛైర్‌పర్సన్‌గా, గ్రామ, వార్డు స్థాయిలో సెక్రటేరియట్ చాప్టర్లకు ఛైర్‌పర్సన్‌గా పంచాయతీ కార్యదర్శి, వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు ఉంటారు. రాష్ట్ర స్థాయి సొసైటీ ఏర్పాటు, పి4పురోగతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి జిల్లా కలెక్టర్, మంత్రులు, ఎమ్మెల్యేలు మార్గదర్శిలను గుర్తించి బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా చూడాలని చెప్పారు. దాతలు ఎవరెవరు ఎంత మొత్తం ఇచ్చారు... ఇంకెంత సాయం 'బంగారు కుటుంబాలు'కు అవసరం అవుతుంది వంటి విషయాలు అన్నీ వెబ్‌సైట్‌లో పొందుపరచడంతో పారదర్శకంగా ఉంటుందని, పి4పై విశ్వాసం మరింత పెరుగుతుందని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.
పేదరికం నిర్మూలనే కీలకంగా తీసుకుని వచ్చిన జీరోపావర్టీ, పి4 కార్యక్రమాలను మనం ప్రారంభించగా మంచి స్పందన లభించిందన్నారు. సమాజంలో ధనవంతులు మరింత ధనవంతులుగా పేదలు మరింత పేదలుగా తయారవడం ప్రమాదకరం. సమాజం మనకు ఎంతో ఇచ్చింది. మనం తిరిగి సమాజానికి ఎంతో కొంద మేలు చేయాలి. అందుకే సమాజంలో అవకాశాలు అంది పుచ్చుకుని ఆర్థికంగా ఎదిగిన వారు అట్టడుగున ఉన్న పేదలను ఆదుకునే బాధ్యత తీసుకోవాలి. చేతనైనంత సాయం చేసి వారిని అన్ని విధాలా పైకి తేవాలి. సి4 విధానం ద్వారా సమాజంలో ఆర్థికంగా అగ్రస్థానంలో ఉన్న 10 శాతం మంది... అట్టడుగున ఉన్న 20 శాతం >>2


మంగళవారం న్యూఢిల్లీలో దుబాయ్ యువరాజు షేక్ హమ్దన్ ప్రధాని మోడీతో భేటీ అయిన దృశ్యం

## రక్షణ, వాణిజ్య రంగాల్లో
# పరస్పర సహకారం
### దుబాయ్ యువరాజుతో భేటీలో ప్రధానిమోడీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:** భారత్‌లో మొట్టమొదటిసారి పర్యటనకు వచ్చిన దుబాయ్ యువరాజు రాకతో రెండుదేశాలమధ్య ద్వైపాక్షిక సహకారం మరింత పటిష్టం అవుతుందని ప్రధానిమోడీ ఆకాంక్షించారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో అత్యంతశక్తివంతమైన యువరాజు తొలిసారి భారత్‌కు రావడం రెండుదేశాలమధ్య పరస్పర మైత్రీ బంధానికి నిదర్శనమాన్నరు. దుబాయ్ యువరాజు షేక్ హమ్దన్ బిన్ మహ్మద్ అల్‌మక్తూమ్ భారత్‌లో రెండురోజుల పర్యటన నిమిత్తం >>2

## రూ.80 వేల కోట్లతో
# రిఫైనరీ
### కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్

**విజయవాడ, ఏప్రిల్8, ప్రభాతవార్తప్రతినిధి:** పెట్రోలియం రంగంలో అనేక రాష్ట్రాల్లో పెట్టుబడులు వస్తున్నాయనీ కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి అన్నారు. ఆ అవకాశాలను వినియోగించుకోవడంలో ఆంధ్రప్రదేశ్, ఒడిశా, గుజరాత్ రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయని వెల్లడించారు. ఎపిలో రూ.80 వేల కోట్లతో రిఫైనరీ రాబోతోందని తెలిపారు. ఒడిశా పారాదీప్ వద్ద ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ రిఫైనరీ ఏర్పాటు చేస్తోంది. ఈ సందర్భంగా ఒడిశా ప్రభుత్వం, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ మధ్య ఒప్పందం కుదిరింది. ఈ కార్యక్రమంలో హర్దీప్ సింగ్ పురి పాల్గొన్నారు. ఈ సందర్భంలో కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ మాట్లాడుతూ ఎపిలో భారీ ఆయిల్ రిఫైనరీ అంశాన్ని ప్రస్తావించారు.గతంలో 27 దేశాల నుంచి ముడి చమురు దిగుమతి చేసుకునే వాళ్లం. ఇప్పుడు 40 దేశాలనుంచి దిగుమతి చేసుకుంటున్నాం. ముడి చమురు ధరలు తగ్గినప్పుడు కొనుగోలు చేసి ఎక్కువ నిల్వ చేస్తాం. ప్రస్తుతం ఒక్కో బ్యారల్ ముడి చమురు 60 డాలర్ల వరకుఉంది అని కేంద్రమంత్రి తెలిపారు.

# విద్యాశాఖలో సంస్కరణలు వేగవంతం
### మెగా డిఎస్సీపై నారా లోకేష్ సమీక్ష

**మంగళగిరి,ఏప్రిల్ 8,ప్రభాతవార్త :** విద్యాశాఖలో చేపట్టిన సంస్కరణలను జూన్ నాటికి పూర్తిచేయాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. విద్యాశాఖలో సంస్కరణలు, మెగా డిఎస్సీ, ఎస్ఎస్‌సి, ఇంటర్ ఫలితాలు, డ్యాష్ బోర్డు రూపకల్పన తదితర అంశాలపై అధికారులతో లోకేష్ సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... పూర్తిస్థాయి సంస్కరణల తర్వాత రాబోయే నాలుగేళ్ల విద్యాప్రమాణాల మెరుగుదలపైనే దృష్టి సారించాలని అన్నారు. న్యాయపరమైన చిక్కులు లేకుండా సాధ్యమైనంత త్వరగా మెగా డిఎస్సీ ప్రకటనకు ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా ఎస్ఎస్‌సి, ఇంటర్ ఫలితాల ప్రకటన విడుదలకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సాంప్రదాయ ప్రసార మాధ్యమాలతో పాటు ప్రభుత్వం ఇటీవల అమలులోకి తెచ్చిన మనమిత్ర యాప్‌లో కూడా ఫలితాలు అందుబాటులోఉంచేలా చర్యలుచేపట్టాలన్నారు. ఆగస్టులో వివిధ రాష్ట్రాల విద్యామంత్రుల కాంక్లేవ్‌ను రాష్ట్రంలో నిర్వహించేందుకు కేంద్రమంత్రి ఇప్పటికే అంగీకారం తెలిపినందున, అందుకు విస్తృతమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో లెర్నింగ్ అవుట్ కమ్స్, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల అటెండెన్స్ వివరాలు, పెండింగ్ ఫైల్స్ తదితర వివరాలతో పూర్తిస్థాయి డ్యాష్ బోర్డును మే నెలకల్లా సిద్ధం చేయాలని ఆదేశించారు.
విద్యార్థులు లీప్ యాప్‌ను అపార్ ఐడితో లాగిన్ అయి వీక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇప్పటివరకు అపార్ ఐడి నమోదు 85శాతం పూర్తయిందని, సాంకేతిక సమస్యలను అధిగమించి పూర్తిస్థాయి అపార్ ఐడి పూర్తిచేయాలని సూచించారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ స్కూళ్లలో ఎట్టి పరిస్థితుల్లో డ్రాపవుట్స్ ఉండకూడదని, అందుకు తగ్గట్లుగా చర్యలు చేపట్టాలని అన్నారు. సర్వశిక్ష నిర్వహణలో కొనసాగుతున్న పాఠశాలల్లో ఆన్ లైన్ విధానంలో పారదర్శకంగా అడ్మిషన్లు చేపడతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుత సెలవుల్లో కెజిబివిల్లో టీచర్ల బదిలీలు పూర్తిచేసేందుకు మంత్రి అంగీకారం తెలిపారు. అమరావతిలో సెంట్రల్ లైబ్రరీ, ట్రైనింగ్ అకాడమీ, ఆర్కైవ్స్ మ్యూజియం నిర్మాణాలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టే అధునాతన సాంకేతికతతో కూడిన క్లిక్కర్స్‌ను తొలుత 9వతరగతి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని, పనితీరును బట్టి రాబోయే రోజుల్లో 6నుంచి 10తరగతులకు అమలు చేయాలని సూచించారు. జిఓ నెం.117కు ప్రత్యామ్నాయ జిఒను సాధ్యమైనంత త్వరగా సిద్ధం చేయాలని అన్నారు. ఈ విద్యాసంవత్సరం పాఠశాలలు తెరిచే రోజుకే పాఠ్యపుస్తకాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే 48శాతం పుస్తకాల ముద్రణ పూర్తయినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో స్పెషల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన పోస్టులకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పు అమలుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. టీచర్ల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి ఎటువంటి పైరవీలకు తావులేకుండా నిబంధనలకు లోబడి పూర్తి పారదర్శక చర్యలు చేపట్టాలనిఅన్నారు.
ఈ సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్య డైరక్టర్ విజయరామరాజు, ఇంటర్మీడియట్ విద్య డైరక్టర్ కృతికా శుక్లా, కాలేజియేట్ ఎడ్యుకేషన్ డైరక్టర్ నారాయణ్ భరత్ గుప్త, సర్వశిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరక్టర్ బి.శ్రీనివాస రావు, ఎపిఇడబ్ల్యుఐడిసి ఎండి దీవెన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మంగళవారం అధికారులతో సమీక్ష జరుపుతున్న మంత్రి నారా లోకేష్

## జలహారతి కార్పొరేషన్ ఏర్పాటు
### ఛైర్మన్‌గా సిఎం, వైస్ ఛైర్మన్‌గా నీటిపారుదల మంత్రి

**విజయవాడ,ఏప్రిల్8,ప్రభాతవార్తప్రతినిధి:** జలహారతి కార్పోరేషన్‌ను ఏర్పాటు చేస్తూ ఎపి ప్రభుత్వం ఇరిగేషన్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ పేరిట కీలక ఉత్తర్వులు జారీ చేసింది.పోలవరం- బనకచర్ల లింక్ ప్రాజెక్ట్ చేపట్టేందుకు ఈకార్పోరేషన్‌ను ఏర్పాటు చేసినట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. కార్పోరేషన్ ఛైర్మన్ సిఎం చంద్రబాబు నాయుడు, వైస్ ఛైర్మన్‌గా నిమ్మల రామానాయుడు నియమిస్తున్నట్లు ఉత్తర్వులు స్పష్టం చేసాయి.సంస్థ సిఇఒ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి,సభ్యులుగా ఇతర అధికారులను నియమించింది.పోలవరం ప్రాజెక్టు నుంచి వరద జలాలను తరలించేలా పోలవరం బనకచర్ల లింకు ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని చంద్రబాబు సర్కార్ భావిస్తున్నట్లు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా 80 లక్షల మందికి తాగునీరు అందించేలా ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందని వెల్లడించారు. 9.14లక్షల హెక్టార్ల వ్యవసాయ భూమికి సాగునీరు అందించొచ్చని, కొత్తగా మరో >>2

## వల్లభనేని వంశీకి మరో ఎదురుదెబ్బ
### కిడ్నాప్ కేసులో రిమాండ్ పొడిగింపు

**విజయవాడ,ఏప్రిల్8,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్సీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి దెబ్బ మీద దెబ్బ తగులుతుంది. సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో ఆయనకు న్యాయస్థానం మరోసారి రిమాండ్ పొడిగించింది. వంశీ కస్టడీ ఇవాల్టితో ముగియడంతో పోలీసులు విజయవాడ ఎస్సీ, ఎస్టీ కోర్టులో హాజరుపరిచారు. విచారణ జరిపిన కోర్టు ఈనెల 22 వరకు రిమాండ్ పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. సత్యవర్ధన్ కిడ్నాప్ కేసుతో పాటు టిడిపి కార్యాలయంపై దాడి కేసుల్లో వల్లభనేని వంశీ రిమాండ్ ఖైదీగా ఉన్నారు. మరోవైపు ఈకేసులో అరెస్టయిన మరో నలుగురు నిందితులకు కూడా కోర్టు రిమాండ్ గడువును పెంచింది. మరోవైపు సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో నిందితుడు రంగాపై పటమట పోలీసులు పిటి వారెంట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ కోర్టు పిటి వారెంట్ పిటిషన్‌ను అనుమతించింది.

## బాధ్యతా రాహిత్యం సహించబోను
### అధికారులకు మంత్రి సవిత హెచ్చరిక



**పులివెందుల,ఏప్రిల్ 8, ప్రభాత వార్త:** ప్రభుత్వ అధికారులే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను బాధ్యతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని బిసి సంక్షేమశాఖ మరియు జౌళి మంత్రి మరియు వైయస్సార్ కడప జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సవితమ్మ అన్నారు. ఆర్ అండ్ బి అతిథి గృహంలో నియోజకవర్గ ఇన్చార్జ్ బీటెక్ రవి, జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో సర్వ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి శాఖ అధికారి బాధ్యతాయుతంగా విధులను నిర్వర్తిస్తూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని లేకపోతే సెలవు మీద వెళ్లచ్చు అని బాధ్యతారహితంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం శాఖాపరంగా ప్రస్తుతం అమలు అవుతున్న ప్రభుత్వ పథకాల గురించి ఏ మేరకు ప్రజలకు అందాయి ప్రభుత్వంనుంచి ఇంకా ఏమన్నా అందించాల్సిన అవసరాలు ఉన్నాయా అంటూ అడిగి తెలుసుకున్నారు.
వ్యవసాయ శాఖ, హార్టికల్చర్ శాఖలలో రైతులకు అందుతున్న పథకాలను తెలుసుకున్నారు. విద్యుత్ శాఖ, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖ, ఆర్డబ్ల్యూఎస్, డిఆర్‌డిఏ, సాంఘిక సంక్షేమ శాఖ, రోడ్డు భవనాల శాఖ, విద్యాశాఖ తదితర శాఖల నందు అమలవుతున్న పథకాల గురించి కావలసిన నిధులు గురించి అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా తాగునీటి సమస్యను ప్రాధాన్యతగా తీసుకుని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లతో వాటిపై అవగాహన కల్పించాలని కోరారు. సూర్యఘర్ పథకం గురించి కలిగే లాభాలను ప్రజలకి అన్ని శాఖల అధికారులు తీసుకెళ్లాలని సూచించారు. గుంతలనింపు >>2

## చంద్రబాబుకు వాచ్‌మెన్లుగా
# పనిచేస్తున్న పోలీసులు
### రాష్ట్రం అంతటా బీహార్ పరిస్థితులే: మాజీ సిఎం జగన్

**అనంతపురం, ఏప్రిల్ 8, (ప్రభాతవార్త బ్యూరో) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ ఏకపక్షంగా వ్యవహరించడం పై వైఎస్సార్సీ అధినేత జగన్మోహన్ రెడ్డి మరోసారి తీవ్ర స్థాయిలో స్పందించారు. ఈ ప్రభుత్వంలో కూటమి నాయకులు చెప్పినట్టుగా పోలీసులు నడుచుకుంటున్నారని ఆయన ధ్వజమెత్తారు. తమ తల మీద టోపీలో ఉన్న మూడు సింహాలకు సెల్యూట్ చేయాల్సిన పోలీసులు... చంద్రబాబుకు వాచ్మెన్‌గా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరందరికీ ఇదే నా హెచ్చరిక అంటూ ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఎవరైతే టిడిపికి అనుకూలంగా వ్యవహరిస్తూ వైఎస్సార్సీ కార్యకర్తలపై కేసులు పెడుతున్నారో వారందరూ ఎక్కడున్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదని... కచ్చితంగా వారి యూనిఫామ్ తీయించి ఉద్యోగాల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. చట్టపరంగా వారిని దోషులుగా నిలబెడతామని జగన్ అన్నారు. సత్యసాయి జిల్లా రామగిరి మండలం పాపిరెడ్డి పల్లెలో వైఎస్సార్సీ కార్యకర్త లింగమయ్య కుటుంబాన్ని వైఎస్సార్సీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఉదయం 11:30 గంటల ప్రాంతంలో రామగిరి మండలం కుంటిమద్ది గ్రామానికి ప్రత్యేక హెలికాప్టర్లో చేరుకొని అక్కడినుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాపిరెడ్డి పల్లెకు >>2


మంగళవారం విలేకరులతో మాట్లాడుతున్న జగన్

## పగలు తారెత్తిస్తున్న ఎండలు.. రాత్రులు
# ఈదురుగాలులతో వానలు

**విజయవాడ,ఏప్రిల్8,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిలో ఒక పక్క ఎండలు మండుతున్నారు.మరో వైపు సాయంత్రం అవుతుంటే ఈదురుగాలులతో కూడిన వానలు కురుస్తున్నాయి. దక్షిణ మధ్య బంగాళా ఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. అల్పపీడనం ప్రభావంతో ఏపీలో వచ్చే 3 రోజులు వానలు పడనున్నాయి. అలాగే వచ్చే నాలుగు రోజులు గరిష్ట ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు పెరుగుతాయని.. ఆ తర్వాత స్వల్పంగా తగ్గే అవకాశం ఉంది. మరో వైపు రాష్ట్రంలో మరో నాలుగు రోజులు కొన్నిచోట్ల వర్షాలు, కొన్నిచోట్ల ఎండలతో విభిన్నమైన వాతావరణంఉంటుంది.. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.
రాష్ట్రంలో గత కొన్ని రోజుల నుంచి భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. పగలు ఎండలు దంచికొడుతున్నాయి.. సాయంత్రం వేళ ఈదురుగాలులతో వడగండ్ల వర్షం కురుస్తోంది.. ఈ క్రమంలో వాతావరణ శాఖ కీలక ప్రకటన జారీ చేసింది.. బంగాళాఖాతంలో అల్పపీడనం నేపథ్యంలో రాష్ట్రంలో భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నట్లు వాతావరణ >>2

# యేడాదిలోగా భోగాపురం విమానాశ్రయం
### కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

**భోగాపురం (విజయనగరం జిల్లా) , ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** భోగాపురంలో నిర్మితమవుతున్న అంతర్జాతీయ గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం 2026 జూన్ నాటికి పూర్తి అవుతుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహననాయుడు వెల్లడించారు. విమానాశ్రయ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. కాంట్రాక్టు ప్రతినిధులతోనూ, ఇంజనీరింగ్ అధికారులతోనూ పనులపై మాట్లాడి సమీక్ష చేశారు. అలాగే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎపి మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజుతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. గత పాలకకుల నిర్లక్ష్యం కారణంగా 26శాతంగా ఉన్న విమానాశ్రయం నిర్మాణం పనులు నేడు 71 శాతానికిచేరుకున్నాయని అన్నారు. ఇంత వరకు ఎర్త్ వర్క్ పూర్తి అయందని వివరించారు. రన్ వే పనులు 97శాతం, టాక్సీవే పనులు 92 శాతం, టెర్మినల్ బిల్డింగ్ 60 శాతం, ఎటిసి టవర్ 72 శాతం, యాన్సిలర్ బిల్డింగ్ 40 శాతం పనులు పూర్తిఅయనల్లు వివరించారు. ఈ ఎయిర్‌పోర్టు నిర్మానంతో దేశం రూపు రేఖలు మారనున్నాయని ఆయన పేర్కొన్నారు. దేశంలో ఉన్న అధునాతన ఎయిర్‌పోర్టుల్లో భోగాపురంలో ఒకటని అన్నారు. భవిష్యతు అవసరాలను దృష్టిలో పెట్టుకుని 3.8 కిలోమీటర్ల రన్‌వే నిర్మాణం జరుగుతున్నదని అన్నారు. స్తానికంగానే స్కిల్ డెవెలప్‌మెంటు సెంటర్ ఏర్పాటుచేస్తామని మంత్రి రామ్మోహన్‌నాయుడు >>2


మంగళవారం మీడియాతో మాట్లాడుతున్న మంత్రి రామ్మోహన్ నాయుడు



పోర్చుగల్ రాజధాని లిస్బన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆదేశ అధ్యక్షుడు జోన్ ఫెడ్రో అక్స్వెర్ బ్రాన్‌కోను కలిసిన దృశ్యం

# పరస్పర సహకారం

>> ఢిల్లీకి చేరారు. దుబాయ్ యువరారాజు భారత్‌లో చేస్తున్న మొదటి అధికారిక పర్యటన కావడంతో ఆయన వెంట యుఎఇకి చెందిన పలువురు మంత్రులు, ఉన్నతస్థాయి అధికారులు, వ్యాపార వేత్తల బృందం కూడా ఉంది. ద్వైపాక్షిక సంబంధాలు, వాణిజ్యం, రక్షణ సాంస్కృతిక సహకారంపై ఇరుదేశాధినేతలు చర్చించనున్నారు. బుధవారం షేక్ హామ్దన్ ముంబయికి వెళతారు. ఆయన భారత్ యుఎఇలకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్తల సమావేశంలో పాల్గొంటారు. ఈ సమావేశం ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతంచేసేందుకు దోహదంచేస్తుందని విదేశాంగశాఖ ప్రకటించింది. వాణిజ్యసంబంధాల విస్తరణ కీలక అజెండాగా ఉంది. రెండుదేశాలమధ్య ద్వైపాక్షిక వాణిజ్య 85 బిలియన్ డాలర్లు దాటింది. అలాగే భారత్‌లో మౌలికసదుపాయాలు, పునరుత్పాదక ఇంధనం, స్మార్ట్‌సిటీలు, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో యుఎఇనుంచి భారత్ పెట్టుబడులను ఆశిస్తోంది. ఇక దుబాయ్ యువరాజు షేక్ హామ్దన్ యుఎఇ రక్షణమంత్రిగా కూడా వ్యవహరిస్తుండటంతో రెండుదేశాలమధ్య పరస్పర రక్షణ సహకారం బలోపేతంచేయడంపై రాజ్‌నాథ్‌సింగ్‌తో చర్చలుజరుపుతారు. భారతీయ స్టార్టప్‌లు దుబాయిలోని పెట్టుబడిదారులమధ్య భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడంపై చర్చలుజరపనున్నారు. సాంస్కృతిక సంబంధాలను కూడా రెండుదేశాలమధ్య పెంపొందించుకునేదిశగా చర్చలు జరుగుతున్నాయి. అలాగే రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తోకూడా చర్చలుజరిపన యువరాజు రక్షణరంగంలో పరస్పరం కలిసి పనిచేసేందుకు ఒపనపందం జరిగింది.



మంగళవారం న్యూఢిల్లీలో ప్రధానమంత్రి ముద్ర యోజన లబ్దిదారులతో ముఖాముఖీ నిర్వహిస్తున్న ప్రధాని మోడీ

# అమలులోకి వచ్చిన వక్ఫ్ సవరణ చట్టం

## నోటిఫికేషన్ జారీచేసిన కేంద్ర న్యాయశాఖ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:** దేశంలో వక్ఫ్‌సవరణ చట్టం నేటినుంచి అమలులోకి వచ్చింది. ఈమేరకు కేంద్రం నోటిఫికేషన్ జారీచేసింది. గత వారంపార్లమెంటు ఉభయ సభలు సవరణ చట్టాన్ని ఆమోదించి రాష్ట్రపతికి పంపింన విషయం తెలిసిందే. రాష్ట్రపతి బిల్లుకు ఆమోదించగా ఎప్పటినుంచి అమలుకు వస్తుందనేది స్పష్టత రాలేదు. అయితే మంగళవారం నుంచి వక్ఫ్‌చట్టం అమలులోకి వచ్చిందని నోటీఫికేషన్‌లోపేర్కొంది. కేంద్రం పంపిన వక్ఫ్‌చట్టం సవరణ బిల్లును ఏప్రిల్ 8న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. బడ్జెట్ సమావేశాల్లో పార్లమెంటు ఈ బిల్లును ఆమోదించిన విషయం తెలిసిందే. రెండు బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం తెలిపారని న్యాయమంత్రిత్వశాఖ తన నోటిఫికేషన్‌లో వెల్లడించింది. ఏప్రిల్ 4న రాజ్యసభ బిల్లుకు అనుకూలంగా 128 ఓట్లు, వ్యతిరేకంగా 95 ఓట్లురాగా లోక్‌సభ సుదీర్ఘ చర్చ తర్వాత ఏప్రిల్ 3న బిల్లుకు ఆమోదం తెలిపింది. లోక్‌సభలో 288 మంది ఎంపిలుఅనుకూలంగాను 232 మంది వ్యతిరేకంగాను ఓటువేసారు. అయితే 1995 చట్టంప్రకారం వక్ఫ్ అనేది ముస్లిం చట్టంకింద ఒక వ్యక్తి తన ఆస్తిని మతపరమైన దాతృత్వ ఉద్దేశాలకోసం శాశ్వతంగా అంకితంచేయడం. ఒకటి ప్రకటనద్వారా దీర్ఘకాల వినియోగం ఆధారంగా (వక్ఫ్‌బై యూజర్) వారసత్వం అంతరించినపుడు (వక్ఫ్ అలల్ ఔలాద్) ఏర్పడుతుంది. ఈ చట్టంకింద వక్ఫ్ బోర్డులకు ఆస్తులను నిర్వహించేవాటిని వక్ఫ్‌గా ప్రకటించే అధికారం ఉంటుంది. సర్వే కమిషనర్ ఆస్తుల సర్వేచేస్తారు. వివాదాలను వక్ఫ్‌ట్రిబ్యునల్స్ పరిష్కరిస్తాయి. వాటినిర్ణయాలు అంతిమంగా పరిగణిస్తారు. చట్టం ప్రకారం వక్ఫ్‌బోర్డు సభ్యులు ముస్లింలు మాత్రమే కావాల్సి ఉంటుంది. ఆస్తులపై బోర్డుకు పూర్తి నియంత్రణ ఉంటుంది. ఈ విధానంలో పారదర్శకత లేకపోవడం ఆస్తులు దుర్వినియోగం తదితర సమస్యలున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో వక్ఫ్‌బోర్డులు ప్రభుత్వ ఆస్తులనుసైతం వక్ఫ్‌గా ప్రకటించడం వివాదాస్పదంగా మారింది. కొత్తగా తెచ్చిన చట్టంప్రకారంఎవరైనావక్ఫ్ ఆస్తిగాప్రకటించాలంటే ఆ వ్యక్తి కనీసం ఐదేళ్లు ఇస్లాం ఆచరించి ఉండాలి. ఆస్తి ఆతనికి మాత్రమే సొంతమై ఉండాలి. సవరణ చట్టంలో వక్ఫ్‌బై యూజర్ నిబంధన తొలగించారు. వక్ఫ్ అలల్ ఔలాద్‌లో స్త్రీలతో సహా వారసుల హక్కులు కాపాడబడతాయి. సర్వే బాధ్యత సర్వే కమిషనర్‌నుంచి కలెక్టర్‌కు ఇచ్చారు. వక్ఫ్ ఆస్తుల వివరాలు ఆరునెలల్లో కేంద్రీయ పోర్టల్‌లోనమోదుచేయాల్సి ఉంటుంది. వక్ఫ్‌బోర్డుల్లో ఇద్దరు స్త్రీలతోపాటు ఇద్దరు ముస్లిం కాని సభ్యులను సైతం చేర్చాల్సి ఉంటుంది. ట్రిబ్యునల్‌నిర్ణం మాత్రమే అంతిమం కాదు. 90 రోజుల్లో హైకోర్టులో అప్పీలకు అవకాశం ఉంది. ఇకపై వక్ఫ్‌బోర్డులకు ఏకపక్షంగా ఆస్తులను వక్ఫ్‌గా ప్రకటించే అధికారాలు ఉండవు.

# హ్యాట్రిక్ ఓటమి రికార్డుతో చెన్నై సూపర్‌కింగ్స్



## 18 పరుగుల తేడాతో పంజాబ్‌కింగ్స్ గెలుపు

**ముల్లన్‌పూర్(పంజాబ్), ఏప్రిల్ 8:** ఐపిఎల్ 18వ సీజన్‌లో పంజాబ్‌కింగ్స్ మళ్లీ విజయాలతో దూసుకుపోతోంది. ముల్లన్ పూర్ మైదానంలో ప్రియాన్ష్ ఆర్య 103 పరుగులుచేసి మెరుపు సెంచరీతో భారీ స్కోర్ చేసింది పంజాబ్‌జట్టు. మాజీ ఛాంపియన్ సిఎస్కేను 201కే కట్టడి చేసింది. ఈ మ్యాచ్‌తో సిఎస్కే హ్యాట్రిక్ ఓటమి చెత్తరికార్డు మూటగట్టుకుంది. ఈ సీజన్‌లో 190 ప్లస్ లక్ష్యం ఛేదించని సిఎస్కే మళ్లీ విఫలం అయింది ఓపెనర్ డెవాన్‌కాన్వే 69పరుగులతో రిటైర్డ్ హార్ట్‌గా వెనుదిరిగాడు. ఇంపాక్ట్‌ప్లేయర్ శివందూబే 42 పరుగులుచేసాడు.చివరిలో ఎంఎస్‌ధోనీ 22 పరుగులుచేసినా ఓటమినుంచి తప్పించలేకపోయాడు. బౌలింగ్‌లో భారీగా పరుగులిచ్చిన చెన్నై బ్యాటింగ్‌లో రాణించలేక మూడో ఓటమి మూటగట్టుకుంది. రాజస్థాన్ చేతిలో ఓటమినుంచి తేరుకున్న పంజాబ్‌ప్రత్యర్థికి భారీ లక్ష్యం నిర్దేశించి మ్యాచ్‌ను సొంతంచేసుకుంది. ప్రియాన్ష్ ఆర్య విధ్వంసక శతకం, శశాంక్‌సింగ్ 54 నాటౌట్‌లతో చెన్నై సూపర్‌కింగ్స్‌కు 220 పరుగుల టార్గెట్ ఇచ్చింది. ఛేదనలో ఓపెనర్ రచీన్ రవీంద్ర36 పరుగులు చేసాడు. గ్లెన్ మాక్‌నసవెల్ బౌలింగ్‌లో స్టంపౌట్ అయ్యాడు. తర్వాత వచ్చిన కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ ఒకే ఒక్కపరుగుతో ఫెర్గుసన్ బౌలింగ్‌లో ఔట్ అయ్యాడు. 62 పరుగులవద్ద రెండో వికెట్ పడటంతో ఇంపాక్ట్ ప్లేయర్ శివందూబే 42 పరుగులుచేసినాఓఎనర్ డేవాన్ కాన్వే 69 పరుగులుచేసిరిటైర్ట్ హార్ట్‌గా వెనుదిరిగినా మూడో వికెట్‌కు 90 పరుగులు కీలకభాగస్వామ్యం తెచ్చారు. దూబేను బౌల్డ్‌చేసిన ఫెర్గుసన్‌చెన్నైకి షాకిచ్చాడు. ఎంఎస్‌ధోనీ 22, 19వ ఓవర్‌లో బౌండరీ, సిక్స్ ఒకట్టడంతోసిఎస్కే స్కోరు 190 దాటింది. యశ్‌ఠాకూర్‌వేసిన 20వ ఓవర్ తొలిబంతికే ధోనీ ఔట్ అయ్యాడు. చివరి ఓవర్‌లోతొమ్మిది పరుగులు మాత్రమేరావడంతోచెన్నై జట్టు విజయానికి 19 పరుగుల దూరంలో నిలిచిపోయింది.

# గత ఎన్నికల్లో ప్రజల ఇచ్చిన తీర్పుతో జగన్ మానసిక పరిస్థితి దెబ్బతింది: మంత్రి సవిత

**విజయవాడ,ఏప్రిల్8,ప్రభాతవార్తప్రతినిధి:** గత ఎన్నికల్లో ప్రజల ఇచ్చిన తీర్పుతో జగన్ మానసిక పరిస్థితి దెబ్బతిందని, ఇంగ్లాండ్‌వెళ్లి అక్కడి మందులువాడినా నయం కాలేదని మంత్రి సవిత అన్నారు. మంగళ వారం ఆ మేరకు ఆమె తన వ్యక్తిగత కార్యాలయంనుంచి విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆరోపించారు. పోలీసుల గుడ్డలు ఊడదీస్తానంటూ మాట్లాడడం ఆయన ఆహంకారానికి నిదర్శనమన్నారు. పాలించమని ప్రజలు అధికారమిస్తే...అయిదేళ్ల పాటు తాడేపల్లి ప్యాలెస్‌లో పబ్జీలు గేమ్‌లు ఆడుకుంటూ కాలం వెళ్లదీశాడన్నారు. అందుకే ప్రజలు 2024 ఎన్నికల్లో జగన్‌ను 11 సీట్లకే పరిమితం చేశారన్నారు. అనంతపురంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగితే, దానికి జగనే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. చట్టబద్ధంగా, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ ప్రకారం రాష్ట్రంలో పాలన సాగుతోందన్నారు. చట్టబద్ధమైన ప్రభుత్వంపైనా, పోలీసులపైనా ఇష్టారాజ్యంగా, అహంకారపూరితంగా మాట్లాడితే ఊరుకునేది లేదని, నోరు అదుపులో పెట్టుకోవాలని మంత్రి సవిత హెచ్చరించారు. జగన్ కు నిజంగా చిత్తశుద్ధి ఉంటే ముందుగా తన ఇంటి నుంచే నిరూపించుకోవాలని మంత్రి సవిత సూచించారు. ఆస్తుల కోసం తల్లిని, చెల్లిని కోర్టుకు లాగిన దౌర్భాగ్యుడు జగన్ అని మండిపడ్డారు.

# జలహారతి కార్పొరేషన్ ఏర్పాటు

>> 3 లక్షల హెక్టార్ల ఆయకట్టు సాకులోకి వచ్చే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. అలాగే 20 టీఎంసీల మేర నీటిని పరిశ్రమలకు ఇవ్వొచ్చని వెల్లడించారు.

ఈ ప్రాజెక్టుకు రూ.80,112 కోట్ల వ్యయం అవుతుందని ప్రభుత్వం అంచనా వేసినట్లు తెలిపారు. గోదావరి బేసిన్‌లో వృథాగా పోతున్న వరదనీటిని సద్వినియోగం చేసుకునేలా ఈ లింకు ప్రాజెక్టు నిర్మించనున్నట్లు చెప్పారు. పల్నాడు జిల్లా బొల్లాపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి బనకచర్ల రెగ్యులేటర్ వరకూ నీటిని తరలించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సాయిప్రసాద్ తెలిపారు. దీని ద్వారా దాదాపు 150 టీఎంసీల వరకూ నీటిని తరలించేందుకు ఆస్కారం ఉందని, నీటి లోటు ఉన్న జిల్లాలకు ఈ వరద జలాలను తరలించవచ్చని ఆయన చెప్పారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉండే రాయలసీమ జిల్లాలకు నీటిని అందించేందుకు ఈ ప్రాజెక్టు ఉపకరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

పోలవరం బనకచర్ల రెగ్యులేటర్‌కు కాలువలు, ఎత్తిపోతల పథకాలు, భూగర్భ పైప్ లైన్లు, సొరంగాల ద్వారా నల్లమల నుంచి నీటిని తరలించాల్సి ఉంటుందని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. దీని కోసం ఓ ప్రత్యేక వాహక సంస్థగా జలహారతి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్టుగా దీన్ని తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోందని వెల్లడించారు. ఎస్పీవీగా బహిరంగ మార్కెట్ల నుంచి నిధులు సేకరించేందుకు అవకాశం ఉందని జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ తెలిపారు.

# కళారంగంలో కందుకూరి పురస్కారాలు

## మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ:ఏప్రిల్8,ప్రభాతవార్తప్రతినిధి:** 16వ తేదీన ప్రముఖ రచయిత, సంఘ సంస్కర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి కందుకూరి వీరేశలింగం పంతులు గారి 177వ జయంతిని పురస్కరించుకొని విజయవాడలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తెలుగు నాటక రంగ దినోత్సవం నిర్వహించాలని నిర్ణయించిందని మంత్రి కందుల దుర్గేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో కందుకూరి పురస్కారాల ఎంపికకు నాటక, సినీ రచయిత, పరిషత్ నిర్వాహకులు డా.బుర్రా సాయిమాధవ్ అధ్యక్షతన 11 మంది సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటు చేస్తూ ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని వివరాలు వెల్లడించారు. రాష్ట్రస్థాయిలో 3 కందుకూరి ప్రతిష్టాత్మక రంగస్థల పురస్కారాలు, ఒక్కో జిల్లాకు 5 చొప్పున మొత్తం 26 జిల్లాల్లో 130 జిల్లా స్థాయి కందుకూరి విశిష్ట పురస్కారాలు అందించనున్నామన్నారు. ఈ క్రమంలో ప్రతిభ గల నాటక రంగ కళాకారులు, సాంకేతిక నిపుణులను ఎంపిక చేసేందుకు కమిటీ పనిచేస్తుందన్నారు. కమిటీలో సభ్యులుగా నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షులు ఈదర హరిబాబు, రచయిత, దర్శకులు,కళాకారులు డా. పాటిబండ్ల ఆనందరావు,సాంఘిక, నాటక కళాకారులు చిక్కాల బాలాజీ, దర్శకులు, రచయిత, కళాకారులు కెకెఎల్ స్వామి,దర్శకులు, కళాకారులు పి బాలాజీ నాయక్, దర్శకులు, రచయిత, కళాకారులు దాసరి చలపతి రావు(గంగోత్రి సాయి), లలిత కళా సమితి అధ్యక్షురాలు,అడ్వకేట్ జి. పద్మజ, నాటక పరిషత్ నిర్వాహకులు, పరిషత్ సమాఖ్య అధ్యక్షులు బుద్దాల వెంకటరామారావు, మెంబర్ కన్వీనర్ గా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టీవీ మరియు నాటక రంగ అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ హిమాన్షు శుక్లా, ఐఏఎస్ ఉన్నారని మంత్రి కందుల దుర్గేష్ ఒక ప్రకటనలో తెలిపారు. కళా, నాటక రంగాలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.

# నేడు అమరావతిలో సిఎం చంద్రబాబు ఇంటికి శంకుస్థాపన

**విజయవాడ ఏప్రిల్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో తన సొంతింటి నిర్మాణానికి సిఎం చంద్రబాబు బుధవారం శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 8.51 గంటలకు సిఎం కుటుంబ సభ్యులు భూమి పూజ చేస్తారు. వెలగపూడి సచివాలయం వెనుక ఇ9 రహదారి పక్కనే ఇంటి నిర్మాణం చేపట్టనున్నారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు కుటుంబానికి వెలగపూడి గ్రామస్థులు పట్టువస్త్రాలు అందించనున్నారు. రాజధానిలో సొంతింటి నిర్మాణం కోసం చంద్రబాబు కుటుంబం రైతుల నుంచి ఐదెకరాల భూమి కొనుగోలు చేసింది.

## వారం - వర్జ్యం

తేది : 09-04-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, శుక్లపక్షం,
శుక్ల ద్వాదశి రా.10.57
మఖ ఉ.9.58
వర్జ్యం సా.6.47 – రా.8.33
దు.ఉ.11.45- మ.12.35
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** ఇంటర్వ్యూలు, పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. విందు, వినోదాలలో పాల్గొంటారు. వస్తులాభం.

**వృషభం:** విలువైన వస్తువులు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. వృత్తివ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. వాహనసౌఖ్యం.

**మిథునం:** భూ వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. దూరప్రాంతాల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**కర్కాటకం :** ప్రయాణాలలో తొందర పాటు వద్దు. పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు.

**సింహం:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించుకుంటారు. ఆరోగ్యం పట్ల మెలుకువ చాలా అవసరం.

**కన్య :** అనుకోని ఖర్చులు ఎదురై చికాకులు పెడతాయి. కుటుంబ సమస్యలు ఎదురైన అధిగమిస్తారు.

**తుల :** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఉద్యోగులకు ఆకస్మిక బదిలీలు వుంటాయి.

**వృశ్చికం:** మిత్రుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. అనుకోని ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి.

**ధనుస్సు:** సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. వస్తులాభం.

**మకరం:** దూర ప్రాంతాల నుండి వచ్చిన వార్త కొంత ఊరట కలిగిస్తుంది. జీవిత భాగస్వామితో ఏర్పడిన వివాదాలు తీరుతాయి.

**కుంభం:** ధనవ్యయం. విలువైన వస్తువులు, పత్రాలు జాగ్రత్త అవసరం. వివాదాలకు, తగాదాలకు దూరంగా వుండండి.

**మీనం :** ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. బంధువులను కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# భోగాపురం విమానాశ్రయం

>> వివరించారు. ఉత్తరాంధ్ర సంస్కృతి, సంప్రదాయం, కళలు తెలియజేసేలా విమానాశ్రయం లోపల ఇంటీరియల్ డిజేన్ ఉంటుందని అన్నారు. బీచ్ క్యారిడార్‌పై కొత్త డిపిఆర్‌ని తయారు చేసు_న్నట్లు వెల్లడించారు. స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని ఆయన వివరించారు. అ ప్రోచ్ రహదారి సమస్యను సిఎం చంద్రబాబునాయుడుతో చర్చించి పరిష్కరిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఎయిర్‌పోర్టు భూనిర్వాసితుల సమస్యలను ఎపి మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు మంత్రి రామ్మోహన్‌నాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎంఎస్ఎంఇ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు,మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు,జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జిల్లా ఎస్‌పి వకుల్ జిందల్,ఆర్‌డిఓ దాట్ల కీర్తి, పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# రాత్రులు ఈదురుగాలులతో వానలు

>> శాఖ అధికారులు తెలిపారు ఆంధ్రప్రదేశ్‌లో విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయి.. ఈ క్రమంలో వాతావరణ శాఖ అలర్ట్ జారీ చేసింది. కొన్ని ప్రాంతాల్లో వర్షాలు, మరికొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.. తమిళనాడు, దాని పరిసర ప్రాంతాలలో ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 1.5 కి.మీ ఎత్తు వరకు విస్తరించి ఉంది.. నిన్నటి తూర్పు గాలుల ద్రోణి దక్షిణ అంతర్గత కర్ణాటక నుండి నైరుతి మధ్యప్రదేశ్ వరకు మరాఠ్వాడ మీదుగా సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ ఎత్తులో విస్తరించి ఈరోజు తక్కువగా గుర్తించబడినది. నిన్నటి ఉపరితల ఆవర్తనం ఉత్తర ఆంధ్రప్రదేశ్, దానిని ఆనుకుని ఉన్న దక్షిణ ఒడిశాపై సముద్ర మట్టానికి 0.9 కి.మీ ఎత్తులో విస్తరించి, ఈరోజు తక్కువగా గుర్తించబడినది. వీటి ఫలితంగా రాష్ట్రంలో రాగల మూడు రోజుల వరకు వాతావరణ సూచనలు గమనిస్తే ఎండలు అధికంగానే ఉంటాయి. రాయలసీమతోపాటు కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలో గరిష్ట ఉష్ణోగ్రతలు రాగాల ఐదు రోజుల్లో క్రమంగా 2 నుండి 4 డిగ్రీల సెంటీగ్రేడ్ పెరిగే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రము సంచాలకులు ప్రకటనలో తెలిపారు.వాతావరణ శాఖ చెప్పినట్లుగానే ఆయా జిల్లాలో గరిష్టంగా 40 నుంచి 41,2 సగటు ఉష్ణోగ్రతలున్నాయి.

# పనిచేస్తున్న పోలీసులు

>> రోడ్డు మార్గాన చేరుకొని ఎంపిపి ఎన్నికల సమయంలో హత్యకు గురైన వైఎస్సార్సీ కార్యకర్త లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించి అక్కడే మీడియా పాయింట్లో విలేకరులతో మాట్లాడారు. తర్వాత మధ్యాహ్నం 1:30 గంటల ప్రాంతంలో రామగిరి మండలం పాపిరెడ్డి పల్లె వద్ద నుంచి రోడ్డు మార్గాన ఎన్ఎస్ గేటుకు చేరుకొని జాతీయ రహదారి మీదుగా బెంగళూరుకు వెళ్లారు. రామగిరి మండలం పాపిరెడ్డి పల్లెలో వైఎస్ జగన్ విలేకరులతో మాట్లాడుతూ గతంలో బీహార్ లో ఉన్న పరిస్థితులు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ రాష్ట్రంలో కనిపిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని.. చంద్రబాబు ఎంత భయపెట్టినా, ప్రలోభాలు పెట్టిన ఎంపిపి ఎన్నికల్లో వైఎస్సార్సీ గెలిచిందని.. 50 చోట్ల ఎన్నికలు జరిగిన 39 చోట్ల వైఎస్సార్సీ గెలిచిందని.. 7చోట్ల టిడిపి వారే వాయిదా వేయించారన్నారు. రామగిరిలో 8మంది మా ఎంపిటిసిలు ఉన్నా.. ఇక్కడ టిడిపి ఎమ్మెల్యే, ఆమె తనయుడు, రామగిరి ఎస్ఐ దౌర్జన్యాలు చేశారన్నారు. పెనుకొండలో మా ఎంపీటీసీలను కిడ్నాప్ చేసే ప్రయత్నం చేస్తే.. దాన్ని అడ్డుకున్నందుకు ప్రకాష్ రెడ్డి, ఉషాశ్రీపై కేసులు పెట్టారన్నారు. ఎన్నికలో గెలవకపోవడంతో భయం క్రియేట్ చేయాలని చూశారని అందులో భాగంగానే లింగమయ్యను బేస్ బాల్ కట్టెతో కొట్టి చంపారన్నారు. ఈ ఘటనలో 20మంది మీద అటాక్ చేస్తే.. ఇద్దరు మీద కేసు పెట్టారన్నారు. గ్రామంలో రెచ్చగొట్టిన ఎమ్మెల్యే కొడుకు, ఎమ్మెల్యే, ఆమె బంధువులపై ఎందుకు కేసులు పెట్టలేదన్నారు. లింగమయ్య భార్యతో బలవంతంగా వేలిముద్ర వేయించారని.. టిడిపి వారినే సాక్షులుగా ఇందులో చేర్చారంటే ఇంతకంటే దారుణం ఎక్కడైనా ఉందా అని ప్రశ్నించారు..

# భాగస్వామ్యంతోనే లక్ష్యాల సాధన

>> మందికి చేయూతను ఇవ్వడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల కుటుంబాలను ఎంపిక చేశాం. ఒకప్పుడు నేనిచ్చిన జన్మభూమి పిలుపుకు స్పందించి ప్రపంచంలోని తెలుగువారు కదిలివచ్చారు. సొంతూర్లలో రోడ్లు వేశారు. స్మశానాలు కట్టించారు. ఆ స్ఫూర్తి కొనసాగించాలని మార్గదర్శిలను కోరుతున్నాను. దాతలు ముందుకొచ్చి బంగారు కుటుంబాలను తయారుచేస్తే వారు ఆర్థికంగా ఎదిగి మార్గదర్శిలుగా తయారవుతారు.

**5 లక్షల బంగారు కుటుంబాల దత్తత లక్ష్యం**

ఆగస్ట్ 15 కల్లా 5 లక్షల బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా చూడాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా మార్గదర్శి, బంగారు కుటుంబాల నమోదు చేపడుతున్నట్టు సమీక్షలో అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇందుకోసం మిలాప్, డొనేట్‌కార్ట్, రంగ్‌దే సంస్థలు ప్లేయర్లుగా పి4లో భాగస్వాములు అవుతున్నాయని తెలిపారు. దాతలు కుటుంబాలను, మండలాలను, గ్రామాలను కూడా దత్తత తీసుకోవడంతో పాటు, నిధులు సమకూర్చేలా పి4 రూపకల్పన చేశామన్నారు. దాతలు తాము ఎవరికి ఆర్థికంగా సాయం చేయాలి అనుకుంటున్నారో... ఆన్ లైన్ ద్వారా కూడా వారికి సాయం అందించే అవకాశాన్ని కల్పించామన్నారు. దాతలు ముందుగా పి4 ప్లాట్ ఫామ్ ద్వారా లాగిన్ అవ్వడంతో ప్రక్రియ ప్రారంభమవుందని చెప్పారు. ఆగస్ట్ నాటికి ఈ నమోదు ప్రక్రియ పూర్తి చేసి కార్యరూపం దాల్చేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులను నిర్దేశించారు. వచ్చే ఏడాది ఉగాది నాటికల్లా పి4 కార్యక్రమం ద్వారా ఏడాది కాలంలో ఏం సాధించామనే దానిపై వార్షిక ప్రగతి నివేదిక విడుదల చేయాలని స్పష్టం చేశారు. జీవన ప్రమాణాలు పెంచుకోవాలనే మార్గదర్శులను తెచ్చామని చంద్రబాబు వివరించారు. బంగారు కుటుంబాలను గుర్తించి ఆదుకుంటున్నామని చెప్పారు. తెలివితేటలతో పని చేస్తే కష్టపడాల్సిన అవసరం లేదన్నారు. సమాజంలో గుర్తింపు, గౌరవం కావాలని ప్రతిఒక్కరూ ఆశిస్తారని తెలిపారు. సమాజానికి మనం ఉపయోగపడితే గుర్తింపు, గౌరవం దానంతట అదే వస్తుందని అన్నారు. పేదరికంలో ఉన్నవారు బంగారు కుటుంబంలో చేరవచ్చని వారిని మార్గదర్శులు ఆదుకుంటారని పేర్కొన్నారు. బాగా పనిచేసిన మార్గదర్శులను గుర్తించి సన్మానిస్తానని తెలియజేశారు. సమాజానికి ఎంతో కొంత ఇవ్వాల్సిన బాధ్యత సంపన్నులదని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

పి4 కార్యక్రమం ఒక చరిత్ర. ప్రపంచంలో ఎక్కడా ఇలాంటిది జరగలేదు. సమాజంలో ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయి వాటిని తగ్గించాలి. అందరూ పేదరికంలోనే పుట్టాం అవకాశాలను అందుకోవడమే ముఖ్యం. డబ్బు వల్ల సమాజంలో గుర్తింపురాదు, మంచిపని చేస్తేనే వస్తుంది. ఎస్సీ వర్గీకరణ జరగాలని 30 ఏళ్ల క్రితమే నిర్ణయించాం. అన్ని గ్రామాల్లో రోడ్లు బాగు చేశాం. ఇది మంచి మార్పు అని చంద్రబాబు తెలిపారు. ఈ నెల 15 నుంచి ఇంటింటికీ మన మిత్రవాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమంఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. సచివాలయ సిబ్బందిప్రతి పౌరుడి ఫోనులో 9552300009 నంబరు మన మిత్రపేరిట సేవ్ చేయనున్న సచివాలయ సిబ్బంది తెలిపారు. ఫోనులో మనమిత్ర పేరిట 9552300009 నంబరును సేవ్ చేసుకోవాలన్నారు. ప్రజల చేతిలో ప్రభుత్వం అనే ఆశయంతో రాష్ట్ర ప్రభుత్వం మన మిత్రపేరుతో తీసుకొచ్చిన వాట్సాప్ గవరెన్స్ నంబరు 9552300009 రాష్ట్రంలోని పౌరులందరూ తమ మొబైల్ ఫోన్లలో మనమిత్ర పేరుతో తప్పనిసరిగా సేవ్ చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు విజప్తి చేసింది.సిఎం చంద్రబాబు నాయుడు ఆశయాలకనుగుణంగా ఐటీ మరియు ఆర్టీజీ శాఖ మంత్రి నారా లోకేష్ ఆలోచనల నుంచి వాట్సాప్ గవర్నెన్స్ అనే వినూత్న సౌలభ్యాన్ని ప్రభుత్వం ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చింది. మన మిత్ర పేరుతో మెటా వారి సహకారంతో తీసుకొచ్చిన ఈ వాట్సాప్ గవర్నెన్స్ ఇప్పటికే ప్రజామన్ననలు చూరగొంటోంది. దీన్ని ప్రజలకు మరింత చేరువగా తీసుకెళ్లే దిశగా ప్రభుత్వం విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఈ నెల 15వ తేదీ నుంచి ఇంటింటికీ మన మిత్ర పేరిట స్పెషల్ డ్రైవ్ నిర్వహించనుంది. ఈ కార్యక్రమంలో భాగంగా అన్ని జిల్లల్లోని సచివాలయ సిబ్బంది తమ సచివాలయ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లీ ఆ ఇంట్లో ఉన్న ప్రతి ఒక్కరి మొబైల్ ఫోనులో మనమిత్ర పేరిట వాట్సాప్ గవర్నెన్స్ నంబరు 9552300009 సేవ్ చేయిస్తారు. అలాగే ఈ వాట్సాప్ గవర్నెన్స్‌ను ఎలా ఉపయోగించాలి, దాని ద్వారా ప్రభుత్వ సేవలు ఎలా పొందాలి అనే దానిపైన ఆ కుటుంబంలో ఉన్నవారందరికీ అవగాహన కల్పిస్తారు. ప్రస్తుతం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వం 250 రకాల సేవలను అందిస్తోంది. జూన్ 12వ తేదీకల్లా 500లకుపైగా సేవలు కల్పించాలనే లక్ష్యంతో పనిచేస్తోంది. తరువాత దశల్లో మొత్తం 1000కి పైగా సేవలు ప్రజలకు వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందించాలన్నదే ప్రభుత్వ అంతిమ లక్ష్యం. ప్రజలెవ్వరూ కూడా ప్రభుత్వం నుంచి పొందవలచిన సేవల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లకుండా జనన, మరణ ధృవీకరణ పత్రాల మొదలు, ప్రభుత్వం జారీ చేసే అన్ని రకాల ధృవీకరణ పత్రాలను తమ వాట్సాప్ ద్వారా ఇట్టే డౌన్‌లోడు చేసుకునే సదుపాయం కల్పిస్తోంది. తమ ఆధార్ అనుసంధాన మొబైల్ నంబరు సాయంతో ఈ సేవలు క్షణాల్లో పొందవచ్చు. ఈ దిశగా ప్రభుత్వం లోని అన్ని శాఖలను ప్రభుత్వ యంత్రాగాన్ని సమాయాత్తం చేస్తున్నారు. కేవలం ఇవే కాకుండా బస్ టికెట్లు రిజర్వు చేసుకోవడం, విద్యుత్తు బిల్లులు, ఆస్తి పన్ను, నీటి పన్ను లాంటి చెల్లింపులు కూడా సులభంగా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా చేసే సదుపాయం ఇందులో కల్పించారు. తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవారి ఆలయ సేవలతో పాటు రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల సేవలన్నీ కూడా ఇందులో పొందే సుదపాయం కల్పించారు.

# బాధ్యతా రాహిత్యం సహించబోను

>> పథకంలో మంచి పురోగతి సాధించడం పట్ల సంబంధిత అధికారులను ప్రశంసించారు. మా రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ ఎక్కడ చూసినా ప్రజలు ట్రాన్స్ఫార్మర్లు కండక్టర్ల కావాలని కోరుకుంటున్నారని పులివెందుల నియోజక వర్గాన్ని ప్రత్యేక స్థానంగా గుర్తించి అవసరం మేరకు వాటిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేసేలా కృషి చేయాలని ఇన్ చార్జ్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు అందుకు ఆమె సానుకూలంగా స్పందించారు. మరొక నెలలో మళ్లీ సమీక్ష సమావేశం జరుగుతుందని ఆ సమావేశానికి అల్లా అన్ని శాఖల అధికారులు వారివారి శాఖల్లో పురోగతిని కచ్చితంగా సాధించాలని లేనియెడల తగిన చర్యలు తీసుకొని బడునని ఆమె అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, తుంగభద్ర నీటి సంఘచైర్మన్ జోగిరెడ్డి, ఆర్డిఓ,వివిధ శాఖల అధికారులు, తహసిల్దారులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పవన్ చిన్నకుమారుడికి ప్రమాదం

## సింగపూర్‌కు వెళ్లిన డిప్యూటీ సీఎం కుటుంబం - సింగపూర్ బయలుదేరి వెళ్ళిన,డిప్యూటీ సీఎం...ఆయన అన్న మాజీ కేంద్రమంత్రి చిరంజీవి ఇతర కుటుంబసభ్యులు - మార్క్ శంకర్ త్వరగా కొలుకోవాలని ఆకాంక్షించిన సిఎం చంద్రబాబు, మార్క్‌కు ఎటువంటి ఇబ్బంది లేదని తెలిపిన చిరంజీవి - గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ పరామర్శ

**విజయవాడ ఏప్రిల్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ పవనోవిచ్ సింగపూర్‌లో తాను చదువుకుంటున్న పాఠశాలలో జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడ్డాడు. అగ్నిప్రమాదంలో అతడి చేతులు కాళ్లకు గాయాలయ్యాయి. అతడితో పాటు పలువురు చిన్నారులు గాయపడగా వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సింగపూర్‌లోని రివర్ వ్యాలీ షాప్‌హౌస్‌లో మంగళవారం ఉదయం 9.45 గంటలకు ఈ ఘటన చోటచేసుకుంది. ఈ భవనంలో చిన్నారులకు క్యాంప్ నిర్వహిస్తున్నారు. రెండు, మూడు అంతస్తుల్లో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న సింగపూర్ సివిల్ డిఫెన్స్ ఫోర్స్ ఘటనాస్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టింది. భవనం లోపల చిక్కుకున్న వారిని రక్షించి రెస్క్యూ సిబ్బంది బయటకు తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో 15 మంది చిన్నారులు సహా 19 మంది గాయపడ్డారు. వీరిని స్థానిక ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతూ అందులో ఓ చిన్నారి ప్రాణాలు కోల్పోయినట్లు సింగపూర్ మీడియా కథనాలు వెల్లడించాయి. ప్రస్తుతం పవన్ అల్లూరి సీతారామరాజు జిల్లా పర్యటనలో ఉన్నారు. కార్యక్రమాలను రద్దు చేసుకొని సింగపూర్ వెళ్లాలని పార్టీ నేతలు ఆయనకు సూచించారు. ఇచ్చినమాట ప్రకారం గిరిజనులను కలిసి వెళ్తానని పవన్ చెప్పారు. ప్రారంభించాల్సిన అభివృద్ధి కార్యక్రమాలకు ఏర్పాట్లు చేసినందున వాటిని పూర్తిచేసుకున్నారు.. అల్లూరి సీతారామరాజు జిల్లా పర్యటన ముగిసిన తర్వాత పవన్ సింగపూర్‌కు బయలుదేరి వెళ్ళారుఆయన అన్న మాజీ కేంద్రమంత్రి మెగాస్టార్ చిరంజీవి మార్క్ తన స్కూల్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడ్డారని,కాళ్ళు,చేతుల కాలినట్లు వివరించారు. శ్వాస తీసుకోవడంలో మార్క్‌కు ఇబ్బందిపడుతున్నాడని వివరించారు.ఎవ్వరు ఆందోళన చెందవద్దని,అతను కొలుకుంటాడని సామాజిక మాధ్యమం వేదికగా ప్రకటించారు.చిరంజీవి తన భార్య సురేఖతో సింగపూర్ వెళ్ళారు.చిరంజీవి సతీమణి పవనోవిచ్ సింగపూర్ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యాబ్యాసం చేస్తూ అక్కడే ఉంటున్నారు.దాంతో పవన్ కుమారుడు మార్క్ శంకర్‌కు అక్కడే చదువుకుంటున్నారు.పవన్ కల్యాణ్ కుమారునికి అగ్ని ప్రమాదంలో గాయాల కావడం పట్ల సీఎం చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేసారు.మార్క్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.పవన్‌ను ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ ఫోన్ ద్వారా పరామర్శించారు.శంకర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ప్రమాదం తీవ్రత ఇంతలా ఉంటుందని ఊహించలేదు,, కంగారు పడకండి, నాకుమారుడు కొలుకొంటున్నాడు సింగపూర్‌లో తన కుమారుడు కొలుకొంటున్నాడనిపవన్ కల్యాణ్ వెల్లడించారు.ఆయన జెఎస్పీ కార్యాలయం ద్వారా విడుదల చేసిన ప్రకటనలోను,“ఎక్స్” వేదికలోను ఈ విషయం స్పష్టం చేసారు.అరకు పర్యటనలో ఉన్నప్పుడు నాకు ఫోన్ వచ్చింది పవన్ నా కుమారుడు చదువుతున్న స్కూల్‌లో ప్రమాదం జరిగింది ప్రమాదం తీవ్రత ఇంతలా ఉంటుందని ఊహించలేదుపవన్ తెలిపారు. మార్క్ శంకర్ చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి ఊపిరితిత్తుల్లోకి పొగ వెళ్లినట్టు తెలిసింది.పవన్ ఘటనపై ప్రధాని మోదీ ఫోన్ చేసి ఆరా తీశారు సింగపూర్ హైకమిషనర్ కూడా సమాచారం అందించారు చంద్రబాబు సహా స్పందించిన వారందరికీ కృతజ్ఞతలు అకీరా పుట్టినరోజున ప్రమాదం జరగడం దురదృష్టకరం పొగ పీల్చడం వల్ల ఇబ్బందులు రావడంతో.. వైద్యులు చికిత్స అందిస్తున్నారని పవన్‌కల్యాణ్ తెలిపారు.మార్క్ శంకర్ క్రమంగా కోలుకొంటున్నాడు. ప్రమాద విషయం తెలుసుకొని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఫోన్ చేసి మార్క్ ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేసి ధైర్యం చెప్పారు. సింగపూర్ లో అవసరమైన సహకారం అందించవలసిందిగా అక్కడి హై కమిషనర్ కు దిశానిర్దేశం చేశారు. వారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫోన్ చేసి మాట్లాడారు. మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారికి నా ధన్యవాదాలు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు ఫోన్ చేసి ఆంధ్ర ప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ , తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు, ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శ్రీ జగన్ మోహన్ రెడ్డి తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళనిస్వామి గారు, కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి శ్రీ బండి సంజయ్ ఆంధ్ర ప్రదేశ్ ఉప సభాపతి రఘు రామకృష్ణంరాజు రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్ కె.ఆచ్చెన్నాయుడు గారు, నాదెండ్ల మనోహర్ , దుర్గేష్ బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డా.కె.లక్ష్మణ్ బి.ఆర్.ఎస్. వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.ఆర్. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి శ్రీ కె. రామకృష్ణ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సహచర సినీ నటులు, సినిమా రంగ ప్రముఖులు సామాజిక మాధ్యమాల ద్వారా, వివిధ మాధ్యమాల ద్వారా మార్క్ శంకర్ కోలుకోవాలని ఆకాంక్షించారు.

నాయకులు, కార్యకర్తలు దేవాలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించి మార్క్ శంకర్ ఆరోగ్యంగా ఉండాలని ప్రత్తించారు. ఇంతమంది మంచి మనసుతో ఆకాంక్షించి, ఆశీస్సులు అందించడంతో మార్క్ శంకర్ క్రమంగా కోలుకొంటున్నాడు. ప్రతి ఒక్కరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను.

**మార్క్‌శంకర్ త్వరగా కొలుకోవాలి -చంద్రబాబు**

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కుమారుడి ప్రమాద సమాచారం అందుకున్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ట్విట్టర్ ద్వారా స్పందించారు. ఈ సందర్భంగా సీఎం తన ట్వీట్లో “సింగపూర్ లోని స్కూల్లో జరిగిన అగ్నిప్రమాద ఘటనలో అక్కడ చదువుకుంటున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ కు గాయాలైన విషయం ఆందోళన కలిగించింది. సింగపూర్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న శంకర్ త్వరగా కోలుకోవాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను.“ అని రాసుకొచ్చారు. కాగా సింగపూర్లోని ఒక పాఠశాలలో జరిగిన అగ్నిప్రమాదంలో ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుమారుడు మార్క్ శంకర్ గాయపడినట్లు తెలుసుకుని దిగ్భ్రాంతికి లోనయ్యానని కేటీఆర్ ట్వీట్ చేశారు. చిన్నారి త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానని తెలిపారు.

పవన్ కుమారుడు త్వరగా కోలుకోవాలి మాజీ సీఎం జగన్

పవన్ కుమారుడు త్వరగా కోలుకోవాలి మాజీ సీఎం జగన్‌ఎక్స్ వేధికగా కోరుకున్న వైఎస్ జగన్మోహన్ రెడ్డిసింగపూర్‌లోని ఒక పాఠశాలలో జరిగిన అగ్ని ప్రమాదంలో పవన్ కల్యాణ్ కుమారుడు మార్క్ శంకర్ గాయపడ్డారని తెలిసి నేను షాక్ అయ్యాను. ఈ క్లిష్ట సమయంలో నా ఆలోచనలు వారి కుటుంబంతో ఉన్నాయి. ఆయన త్వరగా పూర్తిగా కోలుకోవాలని కోరుకుంటున్నానన్నారు.ఇక వైకాంగ్రెస్‌పార్టీ నేతలు ఆర్కె రోజా,డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్, ఆరే శ్యామల,పేర్ని నాని,కురసాల కన్నబాబు మార్క్‌శంకర్ త్వరగా కొలుకోవాలని ఆకాంక్షించారు,.

**మార్క్ శంకర్ త్వరగా కొలుకోవాలి - తెలంగాణా సీఎం రేవంత్‌రెడ్డి**

సింగపూర్‌లో పవన్ కల్యాణ్ కుమారుడు మార్క్‌శంకర్ గాయపడిన ఘటన దిగ్భ్రాంతికి లోను చేసిందని తెలంగాణా సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.అతను త్వరగా కొలుకోవాలని,పవన్ ధైర్యంగా ఉండాలని “ఎక్స్” వేదికగా రేవంత్ పేర్కొన్నారు.తెలంగాణా శాసనసభలో విపక్షనేత కె,.తారకరామారావు మార్క్‌శంకర్ త్వరగా కొలుకోవాలని ఆకాంక్షించారు.

# తిరుమల సమాచారం

## రేపటి నుండి మలయప్ప ఉత్సవర్లకు వసంతోత్సవాలు -11న రథోత్సవం



**తిరుమల,ఏప్రిల్ 8ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలోని వసంతమండపంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు వేసవితాపం నుండి ఉపశమనం కోసం శాస్త్రోక్తంగా మూడురోజులు వసంతోత్సవాలు జరగనున్నాయి. ఈ వసంతోత్సవాలకు ఆలయానికి పడమరవైపు ఉన్న వసంతమండపాన్ని సహజప్రకృతిసిద్ధంగా పలు రకాల వివిధ జాతి పండ్లు, పుష్పాలు, వన్యప్రాణుల చిహ్నాలు, వట్టివేర్లతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.వసంతోత్సవాల్లో తొలిరోజు మధ్యాహ్నం శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామివార్లకు విశేష స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. రెండవరోజు 11వతేదీ శుక్రవారం రథోత్సవం, 12వతేదీ చివరగా శనివారం మలయప్పస్వామికి, కోదండరామస్వామికి, శ్రీకృష్ణస్వామి ఉత్సవర్లకు విశేష స్నపన తిరుమంజనం వేదోక్తంగా నిర్వహించి అనంతరం ఆలయ మాఢవీధుల్లో ఊరేగుతారు. ఈ వసంతోత్సవాలతో పలు ఆర్జిత సేవలు రద్దయ్యాయి.. ఇప్పటికే ఆన్‌లైన్‌లో విడుదల చేసిన ఆర్జితసేవ టిక్కెట్లు అందుకున్న గృహస్థభక్తులు ఆయా రోజుల్లో సేవలో పాల్గొంటారు.

## శ్రీవారి ఆశీస్సులు కలగాలి : సింఘానియా

**తిరుమల,ఏప్రిల్ 8ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ శుభాలు కలగాలని ప్రముఖులు తెలిపారు. మంగళవారం ఉదయం రేమాండ్స్ అధినేత గౌతమ్‌సింఘానియా, హోంగార్డ్సు ఫైర్‌సర్వీస్ డిజి వివేక్ శ్రీవాస్తవ, క్రికెటర్ రవిశాస్త్రి, భారతీయ మాస్టర్ హ్యాండ్లూమ్స్ డిజైనర్ గజం అంజయ్య లు వేర్వేరుగా తిరుమలకు వచ్చారు. ఉదయం ప్రోటోకాల్ విఐపి బ్రేక్ దర్శనంలో ఇష్టదైవమ్ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## సకల సదుపాయాలతో త్వరలో పిఎసి - 5 అందుబాటులోకి

**తిరుమల,ఏప్రిల్ 8ప్రభాతవార్తప్రతినిది:** శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు వస్తున్న భక్తుల సంఖ్య రెట్టింపైన నేపథ్యంలో సామాన్యభక్తులకోసం అదనంగా వసతి కల్పించేందుకు నిర్మాణంలో ఉన్న పిఎసి 5 పనులు త్వరగా పూర్తికావాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి అధికారులను ఆదేశించారు. పిఎసి 5లో కల్యాణకట్ట,డైనింగ్ హాల్, లాకర్ల ఏర్పాటు, మరుగుదొడ్లు తదితర వాటిని పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. యాత్రికుల వసతి సముదాయం -5ని అధూనాతనంగా సౌకర్యాలు ఉండాలన్నారు. ఈ పనులను ఆయన మంగళవారం సాయంత్రం డిప్యూటీ ఇఒలు పి.హరీంధ్రనాధ్, రాజేంద్ర, వెంకటయ్య, ఇఇలు వేణుగోపాల్, సుధాకర్, డిఇ చంద్రశేఖర్,విఎస్‌ఒ సురేంద్రతో కలసి తనిఖీ చేశారు.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayIndia
మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in
బహిరంగ-ఇ-టెండర్ ప్రకటన నం. DRM/వర్క్స్/BZA/08/2025 తేది : 04.04.2025
PUB/0354
భారత రాష్ట్రపతి తరపున దిగువ సంతకందారుడు ఈ క్రింది పనులకు ఒక్కొక్కదాని ఎదురుగా పేర్కొనబడిన తేదీ మరియు 15.00గం. వరకు ఇ-టెండర్లు కోరుతున్నారు.
క్ర.సం.: 1. టెండర్ నం.: E-15-EAST-BZA-2025, పనివివరాలు: పనిపేరు: విజయవాడ డివిజన్ : సీనియర్ DEN/ఈస్ట్/BZA పరిధి యొక్క ADEN/లైన్స్/BZA సబ్‌డివిజన్ క్రింద SSE/P-వే /GDV సెక్షన్‌లో ఇతర ట్రాక్ వివిధ రకాల పనులు మరియు ప్రతిపాదిత భద్రతా సంబంధిత ట్రాక్ నిర్వహణ పనులు. పూర్తి చేయు కాలం : 12 (పన్నెండు నెలలు). టెండర్ విలువ : రూ. 91,87,977.00. బయానా : రూ.1,83,800.00. ముగింపు యొక్క తేదీ : 17.04.2025.
క్ర.సం.: 2. టెండర్ నం.: E-16-EAST-BZA-2025, పనివివరాలు: పనిపేరు: విజయవాడ డివిజన్ : సీనియర్ DEN/ఈస్ట్/BZA పరిధి యొక్క ADEN/ BVRM సబ్‌డివిజన్ క్రింద SSE/P-వే/BVRM, SSE/P-వే/KKLR, SSE/P-వే/TNKU & SSE/P-వే/MTM, సెక్షన్‌లో ఇతర ట్రాక్ వివిధ రకాల పనులు మరియు ప్రతిపాదిత భద్రతా సంబంధిత ట్రాక్ నిర్వహణ పనులు. పూర్తి చేయు కాలం : 12 (పన్నెండు నెలలు). టెండర్ విలువ : రూ. 4,01,61,097.00. బయానా : రూ.3,50,800.00. ముగింపు యొక్క తేదీ : 17.04.2025.
క్ర.సం.: 3. టెండర్ నం.: E-17-EAST-BZA-2025, పనివివరాలు: పనిపేరు: సీనియర్ DEN/ఈస్ట్/BZA పరిధి యొక్క BVRM-KLDI సెక్షన్‌లలో ఉండి-భీమవరం - NS సెక్షన్ మరియు LC నం.లు 124, 126, 128, 134, 138, 143, 146, 150, 155, 156, 159, 160, 140, 148, 157 (15 నం.లు) లలో ఉండి-కైకలూరు సెక్షన్, LC నం.లు : 2, 3, 4, 6, 8, 10, 11, 13, 14, 14A, 15, 18, 20, 21, 23, 109, 111, 113, 118, 120 (20నం.లు)లో RMV-GDV సెక్షన్, LC నం.లు 103, 95, 93, 91, 90, 89, 88, 83 (8నం.లు)లో, GDV-MTM సెక్షన్, LCనం.లు: 22, 24, 27, 28, 29, 31, 32, 49, 50, 51, 52, 74 (12 నం.లు)లో BT రోడ్ ఉపరితలాలలో LCనం.లు: 1, 3, 5, 7, 8, 11, 12, 16, 17, 20, 23,24, 26, 31, 33, 34, 35, 37, 39, 40,42,43, 44 (23 నం.లు)లకు మరమ్మతులు. పూర్తి చేయు కాలం : 12 (పన్నెండు నెలలు). టెండర్ విలువ : రూ. 2,10,13,852.00. బయానా : రూ.2,55,100.00. ముగింపు యొక్క తేదీ : 19.04.2025.
క్ర.సం.: 4. టెండర్ నం.: E-09-Central-BZA-2025, పనివివరాలు: పనిపేరు: SW1) విజయవాడ డివిజన్ : DEN/సెంట్రల్/BZA పరిధి క్రింద (02) రెండు సంవత్సరాల కాలానికి ADEN/EE సబ్ డివిజన్‌లో ADEN/BPP మరియు BZA-PUA లో KVDU-KCC మధ్య స్టేషన్‌ల యొక్క ఆప్రోచ్‌లలో ర్యాగ్స్ యొక్క పికింగ్. పూర్తి చేయు కాలం : 24 (ఇరవై నాలుగు నెలలు). టెండర్ విలువ : రూ. 42,52,060.00. బయానా : రూ.85,100.00. ముగింపు యొక్క తేదీ : 22.04.2025.
క్ర.సం.: 5. టెండర్ నం.: E-06-వంతెనలు-BZA-2025, పనివివరాలు: పనిపేరు: BZA డివిజన్ - ADEN/Br/S/ BZA యొక్క పరిధి క్రింద, SSE/Br/1/BZA & SSE/Br/II/BZA సెక్షన్‌ల క్రింద, BZA-OGL, BZA-BVRM & GDV-MTM సెక్షన్‌లు మధ్య ROBలు మరియు వివిధ సెక్షన్ బ్రిడ్జిలు యొక్క స్తంభాల చుట్టూ ప్లాట్ ఫారాల తనిఖీ యొక్క ఏర్పాటుచే బ్రిడ్జిలను పటిష్టపరచుట. పూర్తి చేయు కాలం : 12 (పన్నెండు నెలలు). టెండర్ విలువ : రూ. 3,99,37,940.00. బయానా : రూ.3,49,700.00. ముగింపు యొక్క తేదీ : 23.04.2025.
క్ర.సం.: 6. టెండర్ నం.: E-10-సెంట్రల్-BZA-2025, పనివివరాలు: పనిపేరు: SW-1) విజయవాడ డివిజన్: - DEN/సెంట్రల్/BZA పరిధి క్రింద (02) రెండు సంవత్సరాల కాలానికి ADEN/EE సబ్-డివిజన్‌లో ADEN/BPP & BZA-PUA లో KVDU-KCC మధ్య స్టేషన్‌ల యొక్క ఆప్రోచ్‌లలో ర్యాగ్స్ యొక్క పికింగ్. పూర్తి చేయు కాలం : 06 (ఆరు నెలలు). టెండర్ విలువ : రూ. 50,78,518.00. బయానా : రూ.1,01,600.00. ముగింపు యొక్క తేదీ : 25.04.2025.
టెండరుదారులు వెబ్‌సైట్ "www.ireps.gov.in"ను సందర్శించవలసినదిగా కోరడమైనది.
డివిజనల్ రైల్వే మేనేజర్ (వర్క్స్) విజయవాడ.
A0450
తదుపరి టెండరు నిబంధనలు /సవరణలు మరియు టెండరు డాక్యుమెంట్లు డౌన్‌లోడింగ్ కొరకు, దయచేసి వెబ్‌సైట్ http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in చూడవచ్చును.

# ఫిర్యాదుల పరిష్కారాల్లో వేగం పెంచాలి: సిఎం చంద్రబాబు

### - రెవెన్యూ, పోలీస్, మున్సిపల్ శాఖల్లోనే అత్యధిక ఫిర్యాదులు

**విజయవాడ,, ఏప్రిల్8,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజల ఫిర్యాదులు, వినతుల పరిష్కారంలో మరింత వేగంగా స్పందించాలని, ఎప్పటికప్పుడు దరఖాస్తుదారుకు గ్రీవెన్స్ స్థితిని తెలిపేలా సమాచారం అందించాలని... ఇందుకు ఏఐ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. పరిష్కరించగలిగే వినతులను నిర్ణీత కాలవ్యవధిలోగా పరిష్కరించాలని చెప్పారు. అలాగే పరిష్కరించలేని వినతుల విషయంలో ఫిర్యాదుదారుకు... ఎందుకు పరిష్కరించలేక పోతున్నామనే విషయాన్ని సవివరంగా తెలియజేయాలని సూచించారు. గ్రీవెన్స్‌ల పరిష్కారంపై సోమవారం సచివాలయంలో ప్రత్యేకంగా సమీక్షించిన ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆధార్ నెంబర్, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నెంబర్ తప్పనిసరిగా తీసుకోవడం ద్వారానే గ్రీవెన్స్ నమోదు చేయాలని, దీని ద్వారా నకిలీ ఫిర్యాదులు అరికట్టవచ్చని ముఖ్యమంత్రి అన్నారు. అలాగే, ప్రభుత్వ యంత్రాంగాన్ని పక్కదారి పట్టించేలా, వ్యవస్థను దుర్వినియోగం చేసేలా ఒకే విషయంపై అదే పనిగా ఎవరైనా ఫిర్యాదు చేస్తూ ఉంటే... అటువంటి వారి వివరాలు సేకరించి, ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించా లన్నారు. వినతులు పరిష్కరించిన తర్వాత ఎవరైతే గ్రీవెన్స్ దరఖాస్తు చేశారో వారి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని చెప్పారు. తనకు నేరుగా వచ్చే గ్రీవెన్స్‌లను ఆయా జిల్లాల కలెక్టర్లు స్వయంగా ఫిర్యాదుదారుతో సంప్రదించి ఫాలోఅప్ చేయడం ద్వారా సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ముఖ్యమంత్రి సూచించారు. 3 శాఖల్లోనే 90 శాతం ఫిర్యాదులు : రెవెన్యూ, పోలీస్, మున్సిపల్... కేవలం ఈ 3 శాఖల నుంచే అత్యధికంగా ఫిర్యాదులు, వినతులు వస్తున్నాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. గత ప్రభుత్వం రీ సర్వేలో నిబంధనలు ఉల్లంఘించడంతో భూసంబంధిత ఫిర్యాదులు పెరిగాయి. ఫిర్యాదుల్లో ముఖ్యంగా రెవెన్యూ రికార్డుల్లో భూ యజమాని పేరు మారిపోవడం, పట్టాదార్ పాస్ పుస్తకాల్లో పేర్లు సవరణ, రీసర్వేలో విస్తీర్ణంలో తేడాలు వంటివి ఎక్కువుగా ఉన్నాయి. అలాగే, పోలీస్ శాఖకు సంబంధించి ఆస్తి తగాదాలు, సైబర్ క్రైమ్, వైవాహిక సమస్యలు, భూసంబంధిత తగాదాలు, ఆర్థిక నేరాలతో ముడిపడిన ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయి. మున్సిపల్ శాఖలో కూడా ఫిర్యాదులు ఎక్కువగానే ఉన్నాయి. ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణ, నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టడం, అనధికార నిర్మాణాలు, ఆస్తి పన్నులు వంటి వాటిపై ఫిర్యాదులు వస్తున్నాయి.

# ఆంధ్రా యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

### ఎయూకి పూర్వవైభవం తీసుకురావాలి :మంత్రి నారా లోకేష్

**మంగళగిరి,ఏప్రిల్8,ప్రభాతవార్త :** ఎంతో ఘన చరిత్ర కలిగిన విశాఖపట్నం ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన సహాయ, సహకారాలను అందిస్తామని చెప్పారు. ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల నిర్వహణ, యూనివర్సిటీ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై వైస్ ఛాన్స్ లర్ జీపీ రాజశేఖర్ తో ఉండవల్లిలోని నివాసంలో మంత్రి లోకేష్ సుదీర్ఘంగా సమీక్షి ంచారు. ఈ ఏడాది ఏప్రిల్ 26వ తేదీన ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల ప్రారంభ వేడుకను నిర్వహించనున్నట్లు వీసీ వివరించారు. 1926లో ఆంధ్ర యూనివర్సిటీని స్థాపించారు. 2026, ఏప్రిల్ 26వ తేదీ వరకు ఏడాదిపాటు ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ విజన్ ను వీసీ జీపీ రాజశేఖర్ ఆవిష్కరించారు. మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. ఎంతో చరిత్ర కలిగిన ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఘనంగా నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. విశ్వవిద్యాలయానికి పూర్వవైభవం తీసుకురావాలన్నారు. క్యూఎస్ ర్యాంకింగ్స్ లో ఆంధ్ర యూనివర్సిటీ టాప్100లో స్థానం పొందడమే లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. ఇందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. త్వరలోనే యూనివర్సిటీల్లో ఖాళీలను భర్తీచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్(ఏపీఎస్సీహెచ్ఈ) ఛైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి, కాలేజియేట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నారాయణ భరత్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# దేశంలోనే ఏపిని సిఎం చంద్రబాబు నెంబర్‌వన్ చేస్తారు : ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్



కుప్పంలో పాత్రికేయుల సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్

**కుప్పం, ఏప్రిల్ 8 ప్రభాతవార్త** సిఎం చంద్రబాబునాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని నెంబర్‌వన్ చేస్తారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో ఆయన ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నంతో కలసి పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. ఐదేళ్ల వైఎస్సార్సీ పాలనలో ఆర్థికంగా కుదేలైన రాష్ట్రాన్ని తొమ్మిది నెలల పాలనలోనే సిఎం చంద్రబాబునాయుడు తలసరి ఆదాయం వృద్ధిరేటులో రాష్ట్రాన్ని దేశంలోనే రెండోస్థానంలో నిలి పారని పేర్కొ న్నారు. సేవ, వ్యవసాయ, ఉద్యానవన రం గాల్లో 15.14శాతం వృద్ధి సాధించడం జరిగిందన్నారు. సిఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్తున్నారన్నారు. రాజధాని అమరావతి నగరాన్ని వైఎస్సార్సీ నేతలు స్మశానంతో పోల్చారని అదే నేడు ప్రజారాజధానిగా రూపుదిద్దుకుంటోందన్నారు. అమరావతిలో 15వేల కోట్లతో పనులు ప్రారంభమైనట్లు చెప్పారు. మరో పక్క రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును సైతం త్వరగా పూర్తి చేయాలని సిఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. తెలుగువారు ఎక్కడున్నా అగ్రస్థానంలో ఉండాలనేది సిఎం చంద్రబాబు తపన అన్నారు. గతంలో జన్మభూమి కార్యక్రమంకు పిలుపునిచ్చిన సిఎం చంద్రబాబు నేడు మార్గదర్శి - బంగారు కుటుంబం (పి4) కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 20లక్షల పేద కుటుంబాలను ఆర్థికంగా పైకి తేవడమే లక్ష్యమన్నారు. ఉన్నతవర్గాల వారు పేద కుటుంబాలను దత్తత తీసుకుని వారి అభివృద్ధికి కృషి చేసేలా సిఎం ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారన్నారు. సమాజానికి మంచి చేయాలనే దిశగా సిఎం చంద్రబాబు అడుగులు వేస్తున్నారన్నారు. కుప్పంలో సైతం ఎయిర్‌పోర్టు నిర్మాణానికి చర్యలు చేపట్టారన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం మాట్లాడుతూ రాష్ట్రంలో సిఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో సుస్థిర పాలన ఉంటే రాష్ట్రం ఎంతో తొందరగా అభివృద్ధి చెందుతుందన్నారు. సుస్థిర పాలన లేకుంటే గత వైఎస్సార్సీ పాలనలో ఏం జరిగిందో అందరికీ తెలిసిందేనన్నారు. సిఎం చంద్రబాబుకు మంచిపేరు వస్తుందని రాజధాని అమరావతి నగరాన్ని అంధకారంలో నెట్టేయడంతో పాటు రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయించారన్నారు. సమావేశంలో టిటిడి బోర్డు సభ్యులు వైద్యం శాంతారాం, నాయకులు రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, ఆనందరెడ్డి, రాజగోపాల్, కాణిపాకం వెంకటేష్, బగ్గిడి వెంకటేష్, సుగుణమ్మ పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ వైద్య సేవలు యధాతధం

**విజయవాడ.ఏప్రిల్8,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ వైద్యసేవల(ఆరోగ్యశ్రీ)నుయధావిధిగా కొనసాగిస్తున్నారు.ప్రభుత్వంతో ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ జరిపిన చర్చలు సఫలమయ్యాయి.వారికి వెంటనే రూ.500కోట్లు బకాయిలు విడుదల చేస్తున్నట్లు సీఎం చంద్రబాబునాయుడు స్వయంగా చర్చల సందర్భంగా వాగ్దానం చేసారు.దీంతో వైద్యసేలు కొనసాగించాలని ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ నిర్ణయించింది.ఇదే విషయం అసోషియేషన్

మంగళవారం వెల్లడించింది.రాష్ట్రంలోని నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ వైద్యసేవలను సోమవారం నుంచి నిలిపివేస్తున్నట్లు ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కె.విజయ్‌కుమార్ వెల్లడించింది.రాష్ట్ర ప్రభుత్వం నెట్‌వర్క్ ఆస్పత్రులకు దాదాపు రూ.3,500 కోట్లు బకాయిలు పెట్టిందని,

దీనివల్ల తాము దుర్భర పరిస్థితుల్లో ఉన్నామని చెప్పారు. బకాయిల విడుదల కోసం ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్‌కు అనేకసార్లు విన్నవించామని, లిఖితపూర్వకంగానూ కోరామని తెలిపారు. పెండింగ్ బిల్లులు చెల్లిస్తే కానీ మందులు, సర్జికల్ ఐటమ్స్ సరఫరా చేయలేమని ఆయా కంపెనీలు చేతులెత్తేస్తున్నాయని చెప్పారు.

వైద్యులు, సిబ్బందికి 2 నెలలుగా జీతాలు నిలిపివేశామని చెప్పారు. దీనిపై గతనెల 7నే ట్రస్ట్‌కు లేఖ రాశామని, ప్రభుత్వం నుంచి స్పందన రాలేదని తెలిపారు. బకాయిలు విడుదల చేయాలంటూ గతేడాది జూలై నుంచి ప్రభుత్వానికి 26 సార్లు లేఖలు రాశామని డాక్టర్ కె.విజయ్‌కుమార్ అన్నారు. 2025-26 బడ్జెట్‌లో ఎన్టీఆర్ వైద్యసేవ పథకానికి రూ.4వేల కోట్లు కేటాయించగా,

బకాయిలే రూ.3,500 కోట్లు ఉన్నాయన్నారు. కనీసం రూ.1,500 కోట్లు చెల్లిస్తే తప్ప సేవలు కొనసాగించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ఆశా కార్యదర్శి డాక్టర్ అవినాశ్ మాట్లాడుతూ బీమా విధానంలోకి మారే క్రమంలో ఆయుష్మాన్ భారత్‌తో పథకాన్ని ఇంటిగ్రేట్ చేస్తామని అంటున్నారని,

ఆయుష్మాన్ భారత్‌లోని 1,500 ప్రొసీజర్లు ఎన్టీఆర్ వైద్యసేవ కంటే తక్కువ ప్యాకేజీల్లో ఉన్నాయని తెలిపారు.

దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ ఆసుపత్రుల సంఘంతో చర్చలు జరిపి వైద్య సేవలు పునఃప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు.

# ఏపి లాసెట్, పిజిఎల్‌సెట్ 2025 దరఖాస్తుల ఆహ్వానం

**తిరుపతి,ఏప్రిల్ 8ప్రభాతవార్తప్రతినిది:** రాష్ట్ర ఉన్నతవిద్యామండలి ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి ఏపి లాసెట్, ఏపి పిజిఎల్‌సెట్-2025 కోర్సుల్లో చేరడానికి దరఖాస్తులు తిరుపతి పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం స్వీకరిస్తోంది. రెగ్యులర్‌గా ఎల్‌ఎల్‌బి 3సంవత్సరాలు, 5 సంవత్సరాలు, ఎల్‌ఎల్‌ఎం 2 సంవత్సరాలు కోర్సుల్లో చేరడానికి దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని కన్వీనర్ తెలిపారు. దరఖాస్తుకు ఈనెల 27వతేదీ చివరితేదీగా తెలిపారు. మరిన్ని వివరాలకు హెచ్‌టిటిపిఎస్://సిఇటిఎస్.ఎపిఎస్‌హెచ్ఇ.ఎపి.జివోవి.ఇన్”ను సంప్రదించాలని కన్వీనర్ కోరారు.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY (APCRDA)
Lenin Center, Governorpet, Vijayawada - 520 002 (A.P.)
E PROCUREMENT SHORT TENDER NOTICE
NIT No. 6/MAU61-ADMN0IS(NSS)/1/2025-IS Dt: 07/04/2025
Name of Work: APCRDA- "Supply & installation of CCTV Cameras @ Block-1, AP Secretariat, Amaravati" - Estimate Contract Value: Rs.75,10,064/-(Excl. of all taxes).
The bid can be downloaded on AP e-procurement portal from 09.04.2025 to 15.04.2025 up to 14.00 Hrs. Due date for submission of Bid is 15.04.2025 up to 15.00 Hrs, Technical bid opening 15.04.2025 @ 16.00 Hrs. For further details Please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in.
Sd/- Commissioner, APCRDA, Vijayawada


ఇద్దరి మధ్య వైరం సంభవించిందంటే అందుకు వారిలో ఒక్కటే కారణం కావచ్చు. కాని అది దీర్ఘకాలం సాగిందంటే ఇద్దరూ బాధ్యులే.

-థామస్ ఫుల్లర్

# ఆక్వా కుదేలు!

అమెరికా తీరుతో ఆక్వారంగం కుదేలైంది. రైతులు, వ్యాపారులు ఈ నాలుగైదు రోజుల్లోనే వందల కోట్లరూపాయల మేరకు నష్టపోయారు. 2023-24ఆర్థిక సంవత్సరంలో భారత దేశంనుంచి అమెరికాకు రూ.2.55బిలియన్ల డాలర్లవిలువైన సముద్ర ఆహార ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి. వీటిలోరొయ్యలే 92శాతం వాటాను కలిగిఉన్నాయి. అమెరికా దేశానికి సముద్రఆహార ఎగుమతులపై రొయ్యల ఎగుమతిలో కీలకమైన భారతదేశంపై 27శాతం దిగుమతి సుంకం కారణంగా ఆక్వా రైతాంగం నష్టపోతోంది. ఈక్వెడార్ వంటి దేశాలకు ఎగుమతిదారులపై కేవలం10శాతం పన్నుమాత్రమే అమెరికా విధిస్తోంది. అన్ని సుంకాలను కలుపుకుంటే ఈక్వెడార్‌కు భారతదేశానికి మధ్య సుంకాల వ్యత్యాసం దాదాపు 20శాతం ఉంటుంది. దీనివల్ల మన దేశానికి పరోక్షంగా భారీనష్టం కలిగిస్తోంది. ఈసుంకాలవిధింపులో వ్యత్యాసం వలన మత్స్యవాణిజ్య ఎగుమతులలో వారికి అనుకూలంగా మారుతోంది. ఈ ఉపద్రవం నుంచిబయటపడే మార్గాలను ప్రభుత్వం అన్వేషించాల్సి ఉంది. దీనికి తోడు మన దేశ ఎగుమతిదారులు ఇప్పటికే5.77శాతం కౌంటర్ వెయిలింగ్ డ్యూటీ (సివిడి) భారాన్ని అదనంగా మోస్తున్నారు. అమెరికా విధించిన కొత్తసుంకం ఏప్రిల్ 5, 2025నుండి అమల్లోకి వచ్చింది.దీని కారణంగా అమెరికా దేశానికివెళ్లే అన్ని ఎగుమతులపైనా ఈభారం పడుతోంది. గతంలో వచ్చిన ఆర్డర్‌లకు అనుగుణంగా ఇప్పటికే సేకరించిన ఉత్పత్తులు ప్యాకింగ్ చేయబడి, కోల్డ్ స్టోరేజ్‌లు, పోర్టులలో ఉన్నాయి. కొత్త నిబంధనలవల్ల ఈ ఉత్పత్తులపై సుంకాల భారంపడుతోంది. యూరోపియన్ యూనియన్‌లో భారతీయ ఎగుమతిదారులు 50 శాతం తనిఖీ రేట్లు, 47శాతం దిగుమతి సుంకంతో సహా నాన్‌టారిఫ్ అడ్డంకులను ఎదుర్కొంటున్నారు. కానీ వియత్నాం వంటి దేశాలు యూరోపియన్ యూనియన్‌తో వారి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ ఎఫ్‌టిఎ) కింద జీరో డ్యూటీ పొందాయి. ఈ కారణంగా వియత్నాం వంటి దేశాలు యూరోపియన్ మార్కెట్‌ను సమర్థవంతంగా ఆక్రమిస్తున్నాయి. వియత్నాం, థాయి లాండ్, జపాన్ దేశాల మార్కెట్లు భారతదేశం నుండి సీఫుడ్‌ను కొనుగోలు చేసి వాటిని ప్రాసెస్ చేసి అమెరికాకు ఎగుమతి చేస్తాయి. కాగా తాజాగా తుది ఉత్పత్తులపై విధించిన అధికట్యాక్సుల కారణంగా ఆ దేశాలు కూడా మనకు ఇచ్చిన ఆర్డర్లను రద్దుచేస్తున్నాయి. ఇలా ఆక్వారంగాన్ని సంక్షోభంలోకి నెట్టివేస్తున్నాయి. ఈ పరిణామాలతో ఆక్వారైతులు, హేచరీలు, ఫీడ్ మిల్లులు, ప్రాసెసర్లు, ఎగుమతిదారులకుఇలా సుంకాల బరువు నెత్తినపడింది. అమెరికా సుంకాల కారణంగా నష్టపోతున్న ఆంధ్రప్రదేశ్ ఆక్వారంగాన్ని ఆదుకొని అండగా నిలిచేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌ని కోరారు. ఇలాంటి సుంకాల కారణంగా తీవ్ర భయాందోళనలు చెందుతున్న ఆక్వారైతులు ఎగుమతి దార్లు ప్రస్తుత పరిణామాలకు ఆందోళన చెందాల్సిన పనిలేదని చెబుతున్నా,అదంతా మేకపోతు గాంభీర్యమే. ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఆక్వారంగం కోలుకునే విధంగా చర్యలు తీసుకోగలమని భరోసా ఇచ్చారు. రాష్ట్ర తలసరి ఆదాయంలో మత్స్య రంగం కీలకభూమిక పోషిస్తోంది. ఎపిలో శీతల గిడ్డంగులు కూడా నిండిపోవడంతో చేతికి వచ్చిన ఆక్వా పంట ఎక్కడ ఉంచాలో కూడా తెలియని గందరగోళ పరిస్థితిలో రైతాంగంఉంది. మరోవైపు ఇంకా పంట సిద్ధంగా ఉంది. అధిక సుంకాల కారణంగా రైతుల నుండి పంట సేకరిచడం ఎగుమతిదారులు నిలిపివేశారు. ఈపరిణామాలు రాష్ట్ర ఆక్వారంగాన్ని సంక్షోభంలోకి నెట్టివేస్తున్నాయి. ఈ పరిణామాలతో ఆక్వా రైతులు,హేచరీలు, ఫీడ్ మిల్లులు, ప్రాసెసర్లు, ఎగుమతిదారులకు సమస్యలు వచ్చాయి. ఈ కారణంగా అమెరికా ప్రభుత్వంతో చర్చలు జరిపి సుంకాల నుంచి రొయ్యలను మినహాయింపు జాబితాలో చేర్చడానికి అవసరమైన చర్చలుజరపాలి. సకాలంలో దీనిపై జోక్యం చేసుకుని సమస్య పరిష్కరించడంవల్లఆక్వాపై ఆధారపడి బతుకుతున్న లక్షలాది మంది జీవనోపాధిని కాపాడవచ్చు. అమెరికా సుంకాల కారణంగా తీవ్రభయాందోళన లు చెందుతున్న ఆక్వా రైతులు,ఎగుమతిదారులు ప్రస్తుత పరిణామాలకు ఆందోళన చెందాల్సిన పనిలేదని, ఇతర మార్గాల ద్వారా ఆక్వారంగం కోలుకునే విధంగా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. ఆక్వా రంగంపై ఆధారపడ్డ ఏఒక్కరూ అధైర్యపడకుండా ప్రభు త్వం అన్ని చర్యలు తీసుకుంటుంది. అమెరికా అధినేత ట్రంప్ సుంకాలపై నిర్ణయం తీసుకున్నప్పటి నుంచి రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమై పరిస్థితులను నిశితంగా సమీక్షిస్తోంది. ఆరోగ్యానికి రొయ్యల వల్ల కలిగే మేలు గురించి విస్తృతంగా ప్రచారం చేయడంతోపాటు ప్రతిఒక్కరూ రొయ్యల వినియోగం పెంచేలా చేస్తే ఎగుమతులపై ఆధారపడాల్సిన అవసరం ఉంది. వైరస్ వంటి ఇబ్బందులు మరింత పెరగకుండా రొయ్యలు కొనుగోలు జరిగేలా చూడాలి. ఏ మాత్రం అశ్రద్ధ చేసినా ఆక్వారైతులు మళ్లీ కోలుకోలేరు. అమెరికా విధించిన సుంకం ఒక్క ఆక్వారంగంపైనే కాదని,అన్ని ఎగుమతులకు వర్తిస్తుంది. ఈ ఉపద్రవం నుంచి బయటపడే మార్గాలను ప్రభుత్వం కల్పించాలని పలువురు రైతులు కోరారు.ఆక్వాసాగులో 3 లక్షల మంది రైతులు నేరుగా,పరోక్షంగా మరో 50లక్షల మంది రైతులు ఆధారపడి ఉన్నారు. ఈ ఆకస్మికంగా ఆక్వారంగానికి వచ్చిన సమస్య అనూహ్యమైనది. దక్షిణ కొరియా, యూరోపియన్ యూనియన్ వంటి దేశాలలో ఫ్రీట్రేడ్ అగ్రిమెంట్ చేసుకోగలిగితే గట్టెక్కే పరిసితి ఉంది.

ఇతరులపై నీ ముందు నిందలు వేసేవాడు, పరుల వద్ద నీపై నిందలు వేయకుండా ఉండలేడు.



సోక్రటీస్

ఎత్తైన పర్వతాలను ఎక్కేందుకు ఎలా వంగి నడుస్తామో ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కొంత అణకువతో మెలగాలి.



ఎమర్సన్

# ఆకాశమే హద్దుగా.. ఏవియేషన్ హబ్

**శంషాబాద్‌లోని జీఎంఆర్ ఎయిరోస్పేస్ అండ్ ఇండస్ట్రియల్ పార్కులో ఏర్పాటైన ఈ స్కూల్ నాలుగేళ్ల ఎయిర్ క్రాఫ్ట్ మెయింటనెన్స్ ఇంజినీరింగ్ కోర్సును అందజేస్తుంది. ఈ కొత్త ఎయిర్‌పోర్టుల రాకతో వేలమంది యువతకు ఉద్యోగఅవకాశాలు వస్తాయి. రాష్ట్రానికి పర్యాటకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. భవిష్యత్తులో తెలంగాణ ఏవియేషన్‌హబ్‌గా మారే అవకాశం ఉంది. దీనితో ఎయిరోస్పేస్ తయారీ రంగంలో పెద్దఎత్తున ఉద్యోగాలు లభించే అవకాశాలు లభిస్తాయి. జిల్లాల్లో ఉన్న ప్రజలు విదేశాలకు వెళ్లాలంటే హైదరాబాద్‌దాకా రావాల్సిన అవసరం లేకుండా జిల్లాలనుంచే తేలికగా విమానాలలో ప్రయాణించటానికి అవకాశం కలుగుతుంది. అభివృద్ధి మొత్తం హైదరాబాద్‌కే పరిమితం కాకుండా జిల్లాలకు సైతం విస్తరించే అవకాశం ఉంది. ఎయిర్‌పోర్టు చుట్టుపక్కల ప్రాంతాలలో విపరీతంగా అభివృద్ధి జరుగుతుంది. ఆయాప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు కూడా కొత్తగా అవకాశాలు కలుగుతాయి.**



బోర్రెడ్డి అయోధ్యరెడ్డి

నిన్నటివరకు విమాన ప్రయాణం అంటే ధనవంతులకే పరిమితమై ఉండేది. ఇక రోజులు మారాయి, మధ్యతరగతి వారికి విమాన ప్రయాణం అంటే బస్సులలో ప్రయాణించినంత అవలీలగా పరిమాణం చెందింది. విదేశాలకు వెళ్లాలంటే తప్పనిసరై విమానాలు ఎక్కేవారు. అభివృద్ధి చెందిన నేటి పరిస్థితుల్లో పక్కరాష్ట్రానికి వెళ్లాలన్నా,సమయం ఆదా కోసం విమానాల్లో ప్రయాణం చేస్తున్నారు. గతంలో పారిశ్రామికవేత్తలే ఎక్కువగా విమానాలలో ప్రయాణించేవారు. కానీ నేడు విదేశాలకు విద్యను అభ్యసించడానికి వెళ్లే విద్యార్థులు, పర్యాటక ప్రాంతాలకు వెళ్లే వారు విమానాల్లో ప్రయాణించటం ఎక్కువైపోయింది. హైదరాబాద్లో శంషాబాద్ విమానాశ్రయం ప్రారంభించినప్పుడు నష్టాలలో నడిచింది. ఈరోజు అక్కడ విమానాల రాకపోకలకు రన్వేలు సరిపోక, వాటిని విస్తరించాల్సి వస్తోంది. తెలుగు రాష్ట్రాల్లోని విమానాశ్రయాలు ప్రయాణికులతో బస్టాండ్ల మాదిరిగా కిటకిటలాడుతున్నాయి. ఎంతగా అంటే ప్రయాణికులకు వీడ్కోలు చెప్పడానికి నాలుగురైదురికిమించి విమానాశ్రయానికి రావొద్దని ఎయిర్‌పోర్టు సిబ్బంది వేడుకోవాల్సి వస్తోంది. అమెరికాలో కళాశాలలు ప్రారంభమయ్యే ఆగస్టు నెలలో శంషాబాద్ ఎయిర్‌పోర్టు ప్రయాణికులతో కిటకిటలాడుతోంది. మెట్రో నగరాల విషయంలో ప్రయాణికుల సంఖ్యలో శంషాబాద్ విమానాశ్రయం దూసుకెళ్తుంది. విమాన సర్వీసుల పెరుగుదల అంశంలో హైదరాబాద్ 16.2శాతంతో ప్రథమస్థానంలో ఉండగా, చెన్నై 13.8 శాతం, బెంగళూరు 10.4శాతం, ఢిల్లీ 7.9శాతంతో పురోగతి కనిపించింది. శంషాబాద్ విమానాశ్రయంలో రోజువారీ ప్రయాణీకుల సంఖ్య లక్ష దాటే రోజు మరెంతో దూరంలో లేదు. గత ఫిబ్రవరి 21న రికార్డు స్థాయిలో ఇక్కడి నుంచి 96వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారంటే విమాన ప్రయాణాలకు మన రాష్ట్రంలో ఎంత డిమాండ్ ఉన్నదో చూడవచ్చు. దీనిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో సైతం ఎయిర్‌పోర్టు నిర్మాణాలకు కేంద్రంపై ఒత్తిడి పెంచింది. దీనితో రాష్ట్రంలో కొత్తగా కేంద్రం రెండు కొత్త ఎయిర్‌పోర్టులను మంజూరు చేసింది. ఇంకో రెండు ఎయిర్‌పోర్టులు పరిశీలనలో ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పారిశ్రామికంగా, పర్యాటకంగా రాష్ట్రాన్ని అభివృద్ధిబాటలో నడపడం కోసం అనేక ప్రణాళికలు రూపొందించింది. పర్యాటకులు రాష్ట్రానికి మరింతమంది రావాలన్నా, పారిశ్రామికవేత్తలు రాకపోకలకు ప్రయాణ సౌకర్యాలు అందుబాటులో ఉండాలి. మన రాష్ట్రంలో ప్రస్తుతం శంషాబాద్ ఎయిర్‌పోర్టు ఒక్కటే ప్రయాణికులకు అందుబాటులో ఉన్నది. బేగంపేటలో ఉన్న పాత విమానాశ్రయం నుంచి ప్రైవేట్ విమానాలు మాత్రమే నడుస్తున్నాయి. దుండిగల్లో ఉన్న ఎయిర్‌పోర్టు ఎయిర్‌ఫోర్స్‌కు సేవలందిస్తోంది. దీనినిదృష్టిలో పెట్టుకొని జిల్లాలకు సైతం విమానాశ్రయాలు అందుబాటులో ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్రంపై ఒత్తిడితెచ్చి కొత్త విమానాశ్రయాల ఏర్పాటు కు అనుమతులు సాధించారు. దీనిలో భాగంగా వరంగల్ జిల్లా మామునూరు వద్ద కొత్త బ్రౌన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కేంద్ర పౌర విమానయానశాఖ పచ్చ జెండా ఊపింది. 1930లో నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ మామునూరు వద్ద ఎయిర్పోర్టును ప్రారంభించగా, అది 1981 వరకు సేవలందించింది. కాగజ్నగర్లో ఉన్న పేపర్ పరిశ్రమ, వరంగల్‌లోని ఆజాం జాహిమిల్స్



ప్రయోజనాల కోసం అప్పట్లో దీన్ని నిర్మించారు. ఈ పరిశ్రమలు మూత పడటంతో ఈ ఎయిర్‌పోర్టు కూడా మూత పడిపోయింది. గత పదేళ్లలో కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణం పై శ్రద్ధ చూపించలేదు. తూతూ మంత్రంగా కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించటంతో ఈ ప్రాజెక్టులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నవిధంగా తయారయ్యాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయాలను, బేషజాలను పక్కనపెట్టి రాష్ట్ర ప్రయోజనాలే ధ్యేయంగా కేంద్రంతో సత్సంబంధాలు నెల కొల్పుకొని ఏడాది కాలంలో రాష్ట్రానికి అనేక ప్రాజెక్టులు సాధించారు. ఢిల్లీకి వెళ్లినప్పుడల్లా కేంద్ర మంత్రులను పదేపదే కలిసి రాష్ట్రానికి రావాల్సిన జాతీయ రహదారులను సాధించారు. దశాబ్దాలుగా పెండింగ్లో ఉన్న రోడ్ల వెడల్పుకు కంటోన్మెంట్ భూములు అవసరం కాగా, వాటిని సాధించారు. ఇప్పుడు కొత్తగా నాలుగు ఎయిర్ పోర్టులను సాధించటం కోసం తీవ్ర ప్రయత్నంచేశారు. దీనితో వరంగల్లోని మామునూర్ ఎయిర్‌పోర్టు,ఆదిలాబాద్లో ఎయిర్‌పోర్టుకు కేంద్రం అనుమతించింది. ఆదిలాబాద్లో ఏర్పాటు చేయనున్న ఎయిర్‌పోర్టుకు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇక్కడ రానున్న రోజుల్లో శిక్షణా కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తామని ఐఎఎఫ్ వెల్లడించింది. వీటితో పాటు భద్రాద్రి కొత్త గూడెంలో ఎయిర్‌పోర్టును నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్లాన్ చేస్తోందని పౌర విమానయాన మంత్రి తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో కూడా రామగుండం ఎయిర్‌పోర్టును నిర్మించా లని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. పౌరవిమానయాన రంగంపై చేసే ఖర్చువలన ఆర్థిక కార్యకలాపాలు పుంజుకుంటాయి. వేలసంఖ్యలో ఉద్యోగాల సృష్టి జరుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా పౌర విమానయానం ప్రత్యక్షంగా1.13కోట్ల ఉద్యోగాలను, పరోక్షంగా మరో8.3కోట్ల ఉద్యోగాలను సృష్టి స్తున్నది. 58శాతం అంతర్జాతీయ టూరిస్టులు విమానాల్లోనే పర్యటిస్తున్నారు. మనదేశంలో విమానాల తయారీ, నిర్వహణ, మరమ్మత్తులు చేసేవిభాగాలలో 2.5లక్షల ఉద్యోగాలు వస్తాయని అంచనా. వచ్చేమూడేళ్లలో వైమానిక రంగంలో ఉపాధి అవకాశాలు 40శాతం పెరుగుతాయని భావిస్తున్నారు. ప్రతి విమానానికి 100నుంచి 150మందిసిబ్బంది కావాలి.కాబట్టి ఈ విమానయానరంగంలో ఉపాధి అవకాశాలు ఎంతఎక్కువగా వుంటాయో తెలుసుకోవచ్చు. మనదేశంలో 17 అంతర్జాతీయవిమానాశ్రయాలు మొత్తం159. వీటిసంఖ్య 2030కల్లా 200 దాటే అవకాశం ఉంది. మన దేశంలో 2023లో 15.3కోట్ల మంది విమానాల్లో ప్రయాణించగా, 2030నాటికి ఈసంఖ్య 30కోట్లకు పెరిగే అవకాశముంది. ప్రతిఏటా హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయంలో వైమానిక ప్రదర్శన నిర్వహిస్తారు.ఇక్కడ నిర్వహించే ఎయిర్‌పోర్టుకు ప్రపంచవ్యాప్తంగా అనేక విమానయాన సంస్థలు తరలివస్తాయి. ఎయిర్ అంబులెన్సులు, హెలికాప్టర్లు, విభిన్నమైన డ్రోన్లు ఈ ప్రదర్శనల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.ఈ ప్రదర్శనకు వందల మంది వివిధ దేశాలకు చెందిన ఎయిరోస్పేస్ ఇంజనీర్లు, పారిశ్రామికవేత్తలు,పైలట్లు, ట్రైనీ పైలట్లు హాజరవుతారు. కొన్నేళ్ల నుంచి మనదేశ విమానయాన రంగంఏటా10నుంచి 15శాతంవృద్ధిని సాధిస్తోంది. ఈ దశాబ్దంలో దేశీయ ప్రయాణికుల సంఖ్య ఏటా 15 శాతం,అంతర్జాతీయ ప్రయాణికుల సంఖ్య 6.1శాతం చొప్పున పెరిగింది. గత 15ఏళ్లలో విమానాల ద్వారా సరుకురవాణా దేశీయంగా 60శాతం, అంతర్జాతీయంగా 53శాతం వృద్ధిసాధించింది. ఇదేవిధంగా ఆధునిక వైద్య సేవలకు,ఎయిర్ మెడికల్ సౌలభ్యాలకు మనం చొరవ చూపుతున్నాం. ఇదేగాక, హైదరాబాద్లో జీఎంఆర్ గ్రూప్ ఏర్పాటు చేసిన జీఎంఆర్ ఏవియేషన్ స్కూల్ను గత ఏడాది జనవరిలో ప్రారంభించారు. శంషాబాద్‌లోని జీఎంఆర్ ఎయిరోస్పేస్ అండ్ఇండస్ట్రియల్ పార్కులో ఏర్పాటైన ఈ స్కూల్ నాలుగేళ్ల ఎయిర్ క్రాఫ్ట్ మెయింటనెన్స్ ఇంజినీరింగ్ కోర్సును అందజేస్తుంది. ఈకొత్త ఎయిర్‌పోర్టులరాకతో వేలమంది యువతకు ఉద్యోగఅవకాశాలు వస్తాయి. రాష్ట్రానికి పర్యాటకుల సంఖ్యమరింత పెరిగే అవకాశం ఉంది. భవిష్యత్తులో తెలంగాణ ఏవియేషన్ హబ్‌గామారే అవకాశం ఉంది. దీనితో ఎయిరోస్పేస్ తయారీ రంగంలో పెద్దఎత్తున ఉద్యోగాలు లభించే అవకాశాలు లభిస్తాయి. జిల్లాల్లో ఉన్న ప్రజలు విదేశాలకు వెళ్లాలంటే హైదరాబాద్ దాకా రావాల్సిన అవసరం లేకుండా జిల్లాల నుంచే తేలికగా విమానాలలో ప్రయాణించటానికి అవకాశం కలుగుతుంది.అభివృద్ధిమొత్తం హైదరాబాద్‌కే పరిమితం కాకుండా జిల్లాలకు సైతం విస్తరించే అవకాశం ఉంది.ఎయిర్‌పోర్టు చుట్టుపక్కల ప్రాంతాల లో విపరీతంగా అభివృద్ధి జరుగుతుంది. ఆయాప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు కూడా కొత్తగా అవకాశాలు కలుగుతాయి. ●

# కలిసికట్టుగా పోరాడితేనే ప్రయోజనం!

ఫిరోజ్ ఖాన్

సంఖ్యాబలంతో లోక్‌సభ, రాజ్యసభలో వక్ఫ్ అమెండ్‌మెంట్ బిల్లు 2025ను ఎన్డీఏ ప్రభుత్వం ఆమోదింపజేసుకున్నది. జెడియూ, తెలుగుదేశం పార్టీ వంటి మిత్రపక్షాల సహకారంతో భారతీయ జనతాపార్టీ రెండు సభల్లోనూ బిల్ పాస్‌అయ్యేలా జాగ్రత్తలు తీసుకున్నది.ఆతర్వాత రాష్ట్రపతి ఆమోదం తెలపడంతో ఈ బిల్లు చట్టరూపం దాల్చింది. అయితేవక్ఫ్‌బిల్లు విషయంలో దూకుడుగావెళ్లిన బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ డీలిమిటేషన్ విషయంలోనూ అలాగే వ్యవహరించే అవకాశముంది. ఎన్డీఏ, ఇండియా ఏ కూటమిలో ఉన్నా సౌత్ స్టేట్స్ కలిసికట్టుగా పోరాడకపోతే దక్షిణాది రాష్ట్రాలకు, అక్కడి ప్రజలకు తీరనినష్టం జరిగే ప్రమాదముంది. జనాభా లెక్కల ప్రకారం పునర్విభజన జరిగితే ఎంపీ స్థానాలసంఖ్య 800నుంచి 1000 వరకు పెరగొచ్చు. అయితే ఈ ప్రక్రియలో ఉత్తరాది రాష్ట్రాలు ఎంతో లాభపడుతుండగా, దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదమున్నది. దీంతో భవిష్యత్తులో దక్షిణాది గళానికి విలువలేకుండాపోతుంది. 1951-52లో దేశ జనాభా 36కోట్లు. అప్పుడు లోక్‌సభ సీట్లు489. పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన జరిగిన 1971లో దేశజనాభా 54 కోట్లు. అప్పుడు సీట్లసంఖ్యను 545కు పెంచారు.1976లో కుటుంబ నియంత్రణ కార్యక్రమం జోరుగా సాగుతున్నది. తాము జనాభాను నియంత్రిస్తే లోక్‌సభ స్థానాల సంఖ్య తగ్గే ప్రమాదముందని అప్పట్లోనే దక్షిణాది రాష్ట్రాలు అనుమానం వ్యక్తం చేశాయి. దీంతో 1976లో ఎమర్జెన్సీ సమయంలో లోక్‌సభ సీట్ల సంఖ్యకు మరో 25ఏళ్లపాటు 1971 జనాభా లెక్కలనే పరిగణనలోకి తీసుకోవాలని 42వ రాజ్యాంగ సవరణ చేశారు. 2001లో నియోజకవర్గాల పునర్విభజన జరగాల్సి ఉన్నా అప్పట్లో ప్రధానిగా ఉన్నా వాజ్‌పేయి 84వ రాజ్యాంగ సవరణ చేశారు.లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచకుండా పునర్‌వ్యవస్థీకరణ చేశారు. కొన్ని జనరల్ స్థానాలను ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కేటాయించి వారి ప్రాతినిధ్యం పెంచారు. లోక్‌సభ సీట్ల సంఖ్యపెంపు అంశాన్ని 2026కి వాయిదా వేశారు. దీంతో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ 2026లో ఎలాగైనా నియోజకవర్గాలనుపునర్విభజించాలని భావిస్తున్నది. ప్రస్తుతం 2011సెన్సెస్ మాత్రమే అందుబాటులో ఉన్నాయి. కరోనా కారణంగా 2021 జనగణనను వాయిదా వేశారు. కేంద్ర ప్రభుత్వం 2025లో జనగణన చేస్తుందనే ప్రచారం సైతం జరుగుతున్నది. జనగణనకు ఇంకా ఏడాది సమయం ఉన్నందున, 2021లో చేపట్టాల్సిన జనగణనను పూర్తిచేసి నియోజకవర్గాలను పునర్విభజిస్తారా? లేదా 2011 డేటాను పరిగణనలోకి తీసుకొని పునర్విభజన చేస్తారా అనేది కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉన్నది. ఉత్తర్‌ప్రదేశ్‌లో ప్రస్తుతం సీట్లసంఖ్య 80. పునర్విభజనతో ఆ రాష్ట్రంలో సీట్ల సంఖ్య 160కిపైగా పెరిగే అవకాశముంది.ఆ రాష్ట్ర ప్రాతినిధ్యం 14.7శాతం నుంచి 16శాతానికి పెరుగుతుంది. రాజస్థాన్‌లో ప్రస్తుతం 25ఎంపీ సీట్లుండగా, అవికూడా 52కి పెరుగుతాయని అంచనా. ఇక్కడ కూడా సీట్లురెట్టింపు అవుతున్నాయి. అలాగే బిహార్, ఇతర ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్లు కూడా గణనీయస్థాయిలో పెరిగే అవకాశాలున్నాయి. 1952లో పార్లమెంట్ స్థానాల సంఖ్య 489 కాగా, ఇందులో దక్షిణాది వాటా 25.35 శాతం. 1967లో సీట్లసంఖ్య 522కి కాగా, దక్షిణాది వాదా 24.13 శాతానికి పడిపోయింది. 1977లో సీట్లసంఖ్య 545కు చేరగా, దక్షిణాది సీట్ల వాటా 23.85 శాతానికి పడిపోయింది. అయితే ప్రస్తుతం డీలిమిటేషన్‌తో తెలంగాణ లోక్‌సభ సీట్ల సంఖ్య 17 నుంచి 39కి పెరిగే అవకాశముంది. అంటే పెరుగుదల 48 శాతం మాత్రమే. దీని ద్వారా పార్లమెంటులో తెలంగాణ ప్రాతినిధ్యం 3.1 శాతం నుంచి 3.3శాతానికి చేరుకుంటుంది. అదే ఆంధ్రప్రదేశ్‌ను తీసుకుంటే సీట్ల సంఖ్య 25నుంచి 52కు పెరుగుతుండగా, ఏపీవాటా మాత్రం 4.6శాతం నుంచి 4.3శాతానికి పడిపోతుంది. తమిళనాడులో 28శాతం సీట్లు పెరుగనుండగా కేరళలో కేవలం ఒక్కశాతం మాత్రమే సీట్లు పెరిగే అవకాశం ఉంది. ఇలా అయితే పార్లమెంటులో తమిళనాడు ప్రాతినిధ్యం 7.2 శాతం నుంచి 6.4శాతానికి, కేరళ ప్రాతినిధ్యం 3.7 శాతం నుంచి 2.9 శాతానికి పడిపోతుంది. జనాభా ఆధారంగా డీలిమిటేషన్ జరిగితే ఉత్తరాదిలోని నాలుగైదు రాష్ట్రాల్లో సత్తా చాటగలిగిన పార్టీలు దేశంలో అధికారంలోకి వచ్చే అవకాశాలు ఎక్కువ. దీంతో దక్షిణాది రాష్ట్రాలు తమ హక్కులు కోల్పోయే ప్రమాదముంది. ●

# అంతర్జాతీయ వాణిజ్యంపై ట్రంప్ సుంకం!

తోట యోగేందర్

గత కొంతకాలంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఇతర దేశాల నుండి అమెరికా దేశంలోకి దిగుమతి అయ్యే వస్తువులపై పన్నులను ఎడాపెడా పెంచారు. భారత్‌పై 26 శాతం,చైనాపై 34 శాతం వరకు దిగుమతి సుంకాన్ని పెంచారు. ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ వైట్‌హౌస్‌లో చేసిన ప్రసంగంలో, చైనా, భారతదేశం,యూరోపియన్ యూనియన్ వంటి కొన్ని వాణిజ్య భాగస్వాములకు అమెరికా నుంచి దిగుమతి రేట్లు 50 శాతం వరకు చేరుకోవడంతో, తమ దేశంలోకి జరిగే అన్ని దిగుమతులపై యునైటెడ్ స్టేట్స్10శాతం సుంకాన్ని విధిస్తుందని ట్రంప్ ప్రకటించారు. ఈ విధానం ట్రంప్'పరస్పర' వాణిజ్య వ్యూహానికి ప్రతిబింబంగా పరిగణించబడుతుంది. దీనిలో ఇతరదేశాలు వస్తువులపై విధించిన సుంకాలు వాణిజ్య అడ్డంకులకు ప్రతీకారంగా యునైటెడ్ స్టేట్స్ సుంకాలను వర్తింపజేస్తుంది. ఈ చర్య వాణిజ్య సంబంధాలను తిరిగి సమతుల్యం చేయడం, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, దాని అమలు దేశీయంగా ప్రపంచవ్యాప్తంగా అనేకసమస్యలు సృష్టించే అవకాశంఉంది. ముఖ్యంగా, అమెరికా వస్తువులపై సుంకాలు విధించే లేదా అమెరికాకు వ్యతిరేకంగా వాణిజ్యపద్ధతుల్లో పాల్గొనే దేశాలపై యునైటెడ్ స్టేట్స్ ప్రతీకారం తీర్చుకుంటుంది.చైనా లేదా యూరోపియన్ యూనియన్ వంటి దేశం అమెరికన్ వస్తువులపై 20శాతం సుంకాన్ని వసూలు చేస్తే, ఆ దేశం నుండి వచ్చే వస్తువులపై ప్రతిఫలంగా 20శాతం సుంకాన్ని వర్తింపజేస్తుంది. ఈవిధానం వాణిజ్య అసమతుల్యతలను సరిచేస్తుందని, అమెరికా అధ్యక్షుడి భావన. కరెన్సీ మానిప్యులేషన్, కోటాలు, రాయితీలు వంటి నాన్‌టారిఫ్ అడ్డంకులు వంటి హానికరమైన వాణిజ్య పద్ధతులుగా తాను భావించే వాటికి ఈసుంకాలు ప్రతిస్పందన అనిట్రంప్ తన ప్రసంగంలో నొక్కిచెప్పారు. ఇతర దేశాల 'అన్యాయమైన' పద్ధతుల కారణంగా అమెరికన్ పరిశ్రమలు తయారీదారులు చాలా కాలంగా నష్టపోతున్నారని ఆయన పేర్కొన్నారు. దానికి ప్రతిగా ఇలాంటి నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ టారిఫ్‌ల అమలు ఈ నెల మొదటివారిలో ప్రారంభమైంది. ఇది అనేక తక్షణ ఆర్థిక ప్రభావాలను కలిగి ఉంటుందని భావిస్తున్నారు. ఈ సుంకాలు తప్పనిసరిగా దిగుమతి చేసుకున్న వస్తువుల ధరకు జోడించబడే పన్నులు. ఈ అదనపు ఖర్చులు తరచుగా వినియోగదారులకు బదిలీ చేయబడతాయి. ఫలితంగా నిత్యావసర వస్తువుల ధరలు, ఎలక్ట్రానిక్



వస్తువుల నుంచి దుస్తులు, ఆహార ఉత్పత్తుల ధరలు పెరగనున్నాయి. అయితే ఇటువంటి సుంకాల చర్యలు ద్రవ్యోల్బణానికి దారితీస్తాయని, అమెరికన్ల జీవన వ్యయం పెరుగుతుందని పలువురు ఆర్థికవేత్తలు అభిప్రాయపడుతున్నారు. విదేశీ పోటీని తగ్గించడం వల్ల దేశీయ ఉత్పత్తి పెరగవచ్చు. కాబట్టి తయారీ రంగం స్వల్పకాలిక ప్రయోజనాలను అనుభవించవచ్చు.అయితే, దీర్ఘకాలంలో మొత్తం ఆర్థిక ప్రభావం అంత అనుకూలంగా ఉండకపోవచ్చునని ఆర్థికవేత్తలభావన. వినియోగదారులు ధరల పెంపుదల భారాన్ని అనుభవించే అవకాశం ఉంది. తక్కువ ఆదాయ కుటుంబాలు,ముఖ్యంగా వారి కొనుగోలు శక్తి తగ్గిపోవడంతో చాలా కష్టపడవచ్చు అని ఆర్థిక వేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఈ టారిఫ్‌లు వినియోగదారుల వ్యయం తగ్గడానికి దారితీస్తాయని మరి కొందరి అభిప్రాయం. ఎందుకంటే పెరుగుతున్న ధరల కారణంగా కుటుంబాలు తక్కువ ఖర్చు చేసే ఆదాయాన్ని కలిగి ఉంటాయి. ఇది ఆర్థిక వృద్ధికి ఉపాధి అవకాశాలకు హాని కలిగించవచ్చు. ఇంకా ఇతర దేశాలు అమెరికా ఎగుమతులపై తమ సొంత సుంకాలను విధించడం ద్వారాపై ప్రతీకారం తీర్చుకోవడంతో వాణిజ్య యుద్ధం తీవ్రమవుతుంది. ఇది వ్యవసాయం, ఆటోమొబైల్స్ సాంకేతికత వంటి పరిశ్రమలను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుందనీ ఆర్థిక వేత్తలు అంచనా వేస్తున్నారు. టారిఫ్ విధానంతో ముడిపడి ఉన్న అతిపెద్ద ప్రమాదాలలో ఒకటి ప్రపంచ వాణిజ్య సంబంధాలలో ఉద్రిక్తతలను పెంచేఅవకాశం. ఈ టారిఫ్‌లను విధించడం వాణిజ్యానికి న్యాయాన్ని పునరుద్ధరించడంలో సహాయపడుతుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విశ్వసిస్తుండగా, ఇతర దేశాలు, ముఖ్యంగా యూరోపియన్ యూనియన్, చైనా, భారతదేశం ఈ చర్యను ప్రతికూలంగా భావించి తదనుగుణంగా ప్రతీకారం తీర్చుకునే అవకాశం ఉంది. ఆధునిక ప్రపంచం ఆర్థిక పరస్పర అనుసంధానం అంటే సుంకాల వంటి వాణిజ్య అడ్డంకులు అలల ప్రభావాలను కలిగి ఉంటాయి. యూరోపియన్ యూనియన్ నుండి దిగుమతి చేసుకున్న వస్తువులపై 20శాతం సుంకం కేవలం వినియోగదారులపైనే కాకుండా, అమెరికన్ ఎగుమతులపై ఆధారపడే యూరోపియన్ వ్యాపారాలపై కూడా ప్రభావం చూపుతుంది. అదేవిధంగా, ప్రపంచంలోని అతిపెద్ద ఎగుమతిదారులలో ఒకటైన చైనా, వస్తువులపై దాని స్వంత సుంకాలను వర్తింపజేయడం ద్వారా ప్రతీకారం తీర్చుకోవచ్చు, ఈ విధంగా ఉద్రిక్తతలను మరింత తీవ్రతరం చేస్తుంది.రెండు ఆర్థిక వ్యవస్థలకు హానికలిగించే వాణిజ్య యుద్ధానికి దారితీయవచ్చు. ఈ విధానాల వల్ల ప్రపంచ మార్కెట్లు అనేక ప్రతి కూల ప్రభావాలకు లోనయ్యే అవకాశం ఉందని ఆర్థిక వేత్తలు హెచ్చరిస్తున్నారు. ●

# ప్రజావాక్కు



### చిన్న చిన్న కారణాలతో తిరస్కరణ

దేశవ్యాప్తంగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వ రంగసంస్థల్లో పనిచేస్తున్న పదవీ విరమణ పొందిన వేల మంది ఉద్యోగులు అధిక పింఛనుకోసం దరఖాస్తు చేసినతర్వాత ఒక ఏడాదిన్నర పాటు పరిశీలనపేరిట ప్రాసెస్ పెట్టిన ఈ.పి.యఫ్.వో గత కొద్దిరోజుల నుండికారణమేమి తెలియ చేయకుండానే దరఖాస్తులను తిరస్కరిస్తున్నట్లుగా సమాచారమిస్తుంది.ఇది ఒక్కరి సమస్య కాదు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగులు పింఛనుదారులకి అధిక పింఛను ఇవ్వబోమని, కట్టిన సొమ్మును వెనక్కిఇస్తామని ఈ పి.యఫ్.వో అధికారులు తెలుపగా వెంటనే విషయం తెలుసుకున్న సి.యం. చంద్రబాబు నాయుడు చొరవ తీసుకుని కేంద్ర ప్రభుత్వంతో చర్చించి వారందరికీ న్యాయం జరిగేలా చేసారు. ఇదే తరహాలో చంద్రబాబు కేంద్రకార్మిక శాఖా మంత్రితో మాట్లాడి కేంద్ర, రాష్ట్రప్రభుత్వ రంగసంస్థల్లోని ఉద్యోగులందరికీ న్యాయం జరిగేలా చూడాలి.

-దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

ఈ సేవ స్పెషల్ ఎంట్రీ టికెట్ల ద్వారా తిరుమల తిరుపతి దేవస్థానం భక్తులకు అనేకరకాల సౌకర్యాలను అందిస్తుంది. దర్శనం,వసతిలాంటి వసతులు భక్తులకు ఎంతో ఉపయోగకరం.ఈస్పెషల్ ఎంట్రీదర్శనంటిక్కెట్లు కొన్ని నెలల ముందుగా స్లాట్ పద్ధతిలో తిరుమల తిరుపతి దేవస్థానం కేటాయిస్తుంది.సమస్యఇక్కడే మొదలవుతుంది. భక్తులకు ఈ దర్శనం టిక్కెట్లు లభ్యమైనప్పటికీ వసతి సౌకర్యం టిక్కెట్లు మాత్రం లభించవు. ఈ దర్శనం టిక్కెట్లు ఉన్న వారికి,తిరుమలలోవసతి ఎంతోఅవసరం.వసతి సౌకర్యం కల్పించలేనప్పుడు భక్తులు కోరితే వారి వారి ఈ-దర్శనం టిక్కెట్లు రద్దు చేసుకొనే అవకాశం కల్పించాలి.

-గోమఠం నరసింహాచార్యులు, ప్రకాశం జిల్లా

### సౌర పార్కులు ఏర్పాటు చేయాలి

దేశ అవసరాలనుతీర్చేరీతిలో సౌరవిద్యుత్ ఉత్పత్తి చేయాలనిలక్ష్యంగా పెట్టుకున్న భారత ప్రభుత్వం అటు వైపుగా పంచామృత్ సూత్రంతో ముందుకు వెళుతోంది. సౌర పవనవిద్యుత్ ఉత్పత్తిద్వారా జార్ఖండ్ తెలంగాణ మధ్యప్రదేశ్ చత్తీస్‌గఢ్‌లాంటి బొగ్గుఉత్పత్తి చేసే రాష్ట్రాలు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఆ రాష్ట్రాలలో పీపీపీ మోడ్‌లో సౌరపార్కులు,సౌరవిద్యుత్ ఉత్పత్తిక్లస్టర్లఫామ్ చేయాలి.

-భారత అవినాష్, జనగాం

### సుంకాల బాధలు భరించక తప్పదా?

అధికసుంకాలు, వీసాల గొడవలు, ఉద్యోగుల భయాందోళనలు ఇంకా యితర సమస్యల మీద అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీసుకున్న కఠిన నిర్ణయాలకు విసుగు చెంది లక్షలాది ప్రజలు ఆందోళనలకుదిగారు.ఎన్నికలకు ముందు కూడా ట్రంప్ చేపట్టబోయే విధానాలమీద ప్రజలకు అనుమానం రాకపోలేదు. ఈయన మీద పోటీ చేసిన కమలా హారిస్ గెలుపు వాకిట వరకు వెళ్లి అపజయం పాలయింది. ఎనిమిది సంవత్సరాల క్రితం ట్రంప్ మొదటిసారి ఎన్నికయినప్పుడు కూడా ప్రజలు శ్వేతసౌధం ముందు ఈయన ఒద్దు బాబోయ్ అని కేకలు వేసారు. కానీ ఏమీ కాలేదు కదా! ఇప్పుడు రెండవసారి ఆయన్నే ఎన్నుకున్నప్పుడు ఈ నాలుగు సంవత్సరాలు ఆయన్ను భరించవలసిందే. యూరోపియన్ దేశాలతోసహా బీద దేశాలు తమ వ్యతిరేకతను వ్యక్తం చేసినా మొండి వానికి ఏమవుతుంది? పెరిగిన సుంకాల వల్ల భారత్‌కు దిగుమతి అయ్యే వస్తువులధరలు పెరుగుతాయంటున్నారు.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### మరమ్మతులు చేపట్టాలి

ఏపిలోని కొన్ని ప్రముఖ జిల్లాల్లో బడుల్లో పిల్లలకు మంచి నీరు అందించే వాటర్ ప్లాంట్లు పనిచేయడం లేదు. కొన్ని చోట్ల వాటి వినియోగానికి పనులు పెండింగ్ ఉన్నవి. రోజు రోజుకు పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో పిల్లలు తెచ్చిన బాటిల్స్‌లో నీరు నింపుకునే సదుపాయం,బోరు మరమ్మతులు చేయిస్తే నీటికోసం పిల్లల ఎదురుచూపు ఉండదు. బడులు ప్రారంభానికి ముందుగానే వీటిని పరిష్కరిస్తే , తల్లితండ్రులు కూడా సంతోషించి ప్రభుత్వ ఉచిత పంపిణీలను ఉపయోగించి ప్రభుత్వ బడుల్లో కచ్చితంగా చేర్పించగలరు.

-బొల్లోజు మేఘునధ్, విశాఖపట్నం

### డిప్యూటేషన్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఉద్యోగ వికలాంగుల ప్రస్తుతం పని చేస్తున్న ప్రాంతంలో సౌకర్యంగా ఉంటే అదే ప్రాంతంలో ఉంచాలి. ట్రాన్స్ ఫర్, డిప్యూటేషన్ నుండి ఉద్యోగ వికలాంగులకు మినాయింపు ఇవ్వాలి. ప్రస్తుతం పని చేస్తున్న ప్రాంతంలో గదులు అద్దెకు తీసుకుని పిల్లల సంరక్షణలో స్కూల్‌లో జాయిన్‌అయిన తర్వాతవారిని ఇతర ప్రాంతాలకు మార్చడం చాలా ఇబ్బంది అవుతుంది. ప్రయాణానికి అనుకూలంగా ఉండే ప్రాంతంలో ఉంచాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# వేగంగా వాహనం నడిపినా వీసా రద్దు..

## అమెరికాలో విద్యార్థులకు కొత్త ఆందోళన?




**వాషింగ్టన్, ఏప్రిల్ 8:** అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటారో అర్థంకాని పరిస్థితుల్లో అమెరికాలోని విదేశీ విద్యార్థులు వణికిపోతున్నారు. ఈ నేపథ్యంలో ఓ కథనం ఆందోళనకు గురిచేస్తోంది. చిన్నపాటి ట్రాఫిక్ ఉల్లంఘనకు పాల్పడి నోటీసులు అందుకున్నా సరే వీసా రద్దు వంటి కఠిన శిక్ష ఎదురవుతున్నట్లు ఈ కథనం పేర్కొంది. భారత్ సహా విదేశీ విద్యార్థుల వీసాలు రద్దు అవుతున్న ఘటనలు పెరుగుతున్నాయని పలు అమెరికా కళాశాలలు పేర్కొన్నారు. వారిలో చాలామందికి క్యాంపస్‌లలో జరుగుతోన్న అనుకూల ఆందోళనలతో ఎలాంటి సంబంధం లేదు. అయినప్పటికీ గతంలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించారనే కారణం చూపించి వీసాలను రద్దు చేసినట్లు ఆ మీడియా కథనం వెల్లడించింది. హార్వర్డ్, స్టాన్‌ఫర్డ్ సహా పలు ప్రముఖ విశ్వవిద్యాలయ అధికారులు ఈ ఆకస్మిక వీసా రద్దుపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఫెడరల్ ఇమిగ్రేషన్ డేటాబేస్‌ను చూసిన తర్వాత ఆ విషయం తమకు తెలిసిందన్నారు. వీసా రద్దుకు సంబంధించిన కారణాలు కూడా ప్రభుత్వం పేర్కొనడం లేదని చెప్పారు. ప్రభావిత విద్యార్థుల్లో భారతీయులు కూడా ఉన్నట్లు తెలిసింది. ఆన్‌లైన్‌లో గాజా సంబంధిత అంశాలపై మద్దతు తెలిపినందుకు మరికొందరికి స్టూడెంట్ వీసాలు రద్దయ్యాయి. విదేశీ విద్యార్థుల సోషల్ మీడియా ఖాతాలపై అమెరికా నిఘా పెట్టినట్లు ఇటీవల వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. 2023 అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి చేసిన నాటి నుంచి ఇప్పటివరకు వారికి మద్దతుగా ఎవరెవరు పోస్టులు చేశారు. ఎవరు వాటిని లైక్, షేర్ చేశారనే విషయాలు తెలుసుకోవడానికి ఏఐతో స్కాన్ చేస్తున్నట్లు యాక్సియోస్ అనే నివేదిక వెల్లడించింది. విద్యార్థులు వారు చేసిన పోస్టులను తొలగించినప్పటికీ ప్రభుత్వ విభాగాల వద్ద వాటి స్క్రీన్‌షాట్‌లు ఉంటాయని ఆ నివేదిక పేర్కొంది. క్యాంపస్ ఆందోళనల్లో క్రియాశీలంగా వ్యవహరించిన అమెరికాలోని విదేశీ విద్యార్థులకు అక్కడి విదేశాంగ శాఖ హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. కేవలం ఆందోళనల్లో పాల్గొన్న వారినే కాకుండా అక్కడి దృశ్యాలను, జాతి వ్యతిరేక సందేశాలను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసిన వారిని స్వచ్ఛందంగా దేశం విడిచి వెళ్లిపోవాలని ఈ మెయిల్స్ పంపినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే యాక్సియోస్ నివేదిక, తాజా కథనం వెలువడటం చర్చనీయాంశంగా మారింది.



# బంగ్లాదేశ్‌కు తిరిగొస్తా.. అందుకే దేవుడు బతికించాడు

## మాజీ ప్రధాని షేక్ హసీనా

**ఢాకా, ఏప్రిల్ 8:** బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా మళ్లీ దేశానికి తిరిగి రానున్నారు. ఈ విషయాన్ని ఆమె స్వయంగా వెల్లడించారు. సోషల్ మీడియా వేదికగా అవామీ లీగ్ పార్టీ కార్యకర్తలతో జరిగిన సంభాషణ సందర్భంగా హసీనా హామీ ఇచ్చారు. బంగ్లా తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ తీవ్ర విమర్శలు చేశారు. 'ఏదో ఒకకారణం వల్లే ఆ దేవుడు నన్ను ఇంకాబతికించాడు. అవామీ లీగ్ పార్టీ సభ్యులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకున్న వారికి తగిన బుద్ధి చెప్పే రోజు వస్తుంది. తప్పకుండా న్యాయం జరుగుతుందన్న విశ్వాసం ఉంచండి. నేను త్వరలోనే బంగ్లాదేశ్‌కు తిరిగి వస్తాను' అని షేక్ హసీనా భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మహమ్మద్ యూనస్‌పై మండి పడ్డారు. 'యూనస్‌కు ప్రజలంటే ప్రేమ లేదు. అధిక వడ్డీకి రుణాలుఇచ్చి ఆయన విదేశాల్లో విలాసవంతమైన జీవితం గడిపి వచ్చారు. ఆ సమయంలో ఆయన తీరును అర్థం చేసుకోలేక పోయాం. అతడికి దేశం ఎంతో సహాయం చేసింది' అని అన్నారు.

**బంగ్లాలో ఎన్నో నేరాలు:** 'యూనస్ వల్ల దేశ ప్రజలకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు. అతడికి అధికారంపై వ్యామోహం మాత్రమే ఉంది. వారి సారథ్యంలో బంగ్లా ప్రస్తుతం ఉగ్రవాద దేశంగా మారింది. మన నాయకులు, కార్యకర్తలను దారుణంగా హత్య చేశారు. పోలీసులు, జర్నలిస్టులు, న్యాయవాదులు, కళాకారులు ఇలా ఎంతోమందిని లక్ష్యంగా చేసుకున్నారు. ప్రస్తుతం దేశంలో ఎన్నో అత్యాచారాలు, హత్యలు, దొంగతనాలు జరుగుతున్నాయి. కానీ, మీడియాకు చెందిన వ్యక్తులను లక్ష్యంగా చేసుకుంటారనే భయంతో ఈ నేరాలు బయటకు రావడం లేదు' అని తాత్కాలిక ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు.

**వారికి శిక్ష తప్పదు:** తన తండ్రి బంగ్లాదేశ్ తొలి అధ్యక్షుడు షేక్ ముజిబర్ రెహమాన్ సహా తన కుటుంబం మొత్తం హత్యలకు గురైన సంఘటనలను షేక్ హసీనా గుర్తు చేసుకున్నారు. 'ఒక్క రోజులోనే నా తండ్రి, తల్లి, సోదరుడిని కోల్పోయాను. నాడు వారు మమ్మల్ని దేశంలోకి రానివ్వలేదు. మీ సొంత వారిని కోల్పోయి ఇప్పుడు మీరంతా అనుభవిస్తున్న బాధను నేను అర్థం చేసుకోగలను. నా ద్వారా మీ అందరికీ మంచి చేయాలని ఆ భగవంతుడు కోరుకుంటున్నాడేమో. అందుకే నన్ను ఇంకా రక్షిస్తున్నాడు. నేను తిరిగి వచ్చాక అన్యాయం చేసిన వారందరికీ కఠిన శిక్ష అమలు చేస్తా' అని హసీనా ప్రతిన బూనారు.

# అమెరికాతో వాణిజ్య యుద్ధానికి చైనా మార్కెట్లు రెడీ?



**బీజింగ్, ఏప్రిల్ 8:** నానాటికీ వాణిజ్య యుద్ధం ముదురుతుండడంతో అమెరికాతో అమీతుమీ తేల్చుకొనేందుకు చైనా మార్కెట్లు, నియంత్రణ సంస్థలు సన్నాహాలు మొదలుపెట్టాయి. తాజాగా ఆ దేశానికి చెందిన ఎన్ఎఫ్ఆర్ఏ (నేషనల్ ఫైనాన్షియల్ రెగ్యులేటరీ అడ్మినిస్ట్రేషన్), పీపుల్ బ్యాంక్ ఆఫ్ చైనా (పిబిసి), ప్రభుత్వ రంగంలోని ప్రధాన పెట్టుబడి సంస్థలు మంగళవారం ఉదయం కీలక నిర్ణయం తీసుకొన్నట్లు గ్లోబల్ టైమ్స్ పత్రిక పేర్కొంది. దేశంలోని క్యాపిటల్ మార్కెట్‌కు బలమైన మద్దతు ఇవ్వనున్నాయి. మంగళవారం ఉదయం నుంచి ఎన్ఎఫ్ఆర్ఏ బీమా ఫండ్స్ ఈక్విటీ పెట్టుబడులపై ఓ నోటీసు జారీ చేసింది. దీని ప్రకారం ఆ ఫండ్స్ మరింత మొత్తాలను స్టాక్‌మార్కెట్లలో పెట్టుబడి పెట్టేందుకు అవకాశం లభించింది. దీంతో వాస్తవిక ఆర్థిక వ్యవస్థకు మరిన్ని నిధులు అందుబాటులోకి వస్తాయి. దేశంలోకి ఇటీవల అభివృద్ధి చెందుతున్న వ్యూహాత్మక సంస్థల్లో పెట్టుబడులను ఇవి ప్రోత్సహిస్తాయని భావిస్తున్నారు.

మరోవైపు పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా కూడా స్టాక్ మార్కెట్ స్థిరీకరణ నిధి ఏర్పాటుకు అవసరమైన సొమ్మును ది సెంట్రల్ హుయ్‌జిన్ ఇన్వెస్ట్‌మెంట్ లిమిటెడ్‌కు ఇచ్చేందుకు ముందుకొచ్చింది. ఈ సంస్థ చైనా ప్రధాన భూభాగంలోని కంపెనీల షేర్లను కొనుగోలు చేయనుంది. ఈ విషయాన్ని మంగళవారం పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా ప్రకటించింది.

**ట్రంప్..తప్పు మీద తప్పు చేస్తున్నావ్ : బీజింగ్ హెచ్చరిక:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తప్పు మీద తప్పు చేస్తున్నారని చైనా విమర్శించింది. ఆయన ప్రపంచ వాణిజ్య యుద్ధంలో అవకాశాలు వెతుక్కొంటున్నారని అభిప్రాయపడింది. చైనా ప్రభుత్వం అమెరికా వస్తువులపై విధించిన సుంకాల ఉపసంహరణకు ట్రంప్ 48 గంటల డెడ్‌లైన్ విధించిన నేపథ్యం లో చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ తాజాగా ఓ ప్రకటన విడుదల చేసింది. 'మాపై టారిఫ్‌లు పెంచుతామని అమెరికా బెదరించడం తప్పు మీద తప్పు. ఇది అమెరికా బ్లాక్‌మెయిల్ విధానాలను మరోసారి బహిర్గతం చేసింది. చైనా వీటిని ఏమాత్రం పట్టించుకోదు. తన దారికి రావాలని అమెరికా పట్టుబడితే చివరి వరకు పోరాడుతుంది. అమెరికా ఏకపక్షంగా విధించిన అన్ని పన్నులను తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. చైనా సార్వభౌమత్వం, అభివృద్ధి ప్రయోజనాలు, భద్రతను దృష్టిలో పెట్టుకుని ప్రతిఘటన చర్యలు తీసుకుంటాం. ఇందుకు మాకు పూర్తి హక్కుంది' అని ఆ ప్రకటనలో పేర్కొంది.

అమెరికా నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 34 శాతం అదనపు సుంకం విధించాలని చైనా ఇటీవల నిర్ణయించిన విషయం తెలిసిందే. అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భగ్గుమన్నారు. ఏప్రిల్ 9 నుంచే 50 శాతం ప్రతీకార సుంకాలు విధిస్తామని హెచ్చరించారు. ఆ దేశంతో చర్చలు కూడా నిలిపివేస్తామని తేల్చి చెప్పారు.



# మా భూభాగంలోకి కిమ్‌జోంగ్ సైన్యం చొరబాటు: దక్షిణ కొరియా ఆరోపణ

**సియోల్, ఏప్రిల్ 8:** ఉత్తర కొరియా సైన్యంపై హెచ్చరికల కాల్పులు జరిపినట్లు దక్షిణ కొరియా వెల్లడించింది. సరిహద్దులోని తూర్పు భూభాగంలో కిమ్ సైన్యం ఉల్లంఘనకు పాల్పడిందని ఆరోపించింది. ఈ క్రమంలో హెచ్చరికలు చేయడంతో పాటు వార్నింగ్ షాట్‌లు ఇచ్చామని దాంతో 10 మంది కిమ్ సైనికులు తిరిగి వారి భూభాగంలోకి వెళ్లిపోయారని తెలిపింది. ఉత్తరకొరియా కార్యకలాపాలను నిశితంగా గమనిస్తున్నామని వెల్లడించింది. ఉత్తర, దక్షిణ కొరియాల మధ్య ఉన్న సైనికరహిత ప్రాంతంలో ఉల్లంఘనలు తరచూ వెలుగు చూస్తూనే ఉన్నాయి. గతజూన్‌లోనూ కిమ్ సైన్యం సరిహద్దుఉల్లంఘనకు పాల్పడింది. అయితే, శత్రుసైన్యం ఉద్దేశపూర్వకంగా చొరబడలేదని దక్షిణ కొరియా అధికారులు ధ్రువీకరించడంతో ఎటువంటి ఉద్రిక్తతలు తలెత్తలేదు. ఇక తాజా చొరబాటు వెనుక ఉద్దేశంపై మాత్రం స్పష్టత రాలేదు. ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాకు సాయం చేస్తున్న ఉత్తర కొరియా అటు అణ్వాయుధ ప్రయోగాలను ముమ్మరంగా కొనసాగిస్తూనే ఉంది. అణు నిరాయుధీకరణ చర్చలను పునఃప్రారంభించాలని అమెరికా, దక్షిణ కొరియాలు పిలుపునిస్తున్నప్పటికీ కిమ్ మాత్రం వాటిని పెడచెవిన పెడుతున్నట్లు కనిపిస్తోంది. కిమ్ తనకు మిత్రుడని, దౌత్య సంబంధాలు మెరుగుపరిచేందుకు ఆయనతో భేటీ కావడానికి సిద్ధంగా ఉన్నానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెబుతున్నప్పటికీ ఉత్తర కొరియా నుంచి ఎటువంటి స్పందన లేదు.

# టిఎంసిలో రచ్చకెక్కిన విభేదాలు: మమతకు తలపోటు తెస్తున్న నేతలు!



**కోల్‌కతా, ఏప్రిల్ 8:** తృణమూల్ కాంగ్రెస్‌లోని అంతర్గతపోరు రచ్చకెక్కింది. లీకైన విడియోలు వాట్సాప్‌చాట్‌లను బిజెపి షేర్‌చేయడంతో నేతలమధ్య ఘర్షణ బయటకు వచ్చింది. కమలం పార్టీ ఐటి సెల్ ఇన్‌ఛార్జి అమిత్‌మాలవీయ వాటిని షేర్‌చేసారు. ఎన్నికలసంఘం కేంద్ర కార్యాలయం వద్ద సీనియర్ ఎంపి కల్యాణ్ బెనర్జీ, మరో ఎంపిమధ్య ఈ గొడవ జరిగినట్లు తెలుస్తోంది. మాలవీయ పేర్కొన్న దాని ప్రకారం ఒక ప్రజంటేషన్‌ను ఇవ్వడానికి తృణమూల్ కాంగ్రెస్ ప్రతినిదుల బృందం ఈసీ కార్యాలయానికి వెళ్లింది. ఈసీ ఆఫీస్‌కు వెళ్లడానికిముందు వినతి పత్రంపై సంతకాలు చేసేందుకు ఒకసారి సమావేశం కావాలని పార్టీ ఆదేశాలు ఇచ్చింది. కానీ ఆ ఎంపి సమావేశానికి రాకుండానేరుగా ఈసీ వద్దకువెళ్లారు. ఇది ఇద్దరు ఎంపిలమధ్య గొడవకు దారితీసింది. ఆ ఘర్షణను ఆపేందుకు పోలీసులు జోక్యంచేసుకోవాలని పిలిచేవరకూ వెళ్లింది. బిజెపి షేర్ చేసిన విడియోలో కల్యాణ్‌బెనర్జీ మరో ఎంపిపై ఆగ్రహంతో ఊగిపోతున్నట్లుగా ఉంది. ఇదంతా పబ్లిక్‌ప్లేస్ కాసనత సంయమనం పాటించండి అని అక్కడున్న టిఎంసి నేత డెరెక్ ఓబ్రెయిన్ సర్దిచెప్పే ప్రయత్నంచేసినా ఫలితం లేకపోయింది. ఆతర్వాత ఎంపిలు బెనర్జీ, కీర్తి ఆజాద్ చాటింగ్ చేసారు. ఇక మాలవీయ షేర్‌చేసిన చాట్ ప్రకారం ఎఐటిసి ఎంపి 2024 పేరిట ఉన్న వాట్సప్‌గ్రూప్‌లో కల్యాణ్ బెనర్జీ కీర్తి ఆజాద్ మధ్య వాగ్వాదం నడిచింది. వారి చాటింగ్‌లో ఒక మహిల ప్రస్తావన కూడా వచ్చింది. సీనియర్ ఎంపి ప్రవర్తన కారణంగా పార్లమెంటు మహిళా సభ్యురాలు ఆగ్రూప్‌నుంచి ఎగ్జిట్ అయినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై టిఎంసినేత సౌగతారాయ్ స్పందించారు. ఇలాంటివి జరిగి ఉండాల్సింది కాదు.ప్రతిపార్టీ అంతర్గత గోప్యతను కాపాడుకోవాలి. ఈ గొడవ జరిగినపుడు నేను అక్కడ లేను. కానీ మహువా కన్నీళ్లపెట్టుకోవడంచూసాను. కల్యాణ్ ప్రవర్తనపై పార్టీలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోంది. అని రాయ్ తెలిపారు. కల్యాణ్‌తో జరిగిన వాగ్వాదంలో ఉన్న మరో ఎంపి మహువా మెయిత్రా అని తేలింది. ఈ మొత్తం ఎపిసోడ్ ఈ లీక్స్‌పై టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీ తీవ్రంగా కలతచెందారని వ్యక్తిగతంగా ఈ అంశాన్ని పరిశీలిస్తున్నారని తెలుస్తోంది. దీనికి సంబంధించి మీడియాలో ఎలాంటి ప్రకటనలు చేయద్దని నేతలకు ఆదేశాలు అందాయి. ఇదిలా ఉంటే వాట్స్‌చాట్‌లలోపేర్కొన్న మహిళ ఎవరో తెలియాల్సి ఉందని మాలవీయ తన పోస్టులో పేర్కొన్నారు. ఇదిలా ఉంటే వక్ఫ్‌బిల్లుపై గతంలో జరిగిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ సమావేశంలో కూడా కల్యాణ్ నిగ్రహాన్ని కోల్పోయిన సంగతి తెలిసిందే.ఆయనకు బిజెపి ఎంపి అభిజిత్ గంగోపాధ్యాయకు మధ్య వాగ్వాదం జరగ్గా తీవ్రఆగ్రహానికి గురైన టిఎంసిఎంపి పక్కనే ఉన్న గాజు వాటర్ బాటిల్‌ను పగలగొట్టారు. దీనితో ఆయన చేతికి గాయం కూడా అయింది.

# మీరట్ హత్యకేసులో నిందితురాలు గర్భవతి

## నిర్ధారించిన మీరట్ ఆసుపత్రి వైద్యులు



**మీరట్, ఏప్రిల్ 8:** మర్చంట్‌నేవీ అధికారి సౌరభ్ రాజ్‌పుత్ హత్యకేసులో నిందితురాలు ఆతడి భార్య ముస్కాన్ రస్తోగి గర్భం దాల్చినట్లు వైద్య పరీక్షల్లో తేలింది. దీనిపై బాధిత కుటుంబం స్పందించింది. ఒకవేళ ఆ బిడ్డ సౌరభ్‌కు చెం దినది అయితే దత్తత తీసుకుంటామని వెల్ల డించారు. ఆమె గర్భం దాల్చిన సంగతి మాకు తెలిసింది. ఒక వేళ బయోలాజికల్‌గా కడుపులోని బిడ్డ మా సోదరుడికి చెందిందే అయితే పుట్టినతర్వాత దత్తత తీసుకునేందుకు మా కుటుంబం సిద్ధంగా ఉందని అన్నారు. ఆ బిడ్డను పెంచుకునేందుకు మా అందరికీ ఇష్టమే అని సౌరభ్ సోదరుడు మీడియాకు తెలిపాడు. కాగా ప్రేమించి పెళ్లాడిన భర్తను ప్రియుడి సాయంతో కట్టుకున్న భార్యే దారుణంగా హత్యచేసి ముక్కలు చేసిన ఘటన సంచలనం కలిగించింది. ప్రస్తుతం జైలుశిక్ష అనుభవిస్తున్న నిందితురాలు ముస్కాన్‌కు ఇటీవల వైద్యపరీక్షలు నిర్వహిస్తే ఆమె గర్భం దాల్చినట్లు తేలింది. సిఎంఓ డాక్టర్ అశోక్ కటారియా స్వయంగా వెల్లడించారు. గర్భం దాల్చిన సంగతి నిందితురాలికి తెలిపారా అన్న ప్రశ్నపై ఫలితాలు వచ్చిన సమయంలో ఈ విషయాన్ని ఆమెకు తెలియజేసారని అనుకుంటున్నా. కానీ అల్ట్రాసౌండ్ రిపోర్టు వచ్చిన తర్వాతనే ఈ విషయాన్ని జైలు అధికారులు నిందితురాలికి అధికారికంగా తెలియజేస్తారని తెలిపారు. సౌరభ్ రాజ్‌పుత్ హత్య కేసులో నిందితులయిన ముస్కాన్ రస్తోగి, ఆమె ప్రియుడు సాహిల్ శుక్లాలు జైలులో ఉన్నారు. నిందితుడిని కలిసేందుకు ఆతడి బామ్మ వస్తున్నారని కానీ ముస్కాన్‌ను కలిసేందుకు ఎవరూ రావడంలేదని జైలు అధికారులు తెలిపారు. ఈ క్రమంలోనే ఆమె గర్భం దాల్చిన విషయం వెలుగులోకి వచ్చింది.



# హింగోలి జిల్లాలో 13వేల మందికి పైగా కేన్సర్

**ముంబయి, ఏప్రిల్ 8:** కేన్సర్ కేసులను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించేందుకు మహారాష్ట్రలో నిర్వహించిన సర్వేలో ఆందోళనకర విషయం వెలుగులోకి వచ్చింది. సంజీవని అభియాన్ పేరిట హింగోలి జిల్లాలో స్థానిక యంత్రాంగం నిర్వహించిన డ్రైవ్‌లో 13,500 మంది మహిళల్లో కేన్సర్ అనుమానిత లక్షణాలు కనిపించాయి. 7000 మందిలో సర్వైకల్ కేన్సర్, 3500 మందికి రొమ్ముకేన్సర్, 2000 మందిలో నోటికేన్సర్ అనుమానిత లక్షణాలను గుర్తించినట్లు కలెక్టర్ అభినవ్‌గోయల్‌మీడియాతో వెల్లడించారు. మరికొందరిలో ఇతర కేన్సర్ లక్షణాలు కనిపించాయన్నారు. ఈ డ్రైవ్‌లో భాగంగా జిల్లాలోని 3.5 లక్షలమంది మహి ళలపై సర్వేజరిగింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దీనిని ప్రారంభించామన్నారు. ప్రస్తుతంస్క్రీనింగ్ ముగిసిందని తర్వాత పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. నిపుణులు శిక్షణ పొందిన వైద్యబృందం పర్యవేక్షణలో ఈప్రక్రియను చేపట్టామని కలెక్టర్ తెలిపారు.

# నేటి నుంచి సీమాంధ్ర మీదుగా హుబ్లీ-కతిహార్ మధ్య ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 8,ప్రభాతవార్త:** ప్రస్తుత వేసవి సీజన్‌లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ సీమాంధ్ర మీదుగా హుబ్లీ-కతిహార్-హుబ్లీ మధ్య ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. హుబ్లీ నుంచి కతిహార్ వెళ్లే నెంబర్ 07325ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 9(నేటి) నుంచి 30వరకు ప్రతి బుధవారం మధ్యాహ్నం 3.15గంటలకు హుబ్లీ నుంచి బయలుదేరి శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు కతిహార్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కతిహార్ నుంచి హుబ్లీ వెళ్లే నెంబర్ 07326ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 12నుంచి మే 3వరకు ప్రతి శనివారం మధ్యాహ్నం 2.30గంటలకు కతిహార్ నుంచి బయలుదేరి సోమవారం ఉదయం 10.50గంటలకు హుబ్లీ చేరుకుంటుంది.

# టీచర్ నియామకాల్లో సిబిఐ దర్యాప్తు అవసరంలేదు..


## మమతకు ఊరటనిచ్చిన సుప్రీం ఉత్తర్వులు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:** పశ్చిమబెంగాల్ రాజకీయాలను కుదిపివేసిన ఉపాధ్యాయనియామక కుంభకోణం వ్యవహారంలో మమతా బెనర్జీ ప్రభుత్వానికి సక్వల్ప ఊరట లభించింది. ఈ కేసులో సిబిఐ దర్యాప్తునిమిత్తం హైకోర్టు ఇచ్చిన ఆదేశాల్లో కొన్నింటిని సుప్రీంకోర్టు తాజాగా పక్కనపెట్టింది. అదనపు పోస్టుల సృష్టిపై రాష్ట్రకేబినెట్ తీసుకున్న నిర్ణయంలో సిబిఐ దర్యాప్తు అవసరం లేదని స్పష్టంచేసింది. నిపుణులతోచర్చలుజరిపిన తర్వాతే బెంగాల్ విద్యాశాఖ ఈ అదనపు పోస్టులను సృష్టించింది. దీనికి గవర్నర్‌నుంచి ఆమోదం లభించింది. అలాంటప్పుడు ఇందులో న్యాయపరమైన జోక్యం అవసరం లేదని ప్రధాన న్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం వెల్లడించింది.అయితే టీచర్ల నియామకాల్లో ఇతర అవకతవకలకు సంబంధించిన ఇతర అంశాలు ఆరోపణలపై సిబిఐ దర్యాప్తు కొనసాగుతుందని కోర్టు వెల్లడించింది. ప్రభుత్వ ప్రయోజిత ఎయిడెడ్ పాఠశాలల్లో 9 నుంచి 12 తరగతులుకు ఉపాధ్యాయులతోపాటు గ్రూప్‌సి, గ్రూప్‌డి స్టాఫ్ సిబ్బంది నియామకాలకోసం 2016లో బెంగాల్ సర్కారు రాష్ట్రస్థాయి సెలక్షన్ పరీక్ష నిర్వహిం చింది. 24,650ఖాళీల భర్తీ కోసం చేపట్టిన ఈ రిక్రూట్‌మెంట్ పరీక్షకు 23 లక్షల మందికిపైగా హాజరయ్యారు. అనంతరం ఇందులో ఎంపికప్రక్రియ చేపట్టి 25,753 మందికి అపాయింట్‌మెంట్ లెటర్లు అందచేసారు. అయితే ఖాళీలు ఉన్న సంఖ్యకంటే ఎక్కువమందిని ఎంపికచేయడంపై వివాదం రాజుకుంది. ఉద్దేశ్యపూర్వకంగానే అదనపు పోస్టులను సృష్టించి అక్రమ నియామకాలు చేపట్టారని ఆరోపణలు వచ్చాయి. దీనిపై విచారణజరిపిన కోల్‌కత్తా హైకోర్టు 2016 నాటికి ఆ నియామక ప్రక్రియ చెల్లదని తీర్పు వెలువరించింది. అంతేకాక ఈ కేసులో రాష్ట్రప్రభుత్వ అధికారుల పాత్రతోపాటు అవకతవకలపై దర్యాప్తుజరపాలని సిబిఐ ఆదేశించింది. దీన్ని సవాల్‌చేస్తూ బెంగాల్‌ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై గతంలో విచారణజరిపిన సర్వోన్నత న్యాయస్థానం సిబిఐ దర్యాప్తుపై స్టే విధించింది. తాజాగా అదనపు ఉద్యోగాల సృష్టిపై దర్యాప్తు అవసరం లేదంటూ తీర్పు వెలువరించింది. ఇప్పటికే 25,753 మంది టీచర్ల నియామకాలు చెల్లవని సుప్రీంకోర్టు గత వారం తీర్పు వెలువరించింది.

# తమిళనాడు గవర్నర్‌పై సుప్రీం సీరియస్

## వీటో అధికారం గవర్నర్‌కు లేదు.. సుప్రీంబెంచ్ స్పష్టీకరణ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:** తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిపై సుప్రీంకోర్టు సీరియస్ అయింది. రాష్ట్ర అసెంబ్లీ పంపించిన బిల్లులను తన వద్దనే పెట్టుకుని వీటో అధికారం గవర్నర్‌కు లేదని సుప్రీంకోర్టు తన తీర్పులో స్పష్టంచేసింది. జస్టిస్ జెబి పార్దీవాలా, ఆర్ మహాదవేన్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం తీర్పు వెలువరించింది. తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి చర్యలు అక్రమం అని పేర్కొన్న కోర్టు ఆయన వద్ద బిల్లులకు గవర్నర్ తప్పనిసరి అనుమతి ఇవ్వాలని,అయితే బిల్లుల్లో వైరుధ్యం ఉంటే దాన్ని తిరస్కరించాలని కోర్టు పేర్కొంది. తమిళనాడు శాసనసభ పంపించిన పది బిల్లులను గవర్నర్ రిజర్వులో పెట్టుకోవడం అక్రమం అని న్యాయవ్యతిరేకమైనదని అందుకే ఆచర్యలను పక్కన పెడుతున్నామని ఆ బిల్లులను గవర్నర్‌కు సమర్పించిన నాటినుంచి వాటికి క్లియరెన్స్ దక్కినట్లు కోర్టుప్రకటించింది. తమ బిల్లులకు గవర్నర్ అనుమతి ఇవ్వడంలేదని తమిళనాడు ప్రభుత్వం దాఖలుచేసిన పిటిషన్‌పై కోర్టు తాజా ఆదేశాలు జారీచేసింది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో గవర్నర్లు చాలా చురుకుగా పనిచేయాలని కోర్టు పేర్కొంది. ఓ స్నేహితుడిగా మార్గదర్శిగా, తత్వవేత్తగా గవర్నర్ పనిచేయాలని కోర్టు సూచించింది. రాజకీయ ప్రేరణతో ఆయన పని చేయకూడదని ధర్మాసనం హితవు పలికింది. సమస్యలు పరిష్కరించడంలో గవర్నర్ ఒక దూతలా ఉండాలని ఉత్ప్రేరకంగా పనిచేయాలని కోర్టుచెప్పింది. రాజ్యాంగ విలువల్ని గవర్నర్లు రక్షించాలని కోర్టుతెలిపింది. 2020నుంచి 2023వరకూ సుమారు 12 బిల్లులను తమిళనాడు అసెంబ్లీ గవర్నర్ అనుమతికోసం పంపించింది. కానీ గవర్నర్ ఆ బిల్లులను నిరవధికంగా వాయిదావేసారు. దీనితో ఆ బిల్లుల అనుమతి కోరుతూ తమిళనాడు సర్కారు సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే 2023 నవంబరులో రెండుబిల్లులను రాష్ట్రపతి ఆమోదం కోసం పంపించగా మరో 10బిల్లులు గవర్నర్‌వద్దనే ఉండిపోయాయి. అయితే కొన్నిరోజుల వ్యవధిలో మళ్లీ ఆ పదిబిల్లులను రాష్ట్రశాసనసభలో పాస్‌చేయించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్ అనుమతి కోరుతున్నట్లు తమిళనాడు సర్కారుతన పిటిషన్‌లో సుప్రీంకు వివరించింది.

# న్యూఢిల్లీ డిఆర్‌ఎం కార్యాలయంపై సిబిఐ పంజా

## సీనియర్ డిఇఇ సహా మరో ఇద్దరు ఎస్ఎస్ఇలు అరెస్టు

## సోదాల్లో రూ.63.85లక్షల నగదు, రూ.3.46కోట్ల బంగారం,కీలకపత్రాలు స్వాధీనం



సిబిఐ దాడుల్లో బయటపడిన నగదు, బంగారు ఆభరణాలు



**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 8,ప్రభాతవార్త:** నార్ధన్ రైల్వే న్యూఢిల్లీ డిఆర్ఎం కార్యాలయంపై సిబిఐ పంజా విసిరింది. ఈ దాడుల్లో రైల్వేకి చెందిన ఒక సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్,మరో ఇద్దరు సీనియర్ సెక్షన్ ఇంజనియర్లు సిబిఐ వలలో చిక్కడంతో డిఆర్ఎం కార్యాలయంలో విషాద చాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళితే. నార్ధన్ రైల్వే న్యూఢిల్లీ డివిజన్‌లో విద్యుత్ విభాగానికి చెందిన పనులను అప్పగించేందుకు గుత్తేదారును సంబంధిత విభాగం అధికార యంత్రాంగం రూ.7లక్షల లంచాన్ని డిమాండ్ చేశారని బాధిత గుత్తేదారుడు సిబిఐని ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి సదరు గుత్తేదారుడు ఇచ్చిన ముందస్తు పక్కా సమాచారంతో బాధిత కాంట్రాక్టర్ రూ.7 లక్షల లంచాన్ని ఇస్తుండగా సిబిఐ చాకచక్యంగా వలపన్ని రెడ్ హ్యాండెడ్‌గా సీనియర్ డిఇఇ సహా మరో ఇద్దరు ఎస్ఎస్ఇలను అరెస్టు చేసింది. ఇదే సమయంలో తొమ్మిది వేర్వేరు ప్రాంతాల్లో వీరికి చెందిన నివాసాలలో ఏకకాలంలో దాడులు చేసి సోదాలు నిర్వహించగా రూ.63.85లక్షల నగదు, సుమారు రూ.3.46కోట్ల విలువైన బంగారం(రూ.96.26లక్షల బంగారు ఆభరణాలు), ఆస్తులకు సంబంధించిన కీలక పత్రాలు, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాపులు, ఈకేసుకు సంబంధించిన కీలక పత్రాలు,హార్డ్ డిస్కులు సీనియర్ డిఇఇ భార్య నిర్వహించే(చెందిన) లాకర్‌లో రూ.2.5కోట్ల విలువైన బంగారు బిస్కెట్లు సోదాల్లో స్వాధీనం చేసుకున్నట్లు సిబిఐ వర్గాలు తెలిపాయి.

ఈ కేసుకు సంబంధించి విచారణ కొనసాగుతోందని వారు పేర్కొన్నారు.

## వెట్టిచాకిరి ఘటనపై ఎస్టీ కమిషన్ చైర్మన్ ఆగ్రహం నివేదిక కోరిన చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు



ప్రసంగిస్తున్న కేసన శంకరరావు

**విజయవాడ,ఏప్రిల్8,ప్రభాతవార్తప్రతినిధి:** బాపట్ల జిల్లా రేపల్లె మండలం బొబ్బర్లంకకు చెందిన ఎస్టీ సామాజిక వర్గ దంపతుల వెట్టి చాకిరీ ఘటనపై జిల్లా అధికారులు సమగ్ర నివేదిక పంపాలని ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు ఆదేశించారు.తమను వెట్టిచాకిరి చేయిస్తున్నారంటూ నంబూరు పద్మ, అగ్ని దంపతులు ఇచ్చిన ఫిర్యాదు పై స్పందించిన బాపట్ల కలెక్టర్ ను చైర్మన్ అభినందించారు.వెట్టిచాకిరి చేయించడంతో పాటు, దంపతులను అమ్మకానికి పెట్టడంపై చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ కాలంలో కూడా వెట్టిచాకిరి చేయించేందుకు యత్నించడం దారుణమన్నారు.ఇటువంటి పరిణామాలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు పేర్కొన్నారు. ఈ ఘటనపై పూర్తి నివేదికను బాపట్ల జిల్లా అధికారులు వెంటనే కమిషన్ కు సమర్పించాలని ఆదేశించారు.

## జనగణనలో కులగణన చేపట్టాలి: కేసన శంకరరావు

**విజయవాడ, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** జనాభా దామాషాలో ఆయావర్గాలందరికి రిజర్వేషన్లు, సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లల్లో అందించి, సామాజిక న్యాయం అందాలంటే తప్పనిసరిగా ఈ సారి జరిపే జనగణనతో పాటే సమగ్ర కులగణన చేయాల్సిందేనంటూ ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం రాష్ట్రాధ్యక్షులు కేసన శంకరరావు పునరుద్ఘాటించారు. విజయవాడలో ఉద్యోగ విభాగ రాష్ట్ర అధ్యక్షులు ఎంవిఎస్ఎస్ మూర్తి, ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకా వేంకటేశ్వరరావు అధ్యక్షతన 45 బిసికుల సంఘ నాయకులతో జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ప్రసంగిస్తూ దేశాభివృద్ధికి, సంపద పంపిణీకి, పేదరిక నిర్మూలనకు కులగణన చేయాల్సిందేనని, ఈ విషయంలో బిజెపి ప్రభుత్వం నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఓబిసిలు సమరశీల పోరాటాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈనెల 27న విజయవాడ ఇందిరాగాంధి స్టేడి నుండి తుమ్మలపల్లి కళాక్షేత్రం వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించి మహాత్మా జోతిబా పూలే, డా బిఆర్ అంబేద్కర్‌ల విగ్రహాలకు జనగణనలో సమగ్ర కులగణనకు విజ్ఞాపన పత్రాలందిస్తామన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మాలికవరప కనకారావు, బి శ్రీనివాస్, అందే జగదీష్, మేకా వెంకటేశ్వరరావు, కుక్కల వీర వెంకట సత్యనారాయణ, గుంటుపల్లి ఉమా మహేశ్వరరావు, సిహెచ్ పుల్లారావు, కందిమళ్ల శేషగిరిరావు, దాసరి కేశవరావు తదితర బిసి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### ఎపి ఎస్పీఎఫ్ ఎపి సెక్రటేరియట్ యూనిట్ నందు రక్త పరీక్షలు

**సచివాలయం,ఏప్రిల్ 8,ప్రభాతవార్త :** ఏపిఎస్పీఎఫ్ డిజి డాక్టర్ త్రివిక్రమ్‌వర్మ ఐజి బి.వి.రామిరెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఉన్న ఎస్పీఎఫ్ సిబ్బందిక అందరికీ రక్త పరీక్ష నిర్వహించారు.ఆంధ్రప్రదేశ్ సచివాలయం నందు కమాండెంట్ ఎం.శంకరరావు ఆధ్వర్యంలో ఏపిఎస్పీఎఫ్ అధికారులకు సిబ్బంది యొక్క ఆరోగ్య దృష్ట్యా ఏపిఎస్పీఎఫ్ హెడ్ క్వార్టర్స్ రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించారని చీఫ్‌సెక్యూరిటీ ఆఫీసర్ ఏపి సెక్రటేరియట్ వి.వి.ఎన్.ఎన్.మల్లికార్జునరావు తెలిపారు.సిబ్బందిని ఉద్దేశించి మాటాల్లడుతూ ఈ రక్త పరీక్షలు నిర్వహించడం వలన సిబ్బంది యొక్క ఆరోగ్యసమస్యలను ముందుగానే తెలుసుకొని తగిన వైద్యం చేయించుకోవడానికి వీలుగా ఉంటుందని మరియు పాటించాల్సిన ఆహార నియామాలను గురించి వివరించారు.కార్యక్రమంలో సుమారుగూ 217మంది సిబ్బందితోపాటు ఇన్‌స్పెక్టర్లు ఎం.వెంకటేశ్వర్లు,ఎస్.రమణ,ఎస్సైలు,ఎఎస్సైలు పాల్గొన్నారు.

### రాష్ట్రం అభివృద్ధిపథంలో ముందుండాలి -తిరుమలలో టిడిపి ఏపి అధ్యక్షుడు శ్రీనివాస్

**తిరుమల,ఏప్రిల్ 8ప్రభాతవార్తప్రతినిధి:** కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసయాదవ్ తెలిపారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రప్రజలు బాగుండాలని వేంకటేశ్వరస్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. మంగళవారం వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## 11 న ఒంటిమిట్ట సీతారాముల కల్యాణానికి పట్టు వస్త్రాలు సమర్పించనున్న సిఎం



వటపత్రసాయిగా రాముడు

**రాజంపేట అర్బన్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త** ఒంటిమిట్ట కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రెండో రోజున జగదభి రాముడు వటపత్ర సాయిగా ఉదయం భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి నవనీత నవనీత కృష్ణ అలంకారంలో సీతారామలక్ష్మణులు భక్తులకు దర్శనమిచ్చారు. ఒంటిమిట్ట పురవీధుల్లో స్వామిని ఊరేగించారు. ఊరేగింపు కేరళ వాయిద్యాలు, మహిళల కోలాటాలు, చెక్కభజనతో గ్రామోత్సవం కన్నుల పండుగగా ఆధ్యాత్మిక పండుగ వాతావరణంలో సాగింది. ఇదిలా ఉండగా ఈనెల 11 లో జరిగే ఒంటిమిట్ట సీతారాముల కల్యాణానికి ముఖ్యమంత్రి సతి సమేతంగా కోదండరామస్వామికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో శ్యామలరావు, కడప కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. మంగళవారం సీతారాముల కల్యాణోత్సవం ఏర్పాట్లపై ఒంటిమిట్ట టిటిడి కళ్యాణ మండపం పరిపాలన భవన సమావేశ మందిరంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రోగ్రాం కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్ రావు, తితిదే ఈఓ జె. శ్యామల రావు, తితిదే జెఈఓ వీరబ్రహ్మం, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ లు సమీక్షించారు. శ్రీ కోదండరామస్వామివారి కల్యాణోత్సవ ఏర్పాట్లపై శాఖల వారీగా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 11న శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరుగనుందన్నారు. అశేష భక్తజన సందోహం మధ్య కన్నుల పండుగగా జరిగే ఈ మహోత్సవానికి.. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుటుంబ సమేతంగా హాజరు కానున్నారన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం లేకుండా జిల్లా అధికారులు, టీటీడీ అధికారులు సంయుక్తంగా, సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలన్నారు.

## పుంగనూరులో ఆర్పీ చేతివాటం - రూ.32 లక్షలు స్వాహా



**పుంగనూరు, ఏప్రిల్ 8, ప్రభాతవార్త** పట్టణంలో పొదుపు సంఘాల బాధ్యతలు వహిస్తున్న ఆర్పీలు లక్షలాది రూపాయలు డబ్బులు స్వాహా చేస్తున్నప్పటికీ వీరిపై దర్యాప్తు చేయకపోవడంతో వీరి ఆటలకు హద్దు లేకుండాపోతోంది. ఇప్పటికే పట్టణంలోని అన్ని డ్వాక్రా సంఘాల ఆర్పీలో వ్యవహారాలపై బుట్టెడు ఫిర్యాదులు ఉన్నప్పటికీ ఇంతవరకు ఎవరిపై కూడా చర్య తీసుకున్న సంఘటనలు లేవు. అయితే తాజాగా పట్టణంలోని 28 గ్రూపులకు చెందిన 280 మంది డ్వాక్రా మహిళలకు సంబంధించి రూ.32 లక్షల రూపాయలు స్వాహా చేసిన ఆర్పి పరారైన ఉదంతం వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని వైభవలక్ష్మి సంఘానికి చెందిన గ్రూప్ సభ్యుల పొదుపు లావాదేవీలకు సంబంధించి ఆర్పి రెడ్డి రాణీ బాధ్యత వహిస్తున్నారు. అయితే ఆమె కొన్ని నెలలుగా తన పరిధిలోని గ్రూపు సభ్యుల వద్ద నుంచి రుణాల కోసం పొదుపు డబ్బుల కోసం దరఖాస్తులు చేయించి చాలా రోజులైనప్పటికీ ఎటువంటి డబ్బులు మంజూరు అయినట్లు తెలుపకపోవడంతో గ్రూప్ సభ్యులు ఆమెను నిలదీశారు. దీంతోపాటు ఆమెకు ఇప్పటివరకు చెల్లించిన పొదుపు డబ్బులు డ్వాక్రా డబ్బులు గురించి ఇంతవరకు ఎవరికీ రసీదులు కూడా ఇవ్వకపోవడంతో అనుమానం వచ్చిన సభ్యులు ఆమెను నిలదీయగా ఆమె స్పందించక పోవడంతో సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు మంగళవారం ఉదయం పట్టణానికి వచ్చిన డిఎస్పి ప్రభాకర్కు సంఘాలకు చెందిన మహిళలురాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు 32 లక్షల రూపాయల వరకు ఆమె నిధులు కాజేసినట్లు వారు ఫిర్యాదుల పేర్కొన్నారు. దీనిపై ఆయన స్పందిస్తూ సంఘాల మహిళలకు చెందిన డబ్బులు దుర్వినియోగం చేసిన రెడ్డి రాణి గురించి దర్యాప్తు నిర్వహిస్తామని దీనిపై పుంగునూరు పురపాలక సంఘ అధికారులతో పాటు దర్యాప్తు చేస్తామని బాధితులకు న్యాయం చేస్తామని ప్రకటించారు.

## బాలికను గర్భవతి చేసిన వ్యక్తిపై ఫోక్సో కేసు నమోదు

**చౌడేపల్లి, ఏప్రిల్ 8 ప్రభాతవార్త** పెళ్ళి చేసుకొంటానని మాయమాటలు చెప్పి మైనర్ బాలికను గర్భవతి చేసిన వ్యక్తిపై ఫోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. ఆయన కథనం మేరకు...మండలంలోని ఆమినిగుంట పంచాయతీకి చెందిన ఓ మైనర్ బాలిక(15)ను అదే గ్రామానికి చెందిన నాగేంద్ర ప్రేమించాననీ, పెళ్ళి చేసుకొంటానని నమ్మించి మాయమాటలు చెప్పి 6నెలల గర్భవతిని చేసాడు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతనిపై ఫోక్సో, ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అదే విధంగా న్యాయం చేయమని నాగేంద్ర తల్లిదండులు లక్ష్మన్న, విజయలక్ష్మిలను అడిగితే కులం పేరుతో దూషించి, గ్రామం వదిలి వెళ్ళిపోవాలని బెదిరించిన ఇరువురిపైనా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినుట్లు ఆయన వివరించారు.

## దేవుని ఆశీస్సులతో మార్క్‌శంకర్ త్వరగా కోలుకోవాలి - జనసేన నేతలు ప్రత్యేక పూజలు



**తిరుపతి,ఏప్రిల్ 8ప్రభాతవార్తప్రతినిది:** ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిన్నకుమారుడు మార్క్ శంకర్‌బాబు సింగపూర్‌లో స్కూల్‌లో అగ్నిప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడని, బాలుడు త్వరగా కోలుకోవాలని కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామిని జనసేనపార్టీ తిరుపతి జిల్లా నేతలు వేడుకున్నారు. మంగళవారం సాయంత్రం అలిపిరి పాదాలమండపం వద్ద జనసేననేతలు నియోజకవర్గ నాయకుడు రాజారెడ్డి ఆధ్వర్యంలో కొబ్బరికాయలు కొట్టి మొక్కుకున్నారు. ప్రజలకోసం పరితపించే పవన్‌కల్యాణ్ కుమారుడికి ఇలా జరిగినా ఆయన ముందుగా ప్రజలకిచ్చిన మాటతో కార్యక్రమంలో పాల్గొని అనంతరం సింగపూర్ వెళ్ళడం ఆయన ప్రజలకోసమేనని తెలుస్తుందన్నారు. గోవిందా...శంకర్‌బాబు త్వరగా కోలుకోవాలని పూజలు చేశారు.

## పోలవరం ప్రాజెక్టు అథారిటీ భేటీ.. కీలక అంశాలపై చర్చ..

**విజయవాడ ఏప్రిల్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** పోలవరం ప్రాజెక్టు అథారిటీ ఛైర్మన్ అతుల్ జైన్ ఆధ్వర్యంలో హైదరబాద్‌లో భేటీ అయింది. తెలంగాణ ఈఎన్సీ అనిల్, ఏపీకి చెందిన ఇద్దరు చీఫ్ ఇంజినీర్లు భేటీలో పాల్గొన్నారు. పోలవరం పనుల పురోగతి, అంచనా వ్యయం, నిధులు, ఇతర అంశాలపై వారు చర్చిస్తున్నట్లు సమాచారం. తెలంగాణ ప్రాంతంలో ముంపును గుర్తించే అంశం, పోలవరం బ్యాక్ వాటర్స్ ప్రభావం ఉండే ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలపై ప్రధానంగా చర్చిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ఉన్న అభ్యంతరాలను తెలంగాణ అధికారులు మరోమారు ఈ భేటీలో లేవనెత్తారు. పోలవరం పూర్తి నిల్వ సామర్థ్యం గురించి సమావేశంలో తెలంగాణ అధికారులు ప్రస్తావించారు. కిన్నెరసాని, ముర్రేడువాగు, ఇతర ప్రవాహాల చర్యల గురించి ప్రస్తావించారు. ఖమ్మం పట్టణం, భద్రాచలం పట్టణాలపై పోలవరం బ్యాక్ వాటర్స్ ప్రభావం, రామాలయం వద్ద నీటిమట్టం మణుగూరు భారజాల ప్లాంట్ వద్ద వాటర్ లెవెల్స్ అంశంపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలని రాష్ట్ర అధికారులు మరోసారి అథారిటీని కోరారు. గత ఏడాది వరదల ప్రభావంతో ముంపునకు గురైన నేపథ్యంలో అధ్యయనం సమగ్రంగా జరగాలన్నారు. పోలవరం ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేస్తే ఆ ప్రభావం తెలంగాణపై ఏ మేరకు ఉంటుందనే విషయాలపై స్పష్టత రావాలని అథారిటీని తెలంగాణ అధికారులు కోరారు.

## గంజాయి మాదకద్రవ్యాల కట్టడికి ప్రత్యేకంగా రాష్ట్ర స్థాయి నార్కోటిక్ పోలీస్‌స్టేషన్

**విజయవాడ ఏప్రిల్ 08 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో గంజాయి , మాదకద్రవ్యాల కట్టడి కోసం అమరావతి కేంద్రంగా నార్కోటిక్ పోలీసుస్టేషన్ ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీనికి రాష్ట్రమంతటా పరిధి కల్పించింది. ఈ మేరకు హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్‌ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఎక్కడైనా గంజాయి మాదకద్రవ్యాలు పట్టుబడితే ఆయా ప్రాంతాల్లోని పోలీసుస్టేషన్‌ల్లో కేసులు నమోదు చేస్తున్నారు. ఇకపై అంతర్రాష్ట్ర ముఠాలు, ఇతర వ్యవహారాలకు సంబంధించిన కేసులుంటే నార్కోటిక్ పోలీసుస్టేషన్‌లోనే నమోదు చేసి దర్యాప్తు చేయనున్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా గంజాయి మాదకద్రవ్యాలకు సంబంధించి కేసుల నమోదు, దర్యాప్తు అధికారిన్ని దాఖలు పరిచింది. డీఎస్పీ స్థాయి అధికారి ఈ పోలీసుస్టేషన్‌కు ఎస్‌హెచ్‌వోగా వ్యవహరించనున్నారు. ఈగల్ లో అంతర్భాగంగా ఈ పోలీసుస్టేషన్ పనిచేయనుంది. ఈగల్ విభాగాధిపతి ఆకే రవికృష్ణ నేతృత్వం, పర్యవేక్షణలో ఈ పీఎస్ కార్యకలాపాలు కొనసాగుతాయి.

# వైయస్ జగన్ పర్యటనలో భద్రతా లోపం

### హెలిప్యాడ్‌లోకి దూసుకొచ్చిన అభిమానులు - హెలికాప్టర్ నుంచి దిగేందుకే ఇబ్బంది పడ్డ జగన్ - హెలికాప్టర్ సమస్యతో రోడ్డు మార్గాన తిరుగు ప్రయాణం



మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ ఉన్న హెలికాప్టర్ వద్దకు దూసుకు వచ్చిన అభిమానుల దృశ్యాలు

**అనంతపురం, ఏప్రిల్ 8, (ప్రభాతవార్త బ్యూరో)** ఉమ్మడి అనంతపురం జిల్లా రామగిరి మండలం పాపిరెడ్డి పల్లె లో హత్యకు గురైన వైసీపీ కార్యకర్త లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు మంగళవారం వైసీపీ అధినేత ,మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పర్యటనలో భద్రత లోపం బయటపడింది. ఐదేళ్లపాటు సీఎంగా పని చేసి ఒక పార్టీ అధ్యక్షుడిగా ఉంటూ జెడ్ ప్లస్ కేటగిరి భద్రత ఉన్న జగన్ మోహన్ రెడ్డికి తగిన మొదట కల్పించకుండా పోలీసులు చేతులెత్తేస్తున్నారు అని అభిప్రాయ వ్యక్తమోతోంది.. ఇందుకు రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలం కుంటిమద్ది,పాపిరెడ్డి పల్లి లలో జరిగిన సంఘటనలో అదే కనిపించింది. అత్యంత భద్రత ఉన్న వైయస్ జగన్మోహన్ రెడ్డి హెలికాప్టర్లో రామగిరి మండలం కుంటిమద్ది ప్రాంతానికి వస్తే... అక్కడ జనాన్ని నియంత్రించకుండా పోలీసులు చేతులెత్తేసారు. దీంతో ఒక్కసారిగా వైసిపి కార్యకర్తలు, జనం హెలికాప్టర్ వద్దకు వచ్చారు. ఈ సమయంలో హెలికాప్టర్ నుంచి కుంటి మధ్యలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ లో దిగేందుకే వైయస్ జగన్ ఇబ్బంది పడాల్సి వచ్చింది. వైసీపీ కార్యకర్తలు,అభిమానులు దూసుకు రావడంతో హెలిపాడ్ లో వేచి ఉన్న వైసిపి నాయకులు కూడా తమ నేత వైయస్ జగన్ ను సరిగా కలుసుకోలేకపోయారు.హెలిపాడ్ లో ఒకానొక సమయంలో హెలికాప్టర్ వైపు దూసుకెల్లడంతో హెలికాప్టర్ విండ్ షీల్డ్ దెబ్బతినింది అని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. మరోవైపు అక్కడికి వచ్చిన జనం పై పోలీసులు లాఠీ ఛార్జ్ చేసి ముందుగా చెరగట్టినప్పటికీ వైఎస్ జగన్ అక్కడికి వచ్చే సమయంలో పట్టించుకోలేదని అభిప్రాయం ఉంది. చివరి నిమిషంలో పోలీసులు చేతులు తీయడం వల్ల మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కు భద్రత పరంగా ఇబ్బందులు ఎదురయ్యాయని ఆరోపణలు ఉన్నాయి. ముందే పరిస్థితిని చక్కదిద్దకుండా జగన్ భద్రతకు ప్రమాదం వాటిల్లేలా చేశారని వైసీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. మరోవైపు కుంటిమద్ది నుంచి పాపిరెడ్డిపల్లి వరకు జగన్ ముందుకు వెళ్లడానికి వీలు లేకుండా భారీగా జన సందోహం వచ్చింది. పాపిరెడ్డి పల్లెలో హత్యకు గురైన లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించే సమయంలో పాపిరెడ్డి పల్లెలో జనాన్ని అదుగు చేసే విషయంలో పోలీసులు తగిన చర్యలు తీసుకో లేదని విమర్శలు ఉన్నాయి. వైఎస్ జగన్ జిల్లా పర్యటనలో జనాన్ని కంట్రోల్ చేయడంలో పోలీసులు విఫలమయ్యారన్న.

## ఈతలో బంగారు పతకాల రాణి, వైద్య వృత్తిలో సేవామార్గదర్శిని

### స్విమ్మింగ్‌లో రాణిస్తున్న చెందిన యువవైద్యురాలు సాయి శ్రీ



**విజయవాడ,ఏప్రిల్8,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడకు చెందిన ఓ యువ వైద్యురాలు ఈత పోటీల్లో అదర గొట్టెస్తోంది.బంగారు పతకాలతో సహా పలు క్రెడిట్స్‌ను ఆమె ప్రతిభతో సొంతం చేసుకుంది. విజయవాడకు చెందిన మధుసూధన్‌రావు, ధనలక్ష్మీ దంపతుల ద్వితీయ కుమార్తె సాయి శ్రీ. వృత్తి రీత్యా అల్లూరి జిల్లా పాడేరు మండలం మినుములూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిణిగా పని చేస్తోంది. చిన్నతనం నుంచి తల్లిదండ్రులు క్రీడల వైపు ప్రోత్సహించడంతో బరిలోకి దిగితే పతకం సాధించాల్సిందే అన్నట్లుగా రాటు తేలింది. రాష్ట్ర, జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో 100 పతకాలు సాధిస్తే అందులో 50 స్వర్ణాలే ఉండటం ఆమె క్రెడిట్స్‌ను నిదర్శనం. క్రీడల్లో రాణిస్తూ చదువును ఏ మాత్రం అలసత్వం చేయలేదు. కష్టపడి చదివి ఎంబీబీఎస్ పూర్తి చేసి క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగం సాధించి ఔరా అనిపించింది. అఖిల భారత ఉద్యోగుల క్రీడాపోటీల్లో అద్భుత ప్రతిభను చూపి ఫ్రీ స్టైల్‌ల్లో 50, 100 మీటర్ల విభాగంలో విజయం సాధించడంతో పాటు దిల్లీలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటిందీ యంగ్ డాక్టర్ క్రీడలు, చదువులో రాణించాలంటే శ్రమ, పట్టుదల, కృషి, కార్యచరణ ఉండాలి. ఎవరైనా సరే రెండింట్లో ఒక్కదానిపైనే దృష్టి పెడతారు. ఆ యువతి మాత్రం అటు క్రీడలు, ఇటు చదువులో రాణిస్తూ వందల పతకాలు, అవార్డులు, ప్రశంసా పత్రాలు సొంతం చేసుకుంది. అలాగే గిరిజన ప్రాంతాల్లోని నిరుపేదలకు వైద్య సేవలు అందిస్తూ అందరి మన్ననలను అందుకుంటుంది. బెజవాడకు అంటేనే అదరని,బెదరని యువతీ.యువకుల వేదిక ఆ నగరానికి చెందినచెందిన సాయిశ్రీ. చిన్నతనం నుంచి క్రీడలపై మక్కువతో స్విమ్మింగ్‌లో కఠోర సాధన చేసి రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో 100 పతకాలు, అవార్డులు సాధించింది. అంతేకాదు గిరిజన ప్రాంతాల్లో నిరుపేదలకు నిరంతరం వైద్య సేవలందిస్తూ ఒలింపిక్స్ పోటీలకు సన్నద్ధమవుతోంది.ఆరేళ్ల వయసులో కృష్ణా నదిలో జరిగిన పోటీల్లో ప్రతిభ చూపి అవార్డుతో పాటు ప్రముఖుల నుంచి అభినందనలు అందుకుంది. చిన్నతనం నుంచి ఒకవైపు క్రీడలు, మరోవైపు చదువులో రాణిస్తూనే ఎన్ సీసీ క్యాడెట్‌గా సైతం మంచి గుర్తింపు తెచ్చుకుంది. సీ సర్టిఫికేట్ సాధించి రాష్ట్ర, జాతీయస్థాయిలో జరిగిన ఎన్నో కార్యక్రమాల్లో అద్భుత ప్రదర్శనతో అందరి చేత శభాష్ అనిపించుకుంది. క్రీడలు, చదువును బ్యాలెన్స్ చేసుకుని ముందుకు వెళ్తే కచ్చితంగా విజయం సొంతమవుతుందని చెబుతున్నారు జిల్లా వైద్యాధికారి జమల్ బాషా. స్విమ్మింగ్‌లో రాష్ట్ర, జాతీయస్థాయిలో సాయి శ్రీ పతకాలు సాధించడం పట్ల తోటి వైద్యులు హర్షం వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థి ఆమెను స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. క్రీడలపై ఆసక్తి ఉన్న ఉద్యోగులకు ప్రభుత్వం వెసులుబాటు కల్పిస్తే దేశానికి మంచి పేరుతో పాటు పతకాలు సాధిస్తారు. తనకు ఆర్థికంగా తోడ్పాటునిస్తే ఒలిపింక్స్‌లో స్వర్ణం తీసుకొస్తానని సాయి శ్రీ చెబుతుంది.

## ఆడపిల్లల జోలికి వచ్చారో,ఇక జైలుకే..! మహిళలు, చిన్నారుల భద్రతకు శక్తి బృందాలు

**విజయవాడ ఏప్రిల్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో క్రైమ్ ఎగినెస్ట్ విమెన్ నియంత్రించే దిశలో రాష్ట్ర ప్రభుత్వం శక్తి బృందాలనుఅదుపులోకి తీసుకుని వచ్చింది.జయవాడ విశాఖపట్నం నగర కమిషనరేట్‌ల పరిధిలో నాలుగేసి, ప్రతి జిల్లా కేంద్రంలో రెండేసి ప్రతి పోలీసు సబ్ డివిజన్‌లో ఒక్కోటి చొప్పున మొత్తం 164 శక్తి బృందాల్ని సిద్ధం చేసింది. మహిళలు, చిన్నారుల భద్రతే లక్ష్యంగా డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా వీటిని ఏర్పాటు చేశారు. ఆయా నగర కమిషనరేట్‌ల కమిషనర్ల జిల్లాల ఎస్పీలు, సబ్ డివిజన్‌ల డీఎస్పీల పర్యవేక్షణలో ఇవి పనిచేస్తున్నాయి. ప్రతి శక్తి బృందంలో ఒక ఎస్సై స్థాయి అధికార నేతృత్వంలో ఆరుగురు సిబ్బంది ఉన్నారు. శక్తి బృందాన్ని మహిళలు, అమ్మాయిలు నేరుగా సంప్రదించొచ్చు. శక్తియాప్ ద్వారా కూడా వారిని చేరుకోవొచ్చు. బాధితురాలి వివరాల్ని గోప్యంగా ఉంచి వారు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తారు. ఆత్మరక్షణ విధానాలపై శిక్షణ చట్టపరమైన హక్కులపై చైతన్యం సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండటంపై అవగాహన కల్పిస్తారు. మహిళలు, అమ్మాయిలపై ఏయే ప్రాంతాల్లో ఎక్కువగా వేధింపులు చోటుచేసుకుంటున్నాయో ఆ హాట్‌స్పాట్‌లను గుర్తించి అక్కడ నిరంతరం ఈ బృందాలు గమనిస్తుంటాయి. శక్తి బృందాల్లోని సభ్యులు సివిల్ డ్రెస్‌లో తిరుగుతూ మహిళలపై వేధింపులకు సంభందించి నిఘా పెడతారు.బహిరంగ ప్రదేశాల్లో మహిళల్ని అమ్మాయిల్ని వేధిస్తున్నా., ఈవ్‌టీజింగ్‌కు పాల్పడుతున్నారా, బాలికలు,యువతులను వెంటపడుతూ ఇబ్బంది పెడుతున్నా ఫోన్ మెసేజ్, మెయిల్ సామాజిక మాధ్యమాల వంటి వాటి ద్వారా అభ్యంతకరమైన సందేశాలు పంపిస్తూ వారిని హింసిస్తున్నా ఇక ప్రభుత్వం వదిలిపెట్టదు.అటువంటి వారిపై చర్యలు తీసుకుంటుంది.

## ఆగమోక్తంగా ప్రారంభమైన దుర్గమ్మ చైత్రమాస బ్రహ్మోత్సవాలు

**ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 8, ప్రభాతవార్త** దుర్గమ్మవారి ఆలయంలో ఇంద్రకీలాద్రిపై చైత్రమాస బ్రహ్మోత్సవాలు సోమవారం ఆగమోక్తంగా ప్రారంభమయ్యాయి. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్లకు మంగళస్నానాలు గావించి, నూతన వధూవరులుగా ముస్తాబు చేశారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనము, అంకురార్పణ, అఖండ దీపస్థాపన, కలశారాధన, బలిహరణ, అగ్ని ప్రతిష్టాపన, ధ్వజారోహణం నిర్వహించారు. సాయం సంధ్యాకాలంలో శ్రీ మల్లేశ్వర స్వామివార్ల మండపం నుండి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి అమ్మవార్లను ప్రత్యేక పల్లకీలో వేంచేపు చేసి పల్లకీ సేవలను ప్రారంభించారు. అక్కడినుండి శ్రీ స్వామి అమ్మవార్లు నగర వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శ్రీ స్వామి అమ్మవార్ల పల్లకీ సేవకు ముందుగా పలు రకాల తప్పెట్లు, కోలాటాలు, భజనలు, వివిధ రకాల వేషధారణలు సాగుతుండగా, మంగళవాయిద్యాల నడుమ, వేదమంత్ర ఘోషలతో శ్రీ స్వామి అమ్మవార్ల విహారం కనకదుర్గానగర్, రథం సెంటర్, బ్రాహ్మణవీధి, కొత్తపేట మెయిన్‌బజార్ ప్రాంతాల్లో కొనసాగింది. అనంతరం శ్రీ స్వామి అమ్మవార్లను తిరిగి శ్రీ మల్లేశ్వర మండపానికి తీసుకొచ్చి అక్కడ ప్రత్యేక పూజాదికాలు జరిపారు.

### ఫలక్‌నుమా సూపర్‌ఫాస్ట్ రైలుకు తప్పిన ప్రమాదం

**పలాసమ్రుందస (శ్రీకాకుళం జిల్లా), ఏప్రిల్ 8 ప్రభాతవార్త** శ్రీకాకుళం జిల్లా మందస రైల్వేస్టేషన్‌లో సికింద్రాబాద్-హౌరా ఫలక్‌నుమా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదానికి గురైంది. సికింద్రాబాద్ నుంచి హౌరా వెళ్తున్న ఫలక్‌నుమా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు మందస రైల్వేస్టేషన్ దగ్గర ఏ1 భోగికు ఉన్న లింకు తెగిపోవడంతో ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ట్రైను రెండు భాగాలుగా విడిపోయింది. మందస రైల్వేస్టేషన్‌లో ఇంజన్‌తో సహా 15 బోగీలు నిలిచిపోగా కొర్రాయి గేటు-మకరజోల స్టేషన్ మధ్య 8 బోగీలతో వెనక్కి వెళ్లి ఆగింది. ఈ హఠాత్పరిణామానికి భయపడిన ప్రయాణీకులు ఆందోళనకు గురయ్యారు. ప్రయాణీకులకు ఎటువంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న రైల్వే ఇంజనీరింగ్ అధికారులు రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తెగిన బోగికి మరమ్మతులు చేసి వేరొక ఇంజన్‌తో సంటింగ్ చేసి మందస రైల్వేస్టేషన్‌కు తీసుకు వచ్చారు. సుమారు రెండున్నర గంటల పాటు మందస రైల్వేస్టేషన్ దగ్గర రైలు నిలిచిపోవడంతో ప్రయాణీకులు అవస్థలు పడ్డారు. రైల్వే ఇంజనీరింగ్ అధికారులు పునరుద్దరణ చర్యలు చేపట్టి తెగిపోయిన ఏ1 బోగీని మందసలో విడిచిపెట్టిన అధికారులు మిగతా బోగీలకు సంటింగ్ చేసి రైలును హౌరా వైపు తరలించారు.

## పవన్‌కు ప్రధాని మోదీ ఫోన్... కుమారుడి ఆరోగ్యంపై ఆరా...

**విజయవాడ ఏప్రిల్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాన్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ ఆరోగ్యంపై ప్రధాని నరేంద్ర మోదీ ఆరా తీశారు. పవన్‌కు ఫోన్ చేసి అతడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సింగపూర్‌లోని ఓ స్కూల్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో మార్క్ శంకర్ గాయపడిన విషయం తెలిసిందే. కాళ్లు, చేతులకు కాలిన గాయాలు కావడంతో ఆస్పత్రిల్లో చికిత్స పొందుతున్నారు. అయితే విశాఖ పర్యటనలో ఉన్న పవన్‌కు ప్రధాని మోదీ ఫోన్ చేసి అతడి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసినట్లు సమాచారం. మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన ప్రధాని పవన్‌కు ధైర్యం చెప్పినట్లు తెలిసింది. మరోవైపు విశాఖ పర్యటన ముగించుకున్న పవన్ కల్యాణ్ సింగపూర్ బయల్దేరి వెళ్ళారు.. చిరంజీవి దంపతులు సైతం సింగపూర్ బయల్దేరి వెళ్ళారు.. మార్క్ శంకర్‌కు గాయాలైన విషయం తెలియడంతో తెలుగు రాష్ట్రాల సీఎం చంద్రబాబు, రేవంత్ రెడ్డి సహా పలువురు ప్రముఖులు స్పందించారు. పవన్ కుమారుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు.

### అత్యధిక సభ్యత్వాలు చేయించిన తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు హసీం బేగ్‌కు సన్మానం

**విజయవాడ,ఏప్రిల్ 8,ప్రభాతవార్త** నియోజక వర్గంలో అత్యధికంగా 3400 సభ్యత్వాలు చేయించిన రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు డాక్టర్ హసీం బేగ్‌ని కృష్ణాజిల్లా ఇంఛార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్,మంత్రి కొల్లు రవీంద్ర,ఆర్టీసి చైర్మన్ కొనకళ్ళ నారాయణరావులు దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ హసీం బేగ్ పార్టీ కేటాయించిన ప్రతి కార్యక్రమాన్ని డోర్ టు డోర్ సర్వే,ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి,బాబు షూరిటీ భవిష్యత్ గ్యారంటీ,ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలతో పాటు తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలు క్రమశిక్షణతో నూటికి నూరు శాతం చేశారని ప్రశంసించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజ్యాంగ రక్షణ ప్రాధాన్యత అంశంగా సిడబ్ల్యుసి




### తెలంగాణ కుల గణన, బిసి 42 రిజర్వేషన్‌పైనా చర్చ

### పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** రాజ్యాంగ పరిరక్షణ ప్రాధాన్యత అంశం అహ్మదాబాద్‌లో సిడబ్ల్యుసి సమావేశాలు నిర్వహిస్తున్నామని ఇది దేశంలోని పౌర హక్కులు, లౌకికత్వం సమాఖ్య స్ఫూర్తి భంగం కలుగకుండా అనుసరించాల్సిన రాజకీయ విధానం నిర్ణయిస్తుందని టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో సమావేశానికి వెళ్లే ముందు విలేఖరులతో మాట్లాడుతూ తెలంగాణలో జరిగిన కులగణన, శాసనసభలో బిసిలకు 42శాతం రిజర్వేషన్ కోసం తీర్మానం చేయడం వంటి అంశాలను మిగతా రాష్ట్రాల్లో అధికారం వచ్చిన వెంటనే చేసేందుకు అనుగుణంగా ఒక రాజకీయ విధానం తీసుకొనేందుకు వీలుగా చర్చ జరిపేందుకు ఎఐసిసి సమయం కూడా కేటాయించిందని తెలిపారు. సామాజిక న్యాయం, దేశంలో ప్రజల మధ్య ఐక్యత పునాదిగా అభివృద్ధి దిశగా నడవడానికి అనుసరించే కార్యచరణ రూపొందిస్తామని తెలిపారు. దేశ రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై కూడా చర్చలు జరుగుతాయని వివరించారు. ఎఐసిసి మీటింగ్‌లో దేశంలోని పార్టీ పెద్దలు పార్టీ అను సరించాల్సిన మారుతున్న దేశ, ప్రపంచ రాజకీయాలకు అనుగుణంగా విధివిధానాలు సందేశం రూపంలో ఇవ్వనుందని ఇది ఒక విధంగా ప్రజలకు ఇచ్చే సందేశమేనని ఆయన అన్నారు. మతోన్మాదులు దేశ విచ్ఛిన్నం కోసం చూస్తున్న తరుణంలో జరుగుతున్న ఈ సమావేశం ఒక ముఖ్య మైన భరోసా దేశంలోని బలహీనవర్గాలకు అందిస్తుందని అన్నారు. అహ్మదాబాద్‌లో పరిస్థితులు మారాయి ఇప్పుడు కాంగ్రెస్ గాలి వీస్తున్నదని మహేష్ ఆశాభావం వ్యక్తంచేశారు. 11ఏళ్లపాటు ప్రధానమంత్రిగా ఉండి అట్టడుగు వర్గాలకు ఏమీచేయలేదని అందరికి సమాన అవకాశాలు కల్పించే పార్టీ అని ఆయన తెలిపారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా అహ్మదాబాద్‌లో మంగళ,బుధవారం సమావేశాలకు ఏఐసిసి చీఫ్ మల్లికార్జున ఖర్గే అధ్యక్షత వహిస్తారని సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంక కాంగ్రెస్ ముఖ్య మంత్రులు, మంత్రి మండలి సభ్యులు ఇతర ప్రముఖులు ఎంపిలు, పిసిసి అధ్యక్షులు హాజరవుతారని ఆయన చెప్పారు. 64 ఏళ్ళ సుదీర్ఘ విరామం తరువాత మోదీ సొంతగడ్డపై కీలక సమావేశం నిర్వహిస్తున్నామని తెలంగాణ నుంచి 40 మందినేతలు పాల్గొంటున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, తెలంగాణ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ వంశీచంద్‌రెడ్డి ఎపి చీఫ్ షర్మిల పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. ఈ యేడాది చివరలో జరగబోయే బీహార్, 2026లో జరగబోయే తమిళనాడు, పశ్చిమబెంగాల్ అస్సాం, కేరళ అసెంబ్లీ ఎన్నికలలో అనుసరించే వ్యూహాలు చర్చిస్తారు. లోక్‌సభ ఎన్నికలలో ఇండియాకూటమి అనుసరించిన విధానాలు ఛత్తీస్‌గఢ్, హర్యానా, మహారాష్ట్ర, ఢిల్లీ రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై సమీక్షలు ఉంటాయని అన్నారు.



దీక్షనుద్దేశించి ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ కవిత

## అసెంబ్లీలో పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి: ఎమ్మెల్సీ కవిత

### తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ధర్నాచౌక్‌లో విగ్రహ సాధన దీక్ష

**హైదరాబాద్ (ధర్నాచౌక్), ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** అసెంబ్లీలో మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన పూలే విగ్రహసాధన దీక్షకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దీక్షనుద్దేశించి కవిత మాట్లాడుతూ ఈ నెల 11న జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా ఆరోజు పూలే విగ్రహం అసెంబ్లీలో ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వం ప్రకటన ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ వంటి మహనీయులు సైతం గురువుగా చెప్పుకునే జ్యోతిబాపూలే విగ్రహం అసెంబ్లీలో ఏర్పాటుచేస్తే ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుందని అన్నారు. 1848లోనే మహిళల కోసం పాఠశాల ఏర్పాటుచేసిన గొప్పవ్యక్తి మహాత్మా జ్యోతిబాపూలే అని, ఆయన కృషితోనే నేడు అనేక మంది మహిళలు ఉన్నతవిద్యను అభ్యసించి, అనేక రంగాలలో రాణిస్తున్నారని గుర్తు చేశారు. కుల వివక్ష కోసం పోరాడి, బడుగుబలహీన వర్గాలను జాగృతంచేసి, వారి అభ్యున్నతి కోసం పాటుపడిన మహనీయుని విగ్రహం చూస్తేనే మనకు ఒక ధైర్యం ఉన్నట్టుంది అన్నారు. అసెంబ్లీలో అంబేద్కర్ విగ్రహం ఎలా ఉందో అదేవిధంగా అంబేద్కర్ విగ్రహం పక్కన జ్యోతిబా పూలే విగ్రహం కూడా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 11న పూలే జన్మదినం రోజు విగ్రహంపై ప్రకటన ఇచ్చి, బీసీలకు స్ఫూర్తినివ్వాలని డిమాండ్ చేశారు. బిల్లు పాస్ కాగానే అఖిల పక్షాన్ని తీసుకుని ఢిల్లీకి పోతామన్న కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు బీజేపీతో ఎటువంటి లాలూచీ లేకపోతే బీసీ బిల్లుపై కేంద్రంపై వత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

## భూభారతి చట్టం.. రెవెన్యూకు కొత్త ఊపిరి

### రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళన సభలో ఉద్యోగ జెఎసి ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** రాష్ట్రంలో నూతనంగా అమలులోకి వస్తున్న భూ భారతి చట్టం రెవెన్యూ వ్యవస్థకు కొత్త ఊపిరి పోసిందని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి అన్నారు. భూ భారతి చట్టంతో రైతులకు మేలు జరగడంతో పాటు రెవెన్యూ సేవలు, పౌర సేవలు చేరువ అవుతాయన్నారు.గ్రామీణ గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు రెవెన్యూ వ్యవస్థ బలోపేతం కావడం వలన రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని దీమా వ్యక్తం చేశారు. మంగళవారం రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళన సభ డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ జనరల్ సెక్రటరీ, హైదరాబాద్ రెవెన్యూ డివిజన్ ఆర్డీవో కె.రామకృష్ణ అధ్యక్షతన హైదరాబాద్ లోని ఐఎఎస్ ఆఫీసర్స్ అసొసియేషన్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆప్షన్ల ద్వారా రెవెన్యూ శాఖలోకి జీపీవో (గ్రామ పరిపాలన అధికారి)లుగా వస్తున్న పూర్వపు వీఆర్వోలు, వీఆర్ఏలు సర్వీసుపరమైన అభద్రతకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం జీపీవో పోస్ట్ కొత్తగా క్రియేట్ చెసిందని, అన్ని ప్రభుత్వ ఉద్యోగులకు వచ్చినట్లుగానే జీపీవోలకు కూడా పదోన్నతులు వస్తాయన్నారు. ఆప్షన్ల ద్వారా నియామకం అవుతున్న జీపీవోలందరికీ కూడా ఇతర ప్రభుత్వ ఉద్యుగులందరికీ వచ్చిట్లుగానే కామన్ సర్వీస్ తో పాటు పదోన్నతులు వస్తాయన్నారు. గ్రామ స్థాయిలోనే రెవెన్యూ సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం 10,954 మంది గ్రామ పాలన అధికారులను వ్యక్తిగత ఆప్షన్ల ద్వారా రెవెన్యూ శాఖలో నియామకం చేస్తుందన్నారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఉద్యోగ భద్రతకు సమీప భవిష్యత్తులో భరోస లభిస్తుందన్నారు.

ప్రభుత్వ సహకారంతో దేశ చరిత్రలోనే తొలిసారిగా 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టులను సాదించామని, అలాగే గతంలో ధరణిలో తహశీల్దార్లకు, ఆర్డీఓలకు, అడిషనల్ కలెక్టర్లకు అధికారాలు లేని కారణంగా రైతుల సమస్యలు సత్వరం పరిష్కరించే పరిస్థితి లేదన్నారు.భూ భారతి చట్టం ద్వారా రాష్ట్ర రాజధానిలోని సీసీఎల్ఏ నుండి గ్రామ పరిపాలన అధికారి వరకు అధికారాల వికేంద్రీకరణ జరగడంతో భూ సమస్యలు సత్వరం పరిష్కారం అవుతాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్లులకు త్వరలోనే మోక్షం లభిస్తుందని ఛైర్మన్ వి. లచ్చిరెడ్డి అన్నారు.ఉద్యోగుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఇటీవల జేఏసీ ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసినట్లు చెప్పారు. 61 సంవత్సరాలు పైబడిన వీఆర్ఏలను సర్దుబాటు చేసి ఆ కుటుంబాలకు న్యాయం చేసేలా, కారుణ్య నియామకాలను చేపట్టేలా ప్రభుత్వంపై వత్తిడి తీసుకువచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు.

## సార్వత్రిక సమ్మెకు సమాయత్తం

### అన్ని ట్రేడ్ యూనియన్లతో రాష్ట్ర సదస్సు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** కేంద్రంలో బిజెపి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా 29 చట్టాలను రద్దుచేసి 4 లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మికుల హక్కులను, ప్రాథమిక హక్కులను లేకుండా చేస్తున్నందుకు దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కేంద్ర కార్మిక, రాష్ట్ర కార్మిక సంఘాల, స్వతంత్ర ఫెడరేషన్ల, అసోసియేషన్ల సదస్సు కార్మికవర్గానికి విజ్ఞప్తి చేసింది. మంగళవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఆల్‌ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా రాష్ట్ర సదస్సుకు ఐఎన్‌టియుసి వర్కింగ్ ప్రెసి డెంట్ విజయ్‌కుమార్ యాదవ్, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి. యూసుఫ్ తదితర నాయకులు అధ్యక్షత వహించగా సదస్సులో ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ రాష్ట్ర సదస్సు ముసాయిదా తీర్మానాన్ని ప్రవేశపెడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను, కార్పొరేట్ అనుకూల మతోన్మాద చర్యలను పెంచి పోషిస్తుందని ఆయన విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్లు వచ్చే నెల 20న సార్వత్రిక సమ్మె చేయాలని నిర్ణయించాయని ఆయన తెలిపారు. ఈ సమ్మెకు సంయుక్త కిసాన్‌మోర్చా సంపూర్ణ మద్దతు ప్రకటించిందని తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ కార్మికవర్గం మే 20న జరిగే సమ్మెకు సమాయత్తం కావాలని ఆయన కోరారు.

ఈ తీర్మానంపై కేంద్ర కార్మిక సంఘాల నాయకులు ఐఎన్‌టియుసి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు యం.డి.యూసుఫ్, హెచ్ఎంఎస్ నాయకులు అంజద్, సిఐటియు నాయకులు సాయిబాబ, టియుసిఐ నాయకులు కె.సూర్యం, టిఎన్‌టియుసి నాయకులు ఎం.కె.బోస్, బిఆర్‌టియు నాయకులు జి.రాంబాబు యాదవ్, ఎఐయుటియుసి నాయకులు కృష్ణ, తదితరులు మాట్లాడారు. మే 20న దేశవ్యాపిత సమ్మెలో రాష్ట్రంలోని అన్ని రంగాల సంఘటిత, అసంఘటిత కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

## లిక్కర్ మరకల చెరిపివేతకు ఎమ్మెల్సీ కవిత పాట్లు

### అధికారం పోగానే ధర్నాలు

### విప్ ఆది శ్రీనివాస్

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** లిక్కర్ మరకలను తుడిచి వేసుకోవడానికి కల్వకుంట్ల కవిత నానా పాట్లు పడుతున్నారని విప్ ఆది శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ జైలు నుంచి బయటకు వచ్చాక బిఆర్ఎస్‌లో తన స్థానం కోసం కల్వకుంట్ల కవిత అనేక విన్యాసాలు చేస్తున్నారని అన్నారు.రిజర్వేషన్లు, జ్యోతిరావుఫూలే విగ్రహం పేరిట కవిత డ్రామా చేస్తోందని విమర్శించారు. జ్యోతిరావు ఫూలే పేరు ఎత్తే అర్హత అసలు కవితకు ఉందా?! అని నిలదీశారు. బాలికల కోసం దేశంలో మొదటి పాఠశాల ఏర్పాటు చేసిన మహనీయుడు ఫూలే అని కొనియాడారు. మహిళా విద్యకు మార్గదర్శకుడు స్వయంగా తన భార్య సావిత్రి బాయి కి రాయడం, చదవడం నేర్పి మార్గదర్శిగా నిలిచారని అన్నారు. జ్యోతిరావు ఫూలే సావిత్రి బాయి దంపతులు ఆదర్శప్రాయులు ఇలాంటి వారి గురించి కవిత మాట్లాడటం అంటే అంతకు మించిన దౌర్భాగ్యం ఇంకోటి లేదు. కేసీఆర్ ఆయన బిడ్డ కవితకు ఏం నేర్పాడో అందరికీ తెలుసు దేశంలో లిక్కర్ స్కాం అరెస్ట్ అయిన మొదటి మహిళా నాయకురాలు కవిత అని విమర్శించారు. దాదాపు ఆరు నెలలు లిక్కర్ కేసులో తీహార్ జైలు ఉండి వచ్చిన నాయకురాలు సావిత్రి బాయి పులే గురించి మాట్లాడితే తెలంగాణ ప్రజలు వినాలా అని ఆయన ప్రశ్నించారు. పులే విగ్రహం పెట్టాలని కవిత చెపితే ప్రభుత్వం, అసెంబ్లీ స్పీకర్ తెలుసు కోవాలా పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు జ్యోతి రావు ఫూలే ఎందుకు కవితకు గుర్తుకు రాలేదు పులే విగ్రహం పెట్టాలని ఆయన వాళ్లకు అయ్యాకు ఎందుకు చెప్పలేదు అని ఆయన కవితను ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన రెండు గంటల్లోనే ప్రగతి భవన్ కంచెలను బద్దలు కొట్టించారు ప్రగతి భవన్ కు మహాత్మ జ్యోతిరావు పులే పేరు పెట్టింది మా రేవంత్ రెడ్డి నాయకత్వంలోని మా ప్రజా ప్రభుత్వం అని అన్నారు. నీకు బిసిల పైన అంత ప్రేమ ఉంటే తెలంగాణ జాగృతి అధ్యక్ష పదవి నుంచి తప్పుకుని బిసి నేతకు ఇవ్వు అని సూచించారు. బిసి లకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం కోసం కులగణన చేసిన ప్రభుత్వం మాది అని ఆయన తెలిపారు. అసెం బ్లీలో బిల్లు పెట్టి ఆమోదించిన చరిత్ర మాది.కేంద్రం ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా బిసి లకు రాజకీయం గా 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వబోతున్నామని ప్రకటించారు.




## ఎస్ఎస్‌సి మూల్యాంకన కేంద్రం ఆకస్మిక తనిఖీ

### వసతులను పరిశీలించిన పాఠశాల విద్య డైరెక్టర్

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 10వ తరగతి వార్షిక పరీక్షలు మార్చి 21 నుంచి ఈ నెల 4 వరకు జరిగిన విషయం తెలిసిందే. పరీక్షల అనంతరం నిర్వహించే జవాబుపత్రాల మూల్యాంకనం రాష్ట్రంలో 19 కేంద్రాల్లో కొనసాగిస్తున్నారు. అందులో భాగంగా సంగా రెడ్డిలో కొనసాగుతున్న మూల్యాంకన కేంద్రాన్ని పాఠశాల విద్య డైరక్టర్ ఈవి నరసింహారెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 10వ తరగతి పరీక్షలకి సంబంధించిన జవాబు పత్రాల మూల్యాంకనం ఈ నెల 7 నుంచి 15 వరకు 19 కేంద్రాల్లో నిర్వహించబడుతోంది. మంగళవారం ఉదయం పాఠశాల విద్యా సంచాలకులు ఇవి నరసింహ రెడ్డి సంగారెడ్డి జిల్లా నందలి 10వ తరగతి పరీక్షల మూల్యాంకన కేంద్రాన్ని పరిశీలించారు. మూల్యాంకన కేంద్రంనందు ఉపాధ్యాయుల హాజరుతోపాటు వసతుల ఏర్పాట్లు పరిశీలించారని ప్రభుత్వ పరీక్షల డైరక్టర్ ఏ కృష్ణారావు తెలిపారు. మూల్యాంకన కేంద్రంలోని వసతులపట్ల పాఠశాల విద్య డైరక్టర్ సంతృప్తి వ్యక్త పరచినట్టు తెలిపారు. ఉపాధ్యాయులు మూల్యాంకనము చేయు విధానమును పరిశీలించి జిల్లా విద్యాశాఖాధికారి(డిఈవో) వెంకటేశ్వర్లుతోపాటు అధికారులతో క్యాంపు నిర్వహణను సమీక్షించారు.

## చిత్తశుద్ధితో బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కృషి చేయాలి

### ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను పకడ్బందీగా నమోదు చేయాలి

### అధికారులతో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్




సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్

**గోదావరిఖని, ప్రభాతవార్త:** అధికారులు చిత్తశుద్ధితో బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కృషి చేయాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ మంగళవారం అన్నారు. ఎన్టీపీసీ మిలినీయం హాల్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమాం దీపక్, పెద్దపల్లి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ, తదితరులతో కలిసి జిల్లా అధికారులతో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్ సమీక్షి ంచారు. గతంలో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు నిర్వహించిన సమావేశంలో జారీ చేసిన సూచనలు, పనుల పురోగతి వివరాలను, తమ శాఖ ద్వారా చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల వివరాలను ముఖ్య ప్రణాళిక అధికారి, జిల్లా సంక్షేమ అధికారి, ఈడి ఎస్సీ కార్పొరేషన్, ఎస్సీ సంక్షేమ శాఖ, విద్యా శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్, పరిశ్రమల శాఖ, లీడ్ బ్యాంకు మేనేజర్ వివరించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాంచందర్ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను పకడ్బందీగా నమోదు చేయాలని, నిందితులకు చట్టం ప్రకారం శిక్ష పడేందుకు వీలుగా అవసరమైన సాక్ష్యాలను పక్కాగా నమోదు చేయాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సకాలంలో పరిష్కరించాలని, అందించిన ఫిర్యాదులకు వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి సంబంధిత నేరస్తులను అరెస్టు చేయాల్సి ఉంటుందని అన్నారు. నిమ్న వర్గాల యువత పరిశ్రమల స్థాపించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ పథకాలు సబ్సిడీపై విస్తృతంగా ప్రచారం కల్పించాలని అన్నారు. రామగుండం, బెల్లంపల్లిలో ఉన్న ఇండస్ట్రియల్ పార్క్‌లో ఎస్సి ఔత్సాహిక వేత్తలకు భూ కేటాయింపులో ప్రాధాన్యత కల్పించాలని అన్నారు. ఔత్సాహికవేత్తలకు గ్యారెంటీ లేకుండా రుణాలు అందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను బ్యాంకులు తూచా తప్పకుండా పాటించేలా చూడాలని అన్నారు. అంబేద్కర్ విదేశీ విద్యా పథకం, కులాంతర వివాహాల సబ్సిడీ సకాలంలో అందేవిధంగా చూడాలని అన్నారు. బ్యాంకుల ద్వారా ఎస్సి లబ్దిదారులకు విద్యా రుణాల మంజూరు ఎలా జరుగుతుందో వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యా రుణాల పంపిణీపై విస్తృతంగా ప్రచారం కల్పించాలని అన్నారు. భూ వివాదాల సమయంలో సర్వే నిర్వహించాలని అన్నారు. దళితుల భూమిని ఆక్రమించాలని చూసే వారిపై చట్ట ప్రకారం కేసుల నమోదు చేయాలని పోలీసులకు సూచించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులలో పోలీసులు అరెస్ట్ చేయడం లేదనే మాట బయట బలంగా వినపడుతుందని, తప్పుడు కేసు కాని పక్షంలో తప్పనిసరిగా విచారించి నిందితులను అరెస్టు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలోని శాఖల వారిగా బ్యాక్ లాగ్ పోస్టులు, కారుణ్య నియామకాలు, పదోన్నతుల పెండిరగ్ వివరాలను అందించాలని అన్నారు. ప్రైవేట్ రంగంలో కూడా యువతకు ఉపాధి లభించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో ఎన్టీపీసీ, సింగరేణి, వివిధ ప్రభుత్వ ప్రాజెక్టుల కింద జరిగే భూసేకరణలో దళితులకు కూడా న్యాయమైన పరిహారం తప్పనిసరిగా అందజేయాలని, పరిహారం అందించిన తర్వాత మాత్రమే భూ బదలాయింపులు జరగాలని అన్నారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ క్రింద నమోదైన కేసుల్లో బాధితులకు చట్ట ప్రకారం పరిహారం అందించామని అన్నారు. జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులను జిల్లా అధికారులు, ఉద్యోగులు, వివిధ వర్గాల ప్రజలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారులు బి.గంగయ్య, సురేష్, పెద్దపల్లి, గోదావరిఖని ఎసిపిలు, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పెంచిన వంట గ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలి

### మండిపడుతున్న సిపిఎం, సిపిఐ

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పెంచిన సిలిండర్ ధరలను ఉపసంహరించుకోవాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. ధరల పెంపును తగ్గించడం కోసం కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. పేద, మధ్యతరగతి ప్రజలపై భారం వేసే వంటగ్యాస్ ధరల పెంపుపై రాష్ట్రవ్యాపిత నిరసనలకు చేపట్టనున్నట్టు తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు తగ్గినందున వినియోగదారులకు గ్యాస్ సిలెండర్ ధరలకు తగ్గింపు ఆ ఫలితాలు అందించాల్సిందిపోయి... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వంటగ్యాస్ సిలెండర్‌పై రు.50లు పెంచడం దారుణమన్నారు. నిత్యావసర సరుకుల ధరలపై నియంత్రణ తెస్తామని చెప్పిన కేంద్ర బీజేపీ ప్రభుత్వం, అన్నిరకాల సరుకులు, వస్తువుల ధరలను విపరీతంగా పెంచిందని జాన్‌వెస్లీ మండిపడ్డారు. పెంచిన వంటగ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ, నేడు, రేపు(ఏప్రిల్ 9, 10 తేదీల్లో) రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టా లని నిర్ణయించినట్టు జాన్‌వెస్లీ తెలిపారు.

**పెంచిన గ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలి: కూనంనేని**

కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్లపై రూ. 50 అదనంగా పెంచడం వలన మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్లు ఉన్నదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కేంద్రాలలో ఖాళీ సిలిండర్లతో నేడు(బుధవారం) నిరసన ధర్నాలు చేపట్టాలని సిపిఐ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చినట్టు తెలిపారు.

## ఆదిలాబాద్ జిల్లాలో ఘోరం..

### బాలికపై ఇద్దరు యువకుల అత్యాచారం

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** ఆదిలాబాద్ జిల్లాలో 12 ఏళ్ల బాలికపై ఇద్దరు యువకులు అత్యాచారం జరిపిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనలో ఓ మహిళతో పాటు ఆమె బంధువు ఒకరి పాత్ర కూడా వుండడం పోలీసులను షాక్‌కు గురిచేసింది. ఆదిలాబాద్ పట్టణంలోని మావల పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ కాల నీకి చెందిన 12 ఏళ్ల బాలికను 35 ఏళ్ల మహిళ పథకం ప్రకారం ఆదివారం మధ్యాహ్నం సమీపంలోని అటవీ ప్రాంతానికి తీసుకు వెళ్లింది. ఆమె వెంట మరో వ్యక్తి కూడా వున్నారు. మహిళకు బంధువులైన ఇద్దరు యువకులు అంతకు ముందే అక్కడ వుండగా వారిద్దరు ఆ బాలికపై అత్యాచారం చేశారు. దీనిని బాలిక పతిఘటించగా సదరు అత్యాచారానికి పాల్పడ్డ యువకుల బంధువైన మహిళతో పాటు మరో వ్యక్తి బాలికను చంపుతానని భయ పెట్టారు. కాగా రాత్రి వేళ ఆ బాలికను సదరు మహిళ ఇంటి వద్ద దించి ఇంట్లో వారికి ఏమీ చెప్పవద్దని హెచ్చరించింది. అయితే ఆలస్యంగా ఇంటికి వచ్చిన బాలికను తల్లి, ఇతర కుటుంబ సభ్యులు నిలదీయడంతో జరిగిన విషయం చెప్పింది. దీంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే రంగంలో దిగిన పోలీసులు బాలికను రిమ్స్‌లో వైద్య పరీక్షలు చేయించా అత్యాచారం జరిగినట్లు నిర్ధారణ అయ్యింది. అనంతరం బాలికపై అత్యాచారం చేసిన ఇద్దరు యువకులతోపాటు వారికి సహకరించిన మహిళపైనా, ఆమె బంధువుపై నా ఇమ్మొరబుల్ ట్రాఫిక్ యాక్ట్, అత్యాచారం, పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేశారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## బార్ అండ్ రెస్టారెంట్లకు కూడా టెండర్లు పిలవాలి

### వాళ్లకూ రెండేళ్లకోసారి లైసెన్స్‌లు ఇవ్వాలి

### తెలంగాణ వైన్ డీలర్స్ అసోసియేషన్

**హైదరాబాద్, ఏప్రిల్ 8,ప్రభాతవార్త:** తెలంగాణలోని బార్ అండ్ రెస్టారెంట్స్‌కు కూడా ప్రతి రెండేండ్లకు ఒకసారి టెండర్ పద్ధతిలోనే లైసెన్స్ ఇవ్వాలని అప్పుడే రాష్ట్ర ప్రభుత్వానికి మరింత ఆదాయం వస్తుందని తెలంగాణ వైన్ డీలర్స్ అసోసియేషన్ అభిప్రాయపడింది. తాము రెండేండ్లకు ఒకసారి టెండర్ పద్ధతిలో లైసెన్స్ తీసుకోవడం వల్ల ప్రభుత్వానికి 87 శాతం ఆదాయం వస్తుంటే...బార్ అండ్ రెస్టారెంట్ల ద్వారా కేవలం 13 నుంచి 15 శాతం ఆదాయం మాత్రమే వస్తుందని తెలిపారు. ఈ మేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో తెలంగాణ వైన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మద్యం షాపుల యజమానులపై, పర్మిట్ రూం, సమయం కుదింపుపై బార్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. జిల్లాల్లో 10 గంటలకు మద్యం షాపులు మూసివేసినట్లే.. నగరాల్లో కూడా 10గంటలకే మద్యం దుకాణాలను మూసివేయాలనడం అవివేకమన్నారు. రాష్ట్రంలో బార్లు అర్ధరాత్రి 12 గంటల వరకు నడుస్తున్నా తామేమి అభ్యంతరం చెప్పడం లేదని ఎందుకు తమ దుకాణాల సమయాన్ని తగ్గించాలని రోడ్డెక్కుతున్నారో అర్థం కావడం లేదన్నారు. బార్ అండ్ రెస్టారెంట్ల సమయాన్ని 11 గంటలకు పైగా పెంచడం వల్ల ఆ ప్రభావం తమపై పడుతుందని, దాని వల్ల 20శాతం నష్టాలు చవిచూస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ వైన్ డీలర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రామచంద్రారెడ్డి, ట్రెజరర్ సుభాశ్, వైస్ ప్రెసిడెంట్ ప్రభు, ఇతర కార్యవర్గం పాల్గొన్నారు.

## వచ్చే యేడాది నుంచి ఎస్సీ గురుకులాల్లోనకోడింగ్ కోర్సులు

### ఆర్‌పిఎఫ్-యుకె ఫౌండేషన్‌తో ఎంఒయు

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎస్సీ గురుకులాల్లో 2025-26 విద్యా సంవత్సరం నుంచి పూర్తి స్థాయిలో కోడింగ్ కోర్సులను ప్రారంభించ నున్నారు. ఇందుకు సంబంధించి ఆర్‌పిఎఫ్-యుకె ఫౌండేషన్‌తో అవగాహన ఒప్పందం(ఎంవోయూ) చేసుకున్నట్లు ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి డాక్టర్ అలగు వర్షిణి తెలిపారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయడానికి ఐదేళ్లపాటు ఎంవోయూ చేసుకొని.. 6వ తరగతి నుండి ఇంటర్ వరకు కోడింగ్‌పై శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదువుతో పాటు నైపుణ్యం అనేది కీలకంగా మారింది. విద్యార్థులు నాణ్యమైన విద్యతో పాటు, వీలైనంత త్వరగా జీవితంలో ఒక మంచి హోదా, ఉజ్వల భవిష్యత్తుతో పాటు మంచి వేతనం వున్న ఉద్యోగాలవైపు దృష్టి సారిస్తోంది. విద్యార్థుల అభిరుచులు, వారి ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా ఎస్సీ గురుకుల విద్యాసంస్థలో విద్యార్థులకు కోడింగ్‌పై శిక్షణ ఇవ్వాలని సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నట్టు సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరం నుంచి 238 గురుకుల పాఠశాలల్లో ఈ కోడింగ్ కోర్సుకి శిక్షణ ఇవ్వనున్నట్టు కార్యదర్శి వెల్లడించారు. గత ఏడాది కేవలం ఒక్క మొయినాబాద్ పాఠశాలలో మాత్రమే ఈ కోడింగ్ శిక్షణ ఉండేదని.. దానిని ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా వున్నా అన్ని పాఠశాలలో విస్తరింపజేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. శిక్షణకు లండన్‌కు చెందిన ఆర్‌పిఎఫ్‌తో ఐదేళ్లకు గాను గురుకుల సంస్థతో ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకున్నట్టు చెప్పారు. అందులో భాగంగా ఫౌండేషన్ వారు విద్యార్థులకు కావాల్సిన నైపుణ్య శిక్షణ, కరిక్యులమ్(పాఠ్య ప్రణాళిక), అక్షన్ ప్లాన్(కార్యాచరణ ప్రణాళిక), మోనిటరింగ్ (పర్యవేక్షణ), పెడగోజి(బోధన) వంటి అంశాలలో ఫౌండేషన్ వారి సారథ్యంలో ఈ పర్యవేక్షణ కొనసాగనుంది. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థలో విద్యనభ్యసిస్తున్న 6 నుంచి 9వ తరగతి విద్యార్థులతో పాటు ఇంటర్ వరకు చదివే విద్యార్థులందరికీ సాంకేతికత అంశాల్లో రాటుదేలేలా ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని తెలిపారు.

కృత్రిమ మేధ(ఏఐ), కోడింగ్, మెషీన్ లెర్నింగ్(ఎంఎల్), రోబోటిక్స్, ఆన్‌లైన్ టూల్స్‌కు సంబంధించిన పాఠ్యాంశాల్ని వారికి బోధించేందుకు రంగం సిద్ధం చేసినట్టు అలగు వర్షిణి తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రతి పాఠశాలలో ఐదుమంది విద్యార్థులను ఎంపిక చేసి ప్రయోగాత్మకంగా అమలు చేసి.. దానిలో ఫలితాలు మెరుగ్గా రావడంతో ఫౌండేషన్ ప్రతినిధులను ఒప్పించడం ద్వారా రానున్న విద్యా సంవత్సరం(2025-26) నుంచి ఈ పాఠ్యాంశాలను రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలలో అమలు చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. అన్ని పాఠశాలల్లో కంప్యూటింగ్ పాఠ్యాంశాలను రెగ్యులర్ సబ్జెక్టుగా ప్రవేశపెట్టనున్నారు. విద్యార్థులకు రెండు గంటలపాటు తరగతులు మరో రెండు గంటల ప్రాజెక్ట్ వర్క్‌తో విద్యార్థులకు నేర్పిస్తారు. పాఠశాలలోని దాదాపు 1,52,000 మంది విద్యార్థులందరికీ కంప్యూటింగ్ పాఠ్యాంశాలను ఒక సబ్జెక్టుగా నేర్పడంతో పాటు మూల్యాంకనం చేస్తారని.. కోర్సును పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు జారీ చేస్తారని తెలిపారు. విద్యార్థులకు సాంకేతిక కోర్సులను అందుబాటులోకి తెచ్చేందుకు పలు అంకురా సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని తెలిపారు.

# అర్జున్ S/O వైజయంతి' సెకండ్ సింగిల్

నందమూరి కళ్యాణ్ రామ్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ అర్జున్ S/O వైజయంతి. ఈ చిత్రంలో విజయశాంతి పవర్ ఫుల్ పాత్రలో కనిపిస్తున్నారు. ఈ యాక్షన్‌ప్యాక్డ్ ఫ్యామిలీ ఎంటర్ట్రైనర్‌లో ఈ రెండు పాత్రలు మధ్య డైనమిక్స్ కీలకంగా వుండబోతున్నాయి. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహించి ఈ చిత్రాన్ని అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్‌లపై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. అర్జున్ S/O వైజయంతి టీజర్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఫస్ట్ సింగిల్ నయాల్ది సాంగ్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. మేకర్స్ ఇప్పుడు సెకండ్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు. అర్జున్ S/O వైజయంతి సెకండ్ సింగిల్ ముచ్చటగా బంధాలే సాంగ్ ఏప్రిల్ 9న రిలీజ్ కానుంది. చిత్తూరు శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్ మైదానంలో గ్రాండ్ ఈవెంట్‌లో సాంగ్‌ని లాంచ్ చేయనున్నారు. మదర్ అండ్ సన్ బాడింగ్‌ని బ్యూటీఫుల్ ప్రజెంట్ చేసిన సాంగ్ అనౌన్స్‌మెంట్ పోస్టర్ అందరినీ ఆకట్టుకుంది. ప్రస్తుతం సినిమా ప్రమోషన్స్ ఫుల్ స్వింగ్‌లో జరుగుతున్నాయి. శ్రీరామ నవమి సందర్భంగా స్పెషల్ ఇంటర్వ్యూ చేశారు. ఇది సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ మూవీ వండర్ ఫుల్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందిస్తుందని హామీ ఇస్తుంది. సోహైల్ ఖాన్, సాయి మంజ్రేకర్, శ్రీకాంత్, యానిమల్ పృథ్వీరాజ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి బి అజనీష్ లోక్‌నాథ్ సంగీతం, రామ్ ప్రసాద్ సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్ తమ్మిరాజు, స్క్రీన్‌ప్లే శ్రీకాంత్ విస్సా. ఈ సినిమా ఏప్రిల్ 18న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్ రిలీజ్ కానుంది.



నటీనటులు: నందమూరి కళ్యాణ్ రామ్, విజయశాంతి, సోహైల్ ఖాన్, సాయి మంజ్రేకర్, శ్రీకాంత్, యానిమల్ పృథ్వీరాజ్
సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: ప్రదీప్ చిలుకూరి, నిర్మాతలు: అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, డీవోపీ: రామ్ ప్రసాద్
బ్యానర్లు: అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్
ఎడిటర్: తమ్మిరాజు, సమర్పణ: ముప్పా వెంకయ్య చౌదరి, స్క్రీన్ ప్లే: శ్రీకాంత్ విస్సా, ఆర్ట్ డైరెక్టర్:బ్రహ్మకడలి.

# అట్లీతో అల్లుఅర్జున్ భారీ చిత్రం

భారతదేశ సినీ ప్రేమికులతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్ అభిమానులు ఎదురుచూస్తున్న అత్యంత సన్సేషనల్ కాంబో అల్లు అర్జున్, స్టార్ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో సన్ పిక్చర్స్ సంస్థ నిర్మించనున్న అత్యంత భారీ చిత్రం, సన్సేషనల్ చిత్రం ప్రకటన అధికారికంగా వచ్చేసింది. స్టార్ డైరెక్టర్ అట్లీ ఫస్ట్ తెలుగు సినిమా ఇది. కాగా ఏప్రిల్ 8 ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా సన్‌పిక్చర్స్ సంస్థ ఈ భారీ ప్రకటనను ఎంతో ప్రస్టేజియస్‌గా విడుదల చేసింది. ఇండియన్ సినిమా పరిశ్రమనలొ నూతన ఉత్తేజాన్ని నింపిన ఈ భారీ ప్రాజెక్ట్‌ను ప్రముఖ ఎంటర్టైన్‌మెంట్ సంస్థ సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ సమర్పణలో పాన్ ఇండియా స్థాయిలో రూపొందనున్న అంతర్జాతీయ ప్రాజెక్ట్ ఇది. లాస్ ఏంజెల్స్‌లోని ఓ స్టూడియోలో ప్రత్యేకంగా హీరో అల్లు అర్జున్, హాలీవుడ్ టెక్నీషియన్స్, దర్శకుడు



అట్లీలపై చిత్రీకరించిన ఓ ప్రత్యేక వీడియో ద్వారా ఈ అనౌన్స్‌మెంట్‌ను చేసి అందరిని సంభ్రమశ్చర్యాలకు గురిచేశారు. ఇప్పటివరకు టైటిల్ ఖరారు కాని ఈ పాన్‌ఇండియా చిత్రంతో, మూడుముఖ్యమైన సృజనాత్మక శక్తులు ఏకమవుతున్నాయి: భారీ బ్లాక్‌బస్టర్ చిత్రాల దర్శకుడు అట్లీ (జవాన్, థెరి, బిగిల్, మెర్సల్ వంటి చిత్రాలతో ప్రఖ్యాతి గాంచినవాడు); పుష్ప చిత్రంతో ప్రపంచవ్యాప్తంగా అభిమానుల్ని సంపాదించి, ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డు పురస్కారం పొందిన ఐకాన్ స్టార్ అల్లు అర్జున్; మరియు భారతదేశంలోని అగ్రగణ్య మీడియా సంస్థలలో ఒకటైన సన్ టీవీ నెట్‌వర్క్‌కు చెందిన సన్ పిక్చర్స్. అంతర్జాతీయ స్థాయిలో ఆకర్షణ కలిగించేలా రూపొందించనున్న ఈ సినిమా, భావోద్వేగాలు, మాస్ యాక్షన్, పెద్ద స్కేలు నిర్మాణంతో ఓ చారిత్రక సినిమాగా నిలవనుందని చెప్పబడుతోంది. ఈ ప్రత్యేక వీడియో చూసిన అందరూ ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో ఓ మ్యాజిక్ జరగబోతుందని, ఈ చిత్రంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన గ్రాఫిక్స్, విజువల్ ఎఫెక్ట్స్, హాలీవుడ్ స్థాయి మేకింగ్ ఉండబోతుందని అర్థమవుతోంది.




# 'డియర్ ఉమ' టీజర్ రిలీజ్

తెలుగమ్మాయి అయిన సుమయ రెడ్డి హీరోయిన్‌గా, నిర్మాతగా, రచయితగా డియర్ ఉమ అనే చిత్రం ఏప్రిల్ 18న రాబోతోంది. ఈ చిత్రంలో పృథ్వీ అంబర్ హీరోగా నటించారు. ఈ మూవీకి నిర్మాతగా సుమయ రెడ్డి.. లైన్ ప్రొడ్యూసర్‌గా నగేష్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా నితిన్ రెడ్డి వ్యవహరించారు. ఇక ఈ సినిమాకు సాయి రాజేష్ మహాదేవ్ స్క్రీన్ ప్లే, మాటలు, దర్శకత్వ బాధ్యతలు నిర్వర్తించారు. ఇక ఎన్నో చిత్రాలకు అద్భుతమైన విజువల్స్



అందించిన రాజ్ తోట కెమెరామెన్‌గా, బ్లాక్ బస్టర్ చిత్రాలకు మ్యూజిక్ అందించిన రదన్ సంగీత దర్శకుడిగా పని చేశారు. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా డియర్ ఉమ నుంచి వచ్చిన పోస్టర్లు, గ్లింప్స్, పాటలు ఇప్పటికే అంచనాల్ని పెంచేశాయి. తాజాగా డియర్ ఉమ టీజర్‌ను రిలీజ్ చేశారు. ప్రముఖ దర్శకుడు శివ నిర్వాణ ఈ మూవీ టీజర్‌ను రిలీజ్ చేశారు. టీజర్‌ను చూసిన శివ నిర్వాణ చిత్రయూనిట్‌ను అభినందించారు. టీజర్ ఎంతో బాగుందని, ప్రేమతో పాటుగా అంతర్లీనంగా మంచి సందేశాన్నిచ్చే ఫీల్ గుడ్ ఎంటర్టైనర్‌లా ఉండబోతోందని అన్నారు. గుడిలో దేవుడి వద్ద చేసే ప్రార్థనల కన్నా.. హాస్పిటల్‌లో నాలుగు గోడల మధ్య చేసే ప్రార్థనేలా ఎక్కువ అంటూ ప్రారంభమైన టీజర్‌లో, రెండు జీవితాలు.. రెండు ప్రపంచాలు.. రెండు భావోద్వేగాలు.. ఇద్దరి ప్రేమలు.. ఒక హృదయం.. ఒక యుద్ధం, పేషెంట్స్‌కి, డాక్టర్లకు మధ్య మీలాంటి కమిషన్స్ ఏజెన్సీ, బ్రోకర్లు ఉండకూడదు సర్.. దీని కోసం నేను ఎంత దూరమైనా వెళ్తాన్న అనే డైలాగ్స్ ఎంతో ఎమోషనల్‌గా అనిపించాయి. హీరో, హీరోయిన్ల మధ్య ప్రేమతో పాటుగా ఇందులో సమాజాన్ని మేల్కొలిపే చక్కటి సందేశాన్ని ఇవ్వబోతోన్నట్టుగా అర్థం అవుతోంది. హై టెక్నికల్ స్టాండర్డ్స్‌తో ఈ సినిమాను లవ్, ఫ్యామిలీ, యాక్షన్ డ్రామా ఇలా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా తెరకెక్కించారు. ఇక ఏప్రిల్ 18న ఈ మూవీని భారీ ఎత్తున విడుదల చేయనున్నారు. ఈ చిత్రంలో కమల్ కామరాజు, సప్త గిరి, అజయ్ ఘోష్, ఆమని, రాజీవ్ కనకాల, పృథ్వీరాజ్, రూప లక్ష్మీ వంటి వారు నటించారు. నటీనటులు: సుమయ రెడ్డి, పృథ్వీ అంబర్, కమల్ కామరాజు, సప్త గిరి, అజయ్ ఘోష్, ఆమని, రాజీవ్ కనకాల, పృథ్వీరాజ్, రూప లక్ష్మీ తదితరులు, సాంకేతిక బృందం: బ్యానర్: సుమ చిత్రఆర్ట్స్, నిర్మాత: సుమయ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: నితిన్ రెడ్డి, లైన్ ప్రొడ్యూసర్: నగేష్ యూ.జీ, దర్శకుడు: సాయి రాజేష్ మహాదేవ్.

# 18న 'జగమెరిగిన సత్యం'

అమృత సత్యనారాయణ క్రియేషన్స్ ప్రొడక్షన్ నంబర్ 1గా తెరకెక్కిన చిత్రం జగమెరిగిన సత్యం. అచ్చ విజయ భాస్కర్ నిర్మించిన ఈ చిత్రానికి తిరుపతి పాలే దర్శకత్వం వహించారు. అవినాష్ వర్మ ఆద్య రెడ్డి, నీలిమ హీరో హీరోయిన్లుగా నటించిన ఈ చిత్ర షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పూర్తి చేసుకొని ఏప్రిల్18న థియేటర్స్‌లో గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో తెలంగాణ నేపధ్యంలో 1994 లో జరిగిన ఒక యదార్థ సంఘటన ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించారు దర్శకుడు తిరుపతి పాలే. ఖర్చుకు ఎక్కడా వెనకాడకుండా నిర్మాత అచ్చ విజయ భాస్కర్ సినిమాను గ్రాండ్‌గా నిర్మించారు. సురేష్ బొబ్బిలి అందించిన ఈ చిత్ర పాటలకు మంచి స్పందన లభిస్తోంది. ఈ సందర్భంగా హీరో ఆకాష్ జగన్నాథ్ మాట్లాడుతూ, జగమెరిగిన సత్యం టైటిల్ బాగుంది. సాంగ్స్ ప్రోమోస్ బాగున్నాయి. మంచి కథ కథనాలతో వస్తోన్న ఈ సినిమా తప్పకుండా విజయం సాధించాలని కోరుకుంటున్నాను. సినిమా సక్సెస్ అయ్యి చిత్ర యూనిట్ అందరికి మంచి



గుర్తింపు తెచ్చిపెట్టాలని ఆశిస్తున్నాను అన్నారు. ఏప్రిల్ 18న ఈ సినిమాను అందరూ థియేటర్స్‌లో చూసి ఆదరించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. నటీనటులు: అవినాష్ వర్మ, ఆద్య రెడ్డి, నీలిమ పతకమ శెట్టి తదితరులు, డైరెక్టర్: తిరుపతి పాలె, నిర్మాత: అచ్చ విజయ భాస్కర్
కెమెరామెన్: షోయబ్, ఎడిటర్: అమర్ రెడ్డి
మ్యూజిక్: సురేష్ బొబ్బిలి
ప్రొడక్షన్ డిజైనర్: శ్రీపాల్ మాచర్ల
ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిరణ్ కుమార్ ఘటకల.

# 'దండోరా' సెకండ్ షెడ్యూల్ షురూ

నేషనల్ అవార్డ్ గెలుచుకున్న చిత్రం కలర్ ఫోటో.. బ్లాక్‌బస్టర్ మూవీ బెదురులంక 2012 చిత్రాలను నిర్మించి అందరి దృష్టిని ఆకర్షించిన లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత రవీంద్ర బెనర్జీ ముప్పానేని రూపొందిస్తోన్న తాజా చిత్రం దండోరా. మురళీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ మూవీ శరవేగంగా చిత్రీకరణను జరుపుకుంటోంది. ఇప్పటికే ఫస్ట్ షెడ్యూల్‌ను పూర్తి చేసుకున్న ఈ చిత్రం తాజాగా సెకండ్ షెడ్యూల్ చిత్రీకరణను ప్రారంభించింది. 25 రోజుల పాటు కంటిన్యూగా జరగనున్న ఈ షెడ్యూల్‌లో విలక్షణ నటుడు శివాజీ పాల్గొంటున్నారు. నైంటీస్, కోర్ట్ వంటి డిఫరెంట్ కంటెంట్‌తో ప్రేక్షకులను అలరించిన ఈ వెర్సటైల్ యాక్టర్ ఇప్పుడు దండోరా చిత్రంలో కీలక పాత్రలో నటిస్తున్నారు.



రీసెంట్‌గా విడుదలైన ఫస్ట్ బీట్ వీడియోకు సూపర్బ్ రెస్పాన్స్ వచ్చింది. అగ్ర వర్ణాలకు చెందిన అమ్మాయిలని ప్రేమించి పెళ్లిచేసుకున్నా, అగ్ర వర్ణాలకు ఎదురు తిరిగినా ఎలాంటి దౌర్జన్యకాండ జరుగుతున్నా యనే అంశాన్ని ఆధారంగా చేసుకుని దండోరా సినిమాను తెరకెక్కిస్తున్నారు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో మన పురాతన ఆచారాలు, సాంప్రదాయాలను ఆవిష్కరిస్తూనే వ్యంగ్యం, చక్కటి హాస్యం, హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాల కలయికగా ఈ సినిమాను ఆవిష్కరిస్తున్నారు. విలక్షణ నటుడు శివాజీతో పాటు నవదీప్, నందు, రవి కృష్ణ, మణిక, అనూష, రాధ్య తదితరులు. ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు మార్క్ కె.రాబిన్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. వెంకట్ ఆర్.శాఖమూరి సినిమాటోగ్రఫీ, గ్యారీ బి.హెచ్ ఎడిటింగ్, క్రాంతి ప్రియమ్ ఆర్ట్ డైరెక్టర్, రేఖ బొగ్గారపు కాస్ట్యూమ్ డిజైనర్, ఎడ్వర్డ్ స్టీవ్‌సన్ పెరెజీ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్, అనీష్ మరిశెట్టి కో ప్రొడ్యూసర్‌గా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. త్వరలోనే ఈ మూవీకి సంబంధించి మరిన్ని వివరాలను తెలియజేస్తామని మేకర్స్ తెలియజేశారు. శివాజీ, నవదీప్, నందు, రవి కృష్ణ, మణిక, అనూష, రాధ్య తదితరులు.సాంకేతిక నిపుణులు: బ్యానర్: లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మాత: రవీంద్ర బెనర్జీ ముప్పానేని.

# 'కౌసల్య తనయ రాఘవ' ట్రైలర్

ఫీల్ గుడ్ ఎమోషనల్ ఎంటర్టైనర్ గా సాగే కౌసల్య తనయ రాఘవ ట్రైలర్ ఈ నెల 11న చిత్రం విడుదల కానుంది. మంచి ఫీల్ గుడ్ లవ్ స్టోరీలు వచ్చి చాలా కాలమే అవుతోంది. ప్రస్తుతం వెండి తెరపై మాస్, మసాలా, యాక్షన్, కామెడీ చిత్రాలే కనిపిస్తున్నాయి. కానీ స్వచ్ఛమైన వింటేజ్ విలేజ్ లవ్ ఎమోషనల్ డ్రామాలు కనిపించడం లేదు. ఆ లోటుని భర్తీ చేసేందుకు కౌసల్య తనయ రాఘవ్ఞ చిత్రం రాబోతోంది. రాజేష్ కొంచాడా, శ్రావణి శెట్టి నటీనటులుగా ఏఆర్ మూవీ మేకర్స్ బ్యానర్ పై కుటుంబమంతా కలిసి చూసే మంచి ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా అడపా రత్నాకర్ నిర్మిస్తున్న ఈ మూవీకి స్వామి పట్నాయక్ కథ, కథనం, దర్శకత్వం బాధ్యతల్ని నిర్వర్తిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన పోస్టర్లు, టీజర్, సాంగ్స్ అన్నీ కూడా అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ క్రమంలో శనివారం ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఆర్కే నాయుడు, చంటి, నిర్మాత రత్నాకర్ సంయుక్తంగా ఈ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇక ఈ ట్రైలర్‌ను ఓపెన్ చేసిన తీరు.. కథను చెప్పిన తీరు.. పాత్రల్ని పరిచయం చేసిన విధానం బాగుంది. సీతారాములు, రావణుడు అనే కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించారని అర్థం అవుతోంది. ఓ ఊరు.. అందులో హీరో, హీరోయిన్, విలన్ పాత్ర.. అయితే ఈ చిత్రంలో మాత్రం ప్రేమతో పాటుగా మంచి సందేశాన్ని ఇచ్చినట్టుగా అనిపిస్తుంది. చదువు ముఖ్యమని అంతర్లీనంగా సందేశాన్ని ఇచ్చాడు దర్శకుడు. 80వ దశకంలో జరిగిన కథను తెరపై మరింత అందంగా మల్చినట్టు అనిపిస్తుంది. కౌసల్య తనయ రాఘవ చిత్ర ట్రైలర్‌లో విజువల్స్, మ్యూజిక్ ఎంతో నేచురల్‌గా ఉన్నాయి. యోగి రెడ్డి కెమెరా వర్క్ నాటి కాలానికి తీసుకెళ్లినట్టుగా అనిపిస్తుంది. రాజేష్ రాజ్ తేలు మ్యూజిక్ ఎంతో వినసొంపుగా ఉంది. ఈ ట్రైలర్‌లో మ్యూజిక్, విజువల్స్ అయితే అందరినీ ఆకట్టుకునేలా ఉన్నాయి. త్వరలోనే ఈ సినిమాను ఏప్రిల్ 11న రిలీజ్ చేసేందుకు దర్శక, నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ట్రైలర్ లాంచ్ అనంతరం హీరో రాజేష్ మాట్లాడుతూ, నన్ను నమ్మి నాకు అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. కౌసల్య తనయ రాఘవ చిత్రానికి పని చేసిన ప్రతీ ఒక్కరికీ మంచి పేరు వస్తుంది అన్నారు. దర్శకుడు స్వామి పట్నాయక్ మాట్లాడుతూ, కౌసల్య తనయ రాఘవ సినిమా అద్భుతంగా వచ్చింది. నాకు సపోర్ట్ చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. నిర్మాత రత్నాకర్ ఈ చిత్రాన్ని ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించారు. రాజేష్, శ్రావణి, ఆర్కే నాయుడు ఇలా అందరూ అద్భుతంగా నటించారు. మా చిత్రం ఏప్రిల్ 11న రాబోతోంది. అందరూ చూడండ్డి అని అన్నారు.



# 11న 'చెరసాల' విడుదల

ఎస్ రాయ్ క్రియేషన్స్ బ్యానర్ మీద కథ్రి అంజమ్మ సమర్పణలో కథ్రి అంజమ్మ, శికార నిర్మాతలుగా రామ్ ప్రకాష్ గున్నం హీరోగా నటిస్తూ, తెరకెక్కించిన చిత్రం చెరసాల. ఈ చిత్రంలో శ్రీజిత్, నిష్కల, రమ్య వంటి వారు నటించారు. ఈ మూవీ ఏప్రిల్ 11న రాబోతోంది. ఈ క్రమంలో చిత్రయూనిట్ మీడియా ముందుకు వచ్చింది. ఈ మేరకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో.. డైరెక్టర్, హీరో రామ్ ప్రకాష్ గున్నం మాట్లాడుతూ, మంచి కాన్సెప్ట్‌తో చెరసాల చిత్రం రాబోతోంది. కథ చెప్పిన వెంటనే నిర్మాతలు ఒప్పుకున్నారు. శ్రీజిత్, నిష్కల అద్భుతంగా నటించారు. మంచి టీం ఉంటేనే మంచి సినిమాను తీయగలుగుతాం. ఓ బంధం



ఎలా ఉండాలి? రిలేషన్ షిప్‌లో ఎలా ఉండాలి? ఎలా ఉండకూడదు అనే పాయింట్‌ను చూపించాను. మంచి ఎమోషన్స్‌తో పాటుగా చక్కని వినోదం కూడా ఉంటుంది. అన్ని వర్గాల వారిని ఆకట్టుకునేలా మా చెరసాల చిత్రం ఉంటుంది. ఏప్రిల్ 11న రాబోతోన్న మా సినిమాను అందరూ చూడండి. హీరో శ్రీజిత్ మాట్లాడుతూ, చెరసాల సినిమాను సపోర్ట్ చేసేందుకు వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. నేను తెలుగులోనే డబ్బింగ్ చెప్పాలని ప్రయత్నించాను. కానీ అది కుదరలేదు. సినిమా అద్భుతంగా వచ్చింది. ఇంత మంచి అవకాశంఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. మా దర్శకుడు ఈ చిత్రంమీద నాలుగేళ్ల ఫోకస్ పెట్టాడు. మధ్యలో ఇతర ఆఫర్లు వచ్చినా కూడా మా సినిమా మీదే దృష్టి పెట్టాడు. నేను కన్నడలో ఇదివరకు సినిమాలు చేశాను. నన్ను నమ్మి మా దర్శకుడు నాకు అవకాశం ఇచ్చారు. ఇలాంటి మంచి చిత్రాలు మరిన్ని రావాలి. మా సినిమా ఏప్రిల్ 11న రాబోతోంది. హీరోయిన్ నిష్కల మాట్లాడుతూ, నాకు చెరసాల చిత్రంలో అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. ఇది నాకు తెలుగులో తొలి చిత్రం. ఇందులో నేను ప్రియ అనే అద్భుతమైన పాత్రను పోషించాను. ఇంత మంచి సినిమాలో పని చేయడం ఆనందంగా ఉంది. డైరెక్టర్ రామ్ ప్రకాష్ సినిమాను అద్భుతంగా మలిచారు. మేం కష్టపడి, ఇష్టపడి సినిమాను చేశాం.

# 'కోర' సెన్సార్ కార్యక్రమం

డిఫరెంట్ కాన్సెప్ట్, హై ఓల్టేజ్ యాక్షన్ మూవీని కోర అనే చిత్రాన్ని సునామీ కిట్టి హీరోగా ఒరాటశ్రీ భారీ ఎత్తున తెరకెక్కించారు. ఈ సినిమాలో చరిష్మా, పి.మూర్తి ప్రధాన పాత్రలను పోషించారు. శ్రీ లక్ష్మీ మ్మ జ్యోతి క్రియేషన్స్ బ్యానర్ మీద డా.ఎ.బి.నందిని, ఎ.ఎన్.బాలాజీ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటికే రిలీజ్ చేసిన పోస్టర్లు, గ్లింప్స్, టీజర్, పాటలు సినిమా మీద అంచనాలు పెంచేశాయి. ఇక తాజాగా ఆస్కారు అవార్డు గ్రహీత చంద్రబోస్ రిలీజ్ చేసిన ఒప్పుకుందిరో అంటూ సాగే ఈ పాట అందర్నీ ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. తాజాగా సినిమాకి సంబంధించిన ఓ అప్డేట్ వచ్చింది. ఏప్రిల్ నెలలో ఈ మూవీని విడుదల చేయనున్నారు. ఈ మేరకు అన్ని కార్యక్రమాలు పూర్తి చేసే పనిలో చిత్ర యూనిట్ బిజీగా ఉంది. ప్రస్తుతం అయితే సెన్సార్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే సినిమాకు సంబంధించిన రిలీజ్ డేట్ ప్రకటించనున్నారు. ఈ చిత్రానికి సెల్వం మాతప్పన్ సినిమాటోగ్రఫర్‌గా పని చేయగా.. బిఆర్ హేమంత్ కుమార్ సంగీతం అందించారు. కె.గిరీష్ కుమార్ ఎడిటర్‌గా పని చేశారు. తారాగణం: సునామీ కిట్టి, చరిష్మా, పి.మూర్తి, ఎంకె మాత, మునిరాజు, నినాసం అశ్వత్ తదితరులు, సాంకేతిక సిబ్బంది: రచయిత, దర్శకుడు: ఒరాటశ్రీ, నిర్మాతలు: డా.ఎ.బి.నందిని, ఎ.ఎన్.బాలాజీ, బ్యానర్: శ్రీ లక్ష్మీ మ్మ జ్యోతి క్రియేషన్స్, కెమెరామెన్: సెల్వం మత్తప్పన్ సంగీత దర్శకుడు: బి ఆర్ హేమంత్ కుమార్, ఎడిటర్: కె.గిరీష్



# స్వచ్ఛమైన గాలికి బంతిపూల పెంపకం



మన్యాగణపతి ప్రాజెక్ట్ బ్రీత్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించిన టీనేజర్. బంతిపూలతో పర్యావరణాన్ని కాపాడుతూ స్వచ్ఛమైన గాలిని అందిస్తూ ఆరోగ్యానికి చేరువ చేయడానికి కృషి చేస్తున్నది. హైస్కూల్ విద్య నభ్యసిస్తున్న మన్య చిన్నతనం నుంచే పర్యావరణమంటే మక్కువ చూపేది. అలాగే సమాజ సేవ చేసేందుకు ఇష్టపడుతుంది. తన పదిహేనేళ్ల వయసులోనే స్వచ్ఛంద సంస్థ స్థాపించి, ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతోంది. మొదట బెంగళూరు నగరంలో పేదవారికి, అవసరరార్థులకు పోషకాహారం అందించడం ప్రారంభించింది. ఆమె తల్లిదండ్రులు ఆమె చేస్తున్న సమాజ సేవకు ఎంతో ప్రోత్సాహకరంగా ఉంటారంటోంది. తాను స్థాపించిన ఎన్జీవో వేకదిగా మొదటి పేదవారికి కడుపు నిండా ఆహారం పెట్టాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలోనే కుటుంబసభ్యులు, స్నేహితులతో కలిసి చుట్టుపక్కల ఉన్న గ్రామీణ ప్రాంతాల్ని సందర్శించింది. అనంతరం వారికి పోషకాహారం అందించే ఏర్పాట్లు చేసినట్లు చెపుతోంది. స్థానికంగా ఉండే రెస్టారెంట్లకు సహకారం అందిస్తూ వారు చుట్టుపక్కల ప్రజలకు తక్కువ ధరకు, ఉచితంగా నాణ్యమైన భోజనం అందేలా ఏర్పాట్లు చేసింది. అలా వేలాది మంది ఆకలి తీర్చగలిగినందుకు ఆనందంగా ఉందంటోంది. శారీరక, మానసిక ఆరోగ్యం, వ్యర్థాల నిర్వహణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి తదితర అంశాలపైనా దృష్టి సారిస్తోంది. ఈ క్రమంలోనే స్నేహితులతో కలిసి నిధులు సేకరిస్తూ వైద్యశిబిరాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, పిల్లల కోసం ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తోంది.

పర్యావరణ పరిరక్షణ పైనా దృష్టి పెట్టిన మన్య ఇంటా, బయటా పార్థేనియం మొక్కల్ని పూర్తిగా తొలగించి వాటికి బదులు బంతిపూల మొక్కల్ని నాటాలని అక్కడి కమ్యూనిటీల్లో అవగాహన పెంచుతోంది. ఇంటి గార్డెన్లలో బయట పార్కులు, రోడ్లకు ఇరువైపులా నాటే మొక్కల్లో బంతిపూల మొక్కలు నాటేలా చేస్తోంది. కలుషితమైన గాలిని నిర్మూలించి వాతావరణంలో స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను పెంచే శక్తి ఈ పూలకు ఉందని చెపుతోంది. అంతేకాదు మట్టి నాణ్యతను కూడా ఇది పెంచుతుందని తెలిపింది. ఈ కార్యక్రమంల విజయవంతమవడంతో దీన్ని బెంగళూరు వ్యాప్తంగా అమలు చేసే పనిలో నిమగ్నమయింది. బంతిపూలతో సుమారు 88 శాతం గాలి స్వచ్ఛంగా మారుతుందని చెబుతోంది.

# సానుకూల భావన కోసం..

**ఒత్తిడి మనకు పెద్దగా పరిచయం** అక్కర్లేని పేరు. నిద్రలేమి, నెలసరి సమస్యలు.. ఇలా దీనికి కారణాలు బోలెడు. కాబట్టి ఓ రెండు నిమిషాలు ఇలా చేస్తే అది కాస్తా మటుమాయం.

కళ్లు మూసుకొని దీర్ఘశ్వాస తీసుకొని వీలైనంత సేపు అలా పట్టి ఉంచండి. తర్వాత నెమ్మదిగా వదలాలి. ఈ పక్రియలో ధ్యాసంతా పొట్ట మీదే ఉంచాలి. ఇలా రెండు నిమిషాలు చేస్తే చాలు. ఈ వ్యాయామం నాడీవ్యవస్థను నెమ్మ దింపజేసి.. ఒత్తిడిని దూరం చేస్తుంది.



¥ చిన్న చిన్న వార్మప్‌లు.. నడుముపై చేతులు ఉంచి వెనక్కి వాలడం, జాగింగ్, స్ట్రెచింగ్ వంటివీ చేయొచ్చు. వేగంగా కొద్దిసేపు నడిచినా ఫలితం కనిపిస్తుంది. ¥. నేల మీద కాళ్లు ముడుచుకొని కూర్చోవాలి. కళ్లు మూసి, మీరు ప్రేమించే వాళ్లనో.. మీకు ఆనందాన్నిచ్చే సందర్భాన్నో గుర్తు తెచ్చుకోండి. మనసు ఇతర అంశాల మీదకి మళ్లి ఆందోళన దూరం అవుతుంది. మనసు లగ్నం కావట్లేదనిపిస్తే ఎదురుగా ఉన్న వస్తువుని తదేకంగా చూడండి.

కళ్లు మూసి మరోసారి ప్రయత్నించండి. మనసు తేలిక పడుతుంది.

. ఇతరులతో పోలిస్తే మీరు ఏ అంశాల్లో మెరుగ్గా ఉన్నారో ఆలోచించుకోండి. కనీసం మూడు అంశాలను ఎతు క్కున్నా చాలు. జీవితం మీద సానుకూల భావన ఏర్పడు తుంది. ఇదీ ఒత్తిడిని తగ్గించే మార్గమే. పోనీ.. మంచి జోక్‌ని గుర్తుతెచ్చుకోండి. లేదా చదవండి.. నవ్వు ఎండార్ఫిన్లను విడుదల చేసి,

ఒత్తిడిని దూరం చేస్తుంది. మొక్కల మధ్యకు వెళ్లండి. ఆ పూల సువాసనలు చూడండి. ఆ అవకాశం లేకపోతే ఆరోమా ఆయిల్‌ని వాసన చూడటమో.. సెంటెడ్ క్యాండిల్‌ని వెలిగించడమో చేసినా చాలు. ఇవి మనసును తేలికపరిచి ఒత్తిడిని తగ్గిస్తాయి.

# కొలెస్ట్రాల్‌తో మతిమరుపు!

ప్రయోజనాలు తగ్గుతున్నాయని ఇటీవల ఓ అధ్యయనం తేల్చింది. దీంతో ఆల్జీమర్స్ ప్రమాదం ఎదురయ్యే అవకాశాలూ లేకపోలేదంటోంది. అయతే ఈ సమస్యను ఆరోగ్యకరమైన జీవనశైలితో అధిగమించొచ్చని చెబుతోంది. జర్నల్ ఆఫ్ క్లినికల్ ఎండోక్రినాలజీ అండ్ మెటాబాలిజంలో ప్రచురించిన పిట్స్‌బర్గ్ విశ్వవిద్యాలయ పరిశోధన బృంద అధ్యయనం.. ఇంకా ఏం చెబుతోందంటే..



మహిళల్లో మంచి కొలెస్ట్రాల్ కణాలు జ్ఞాపకశక్తిని పెంచుతాయి. అయితే అవే కణాలు మెనోపాజ్‌కు దగ్గరవు తున్నప్పుడు ఆల్జీమర్స్ కీ.. కారణమవుతాయి. మెనోపాజ్‌కు ముందు ఈ కణాల సంఖ్య పెరుగుతుంటుంది. వీటి సంఖ్యతోపాటు పరిమాణం కూడా పెద్దదవుతుంది. అయితే మొదట్లో ఉండే చిన్నకణాలు అందించే ఆరోగ్యప్రయోజనాలను ఈ పెద్ద కణాలు పూర్తిగా ఇవ్వలేవని అధ్యయనం ద్వారా తెలిసింది. అలాగే ఇవి మెదడు ఆరోగ్యాన్ని ప్రోత్సహించడంలో అంత ప్రభావంతంగా పనిచేయడంలేదని కూడా గుర్తించారు. దీంతో వయసు పెరుగుతున్నకొద్దీ అధికాస్థాయి. పెద్ద పరిమాణంలో ఉండే కొలెస్ట్రాల్ కణాలు మెదడు ఆరోగ్యంగా ఉండేలా పనిచేయడం లేదనీ దీనికి బదులుగా చిన్నగా ఉండే మరింత చిన్న ఫాస్ఫోలిపిడ్-రిచ్ హెచ్‌డిఎల్ కణాల సంఖ్య పెరిగితే ఆల్టీమర్స్ ముప్పును తప్పించు కోవచ్చు. వృద్ధాప్యం వల్ల మెదడుపై పడే ప్రభావం నుంచి రక్షించడంలో కీలక పాత్ర పోసిస్తామని తేలింది. కాబట్టి వాటి సంఖ్య పెరిగేందుకు పోషకాహారం, శారీరకశ్రమ, ఆరోగ్యకరమైన జీవనశైలి తప్పనిసరి అంటున్నారు పరిశోధకులు.

# పిల్లల అల్లరి

**ఈ రోజుల్లో పిల్లల్ని పెంచడం పెద్ద సవాలు. గారాబంగా** పెంచితే మాట వినడం లేదనీ, అలాగని కాస్త కఠినంగా వ్యవహరిస్తే మరింత మొండిగా తయారవుతున్నట్లూ చెబతున్నాయి. కొన్ని అధ్యయనాలు. అందుకే, వారినెలా చక్కదిద్దాలో తెలియక తల్లిదండ్రులు ఒత్తిడిని గురవుతున్నారట. ఈ ఇబ్బంది తలెత్తకుండా వారిని ఏ వయసులో ఎలా పెంచాలో చెబుతున్నారు నిపుణులు.

ఐదు సంవత్సరాల లోపు పిల్లలు ఎక్కువగా అల్లరి చేస్తుంటారు. అలాగని వారిని నియంత్రించడానికి కొట్టడం, తిట్టడం, శిక్షలు వేయడం వంటివి చేస్తే మరింత మొండిగా తయారయ్యే ప్రమాదం ఉంటుంది. అందుకే వారితో సున్నితంగా ప్రవర్తించాలి. అర్థమయ్యేలా చెప్పాలి.



ఐదేళ్ల నుంచి పదమూడేళ్ల పిల్లలు ఎదుటివారిని ఎక్కువగా గమనిస్తుంటారు. వాటిని తిరిగి అనుసరిస్తుంటారు. అందుకే ఈ వయసులోనే వారికి మంచి అలవాట్లు నేర్పించాలి. మంచిచెడులను బోధిస్తూ పెంచాలి. కుటుంబం లో ఎవరైనా వారి ముందు చెడుగా ప్రవర్తించినా భవిష్యత్తులో వారూ అదే చేయాలను కుంటారు. అందుకే ఈ వయసులో పిల్లల ముందు ఆలోచించి మాట్లాడాలి. ఆచితూచి నడుచుకోవాలి.

ఇక టీనేజ్‌కి వచ్చేసరికి వారికి ప్రతి విషయం అర్థమవుతుంది. ఈ వయసులోనే వారితో స్నేహంగా ఉండాలట. ఆర్థిక విషయాలు, కుటుంబ పరిస్థితులు, ప్రేమ వ్యవహారాలు ఇలా సమాజంలో జరిగే ప్రతీ విషయాన్ని వారికి అర్థమయ్యేలా ఉదాహరణలతో వివరించాలట.

## ఆధ్యాత్మికం

# ధర్మసాధనంబు

తనువు అన్నారు. ఏ ధర్మాన్ని సాధించాలన్నా శరీరం ప్రధాన సాధనం. మోక్షం శారీరకమైంది కాకపోయినా దాన్ని సాధించటానికి శరీరం అవసరం. దేహం ఆరోగ్యంగా ఉంటే మనసు, హక్కు రెండూ నియంత్రణలో ఉంటాయి. ఈ మూడు కలిస్తేనే నరతికరణ శుద్ధి, యోగసిద్ధి ఇది మోక్షానికి మార్గం. కాబట్టి వీటన్నిటికీ మూలమైన శరీరాన్ని నిర్లక్ష్యం చేయకూడదు. 'శరీరమాద్యం ఖలు ధర్మసాధనమ్' అని కదా ఆర్యోక్తి. అంటే ఏ ధర్మాన్ని సాధించాలన్నా ముందుగా శరీరాన్ని జాగ్రత్తగా పరిరక్షించ ఎకోవాలి అని అర్థం. శరీర పోషణ, మనసు నిలకడగా ఉంచుకోవడం, ఆత్మ స్వరూపం, పరతత్వ సాధన ఈ నాలుగూ జీవితంలో క్రమంగా సాధించవలసిన అంశాలు. వాటిని ఎలా సాధించాలో అనుగీత చెబుతుంది. అందువల్ల మోక్షసాదనలో శరీర ప్రాధాన్యాన్ని అశ్రద్ధ చేస్తే వచ్చే అనార్థలను విపులంగా వివరించింది అనుగీత. ఒక వ్యక్తి అత్యుత్సాహంతో తన స్థాయికి మించి కానీ, అలసత్వంతో తన స్థాయికి తగ్గి కానీ ప్రవర్తించ కూడదు. శరీర పోషణకు ఎంతో ముఖ్యమైన ఆహార స్వీకరణలో కూడా స్థాయి. కాలం, గుణాలను దృష్టిలో ఉంచుకోవాలి. ఎవరికి వారు తమ శరీరం-వాత, పిత్త,కఫ ప్రకృతుల్లో ఏదో గుర్తించి. దానికి అనుగుణమైన ఆహారం తీసుకోవాలి. అందుకు విరుద్ధమైన ఆహారం తీసుకోవడం, అతిగా తినడం, సమయానికి తినకపోవడం-ఈ మూడింటిపై ఎవరు శ్రద్ధ పెట్టరో. వారికి ఆహారమే శత్రువు అవుతుంది.

# చిలగడ దుంప కట్లెట్స్

**కావలసినవి :** చిలకడ దుంపలు-3, ఉప్పు-పావు చెంచా, కొత్తిమీర తరుగు-చారెడు, మొక్కజొన్న పిండి-3 చెంచాలు, పచ్చిమిర్చి-2, నిమ్మరసం, కారం, అల్లం తరుగు-చెంచా చొప్పున, జీలకర్ర పొడి, గరం మసాలా, ఛాట్ మసాలా-అర చెంచా చొప్పున, నూనె-2 చెంచాలు.

తయారీ : చిలకడదుంపలు ఉడికించి, పొట్టు తీసి మెత్తగా మెదపాలి. అందులో మొక్కజొన్న పిండి, పచ్చిమిర్చి ముక్కలు, నిమ్మరసం, ఉప్పు, అల్లం తరుగు, జీలకర్ర పొడి, గరం మసాలా, ఛాట్ మసాలా, కారం.. అన్నీ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని చిన్న ఉండలుగా తీసుకుని చేత్తో చిన్నగా ఒత్తుకోవాలి. కడాయిలో కాస్త నూనె వేసి బంగారు రంగు వచ్చేదాకా వేయించు కోవాలి. అంతే ఘుమఘుమలాడే చిలకడదుంప కట్లెట్లు సిద్ధం



# దేశంలోనే సామాజిక భద్రత పించన్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఎపి

**రాష్ట్ర అభివృద్ధికి సహకరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు : డా. డోలా బాల వీరాంజనేయస్వామి**

**విజయవాడ,ఏప్రిల్8,ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించేందుకు కృషి చేస్తున్నట్టు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు ,డెహ్రాడూన్ లో జరిగిన చింతన్ శివిర్ సమావేశంలో మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పాల్గొని ప్రసంగిస్తూ పి 4 తోనే పేదరిక నిర్మూలన సాధ్యమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన విజన్ తో ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. కేంద్ర సామాజిక న్యాయం ,సాధికారత శాఖ మంత్రి వీరేంద్ర కుమార్ అధ్యక్షతన అన్ని రాష్ట్రాల సాంఘిక సంక్షేమ శాఖ మంత్రులతో ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్ లో రెండు రోజుల పాటు చింతన్ శివిర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి రెండవ రోజు సమావేశంలో రాష్ట్రంలో అమలు చేస్తున్న పి 4 పై ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ ప్రజెంటేషన్ ని ఇతర రాష్ట్రాల మంత్రులు, అధికారులు ఆసక్తిగా తిలకించారు. ప్రజెంటేషన్ అనంతరం మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ....సీఎం చంద్రబాబు నాయుడు తన విజన్ తో ఏపీలో పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్నారు. విజన్ 2047 లో భాగంగా ఉగాది నాడు పి 4 పథకం ప్రారంభించి పేదలను ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టారు. సమాజంలో 10 శాతం ఉన్న ధనవంతులు 20 ఉన్న పేదల అభివృద్ధికి సహకరించాలి. రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు ప్రత్యేకంగా ఈగల్ వ్యవస్థ తీసుకొచ్చి ఈగల్ పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేశాం. జిల్లా ఆస్పత్రులు, మెడికల్ కాలేజీల్లో డి ఎడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేసి సమర్థవంతంగా నిర్వహిస్తున్నాం. దేశంలోనే పెద్ద మొత్తంలో సామాజిక భద్రత ఫించన్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీనే. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏపీలో వృద్ధులకు రూ. 4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేల నుంచి రూ.15 వేలు ఫించన్ అందిస్తున్నాం. పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల అనుసంధానంతో పారిశుద్ధ్య నిర్వహణను మిషన్ల ద్వారా నిర్వహించేందుకు కృషి చేస్తున్నాం. ఇళ్ల నిర్మాణం కోసం కేంద్రం పీఎంఏవై కింద ఇచ్చే దానికి అదనంగా ఎస్టీలకు రూ. 75 వేలు, ఎస్సిలకు రూ. 50 వేలు ఏపీలో కూటమి ప్రభుత్వం ఇస్తోంది. పీఎం ఆదర్శ గ్రామ యోజన కింద కేంద్ర ప్రభుత్వం గ్రామానికి ఇస్తున్న రూ. 21 లక్షల్ని రూ.75 లక్షలు పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నా. పుట్టుకతోనే పిల్లల్లో ఆటిజం, వినికిడి లోపాలు గుర్తించేందుకు ప్రత్యేక పరికరాల్ని ప్రతి మెడికల్ కాలేజీల్లో ఏర్పాటు చేసేందుకు కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ సహకారం తీసుకోవాలి. వృద్ధులకు, ట్రాన్స్ జెండర్లకు గుర్తింపు కార్డులు ఇస్తున్నాం. వృద్ధుల కోసం అన్ని జిల్లాల్లో వృద్ధాశ్రమాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుం టున్నాం. రూ. 143 కోట్లతో సంక్షేమ వసతి గృహాల్లో మరమ్మతులు చేయిస్తున్నా మని, ఎస్సి కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధికి సహకరి స్తున్న కేంద్ర ప్రభుత్వానికి మంత్రి ధన్యవాదాలు తెలిపారు.

# పోలవరం ముంపు గ్రామాల్లో శరవేగంగా పిడియఫ్ సర్వేలు



వరరామచంద్రాపురం గ్రామసభలో ప్రజల

**చింతూరు ఏప్రిల్8 ప్రభాతవార్త ప్రతినిధి:** చింతూరు సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ ముంపునకు గురవుతున్న నిర్వాశితుల కన్నీటి గాథలను చవిచూసిన ఎపి ప్రభుత్వం,ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఎట్టి పరిస్థితుల్లో ఈ ఏడాది వరదలకు ముందే సర్వేలను పూర్తి చేసి నిర్వాశితులకు ఆర్ అండ్ ఆర్ చెల్లించి ఆయా గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించటానికి చేయాల్సిన కార్యచరణకు శ్రీకారం చుట్టింది.ప్రభుత్వ సన్నాహాలతో పోలవరం నిర్వాశితుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.పొలవరం గ్రామసభలకోసం ముంపు ప్రాంతాల ప్రజలు గంపెడాశతో ఎదురుచూస్తున్నారు.అందులో భాగంగా అల్లూరి జిల్లా చింతూరు ఐటిడిఎ పరిధిలో పోలవరం పిడియఫ్ సర్వేలు శరవేగంగా జరుగుతున్నాయి.గతంలో ఎన్నడు లేనంతగా సర్వేలు వేగం పుంజుకోవటంతో నిర్వాశిత ప్రజల్లో ఆశలు విరజల్లుతున్నాయి.ప్రతి ఎటా వరదలతో నరకం అనుభవిస్తున్న కుటుంబాలు ఈ ఏడాది అయిన తమకు పోలవరం పరిహారం అందితె సురక్షిత ప్రాంతాలకు తరలిపోయి కూలీ,నాలీ చేసుకోని కలోగంజో త్రాగి ప్రశాంత జీవితం గడపాలని మానసికంగా సిద్దంగా ఉన్నారు.ప్రభుత్వం సైతం ప్రజల ఆలోచనలకు తగ్గట్టు పోలవరం పై ప్రత్యేక దృష్టి సారించటంతో ముంపు భాధిత కుటుంబాల్లో ఆశలు చిగురిస్తున్నాయి.పోలవరం ముంపు గ్రామాల్లో పిడియఫ్ సర్వేలను వేగవంతం చేసిన ప్రభుత్వం ఈ ఏడాది వరదలకు ముందె జూన్ 6 నాటికి ముంపు గ్రామాల ప్రజలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి చెల్లించి గ్రామాలను ఖాళీచేయించటానికి వ్యూహరచన చేస్తుంది.అందుకోసం పాలక ప్రభుత్వం సర్వేలను వేగవంతం చేసింది.దాంతో ఇప్పటి వరకు అల్లూరి జిల్లాలో నత్తనడకన ఉన్న పోలవరం సర్వేలు,కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తరువాత చింతూరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అపూర్వ భరత్‌కు చింతూరు సబ్‌కలెక్టర్,ఐటిడిఎ పివో భాధ్యతలతో పాటు ఆర్ అండ్ ఆర్ అధికారిగా అదనపు భాధ్యతలు అప్పగించింది.దాంతో పోలవరం ముంపు గ్రామాల్లో సర్వేలు ఊపందుకున్నాయి. ముంపు గ్రామాల్లో గ్రామ సభలను పూర్తి చేసి యుద్ద ప్రాతిపదికన ముంపు గ్రామాల్లోని ప్రజల జాభితాను సిద్దం చేసి వారి యొక్క పిడియఫ్ సర్వేలను పూర్తి చేయటంతో పాటు లబ్దిదారుల జాబితాను సిద్దం చేసి,ప్రతి లబ్దిదారుడి ఐడిని సృష్టించి ఆ యొక్కజాబితాను సియఫ్‌యంయస్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.దానికోసం చింతూరు ఐటిడిఎలోని ఆర్ అండ్ ఆర్ సెల్‌తో పాటు దానికి సంబంధించిన వివిధ విభాగాల అధికారులు,8మంది స్పెషల్ డిప్యూటి కలెక్టర్‌లు,వారి సిబ్బంది సబ్‌కలెక్టర్ కనుసన్నల్లో అహర్నిశలు శ్రమిస్తున్నారు.అర్హతలు ఉన్న ఎటక్క నిర్వాశిత కుటుంబానికి అన్యాయం జరగకుండా పూర్తి స్దాయిలో సర్వేలను క్షుణ్ణంగా పరిశీలించి ఓడిసిపడుతున్నారు.ఎట్టి పరిస్దితుల్లో పోలవరం ముంపు గ్రామాల్లోని ప్రజలకు ఆర్ అండ్ ఆర్ చెల్లించటమే లక్ష్యంగా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.అయితె అధికారులు,అలానే గ్రామసభలు పెడతారు తప్ప ఆ పోలవరం డబ్బులు వచ్చినప్పుడు చూద్దాంలే ! అనే ధోరణిలో మాత్రం చాలామంది ఉన్నాయి.కాని ప్రస్తుతం జరుగుతున్న సర్వేలు చివరి దశకు చేరాయన్న విషయాన్ని పోలవరం ముంపు గ్రామాల ప్రజలు గమనించాల్సి ఉంది.పోలవరం ముంపు గ్రామాల జాబితాను 41.15 కాంటూరు పాయింట్‌లో తొలిదశలో అంటె ఫేజ్1(ఎ)లో మొత్తం 21 గ్రామాలు ఉండగా అందులో వి.ఆర్.పురం మండలంలోని 20 గ్రామాలు,కూనవరం మండలంలోని బొజ్జరాయిగూడెం గ్రామం ఉంది.ఈ గ్రామాల పరిధిలో సుమారు 2344 పిడియఫ్‌లు ఉన్నట్టు ప్రాధమిక అంచనా.ఇదే ఫేజ్ 1(బి)లో మొత్తం 32 గ్రామాలు ఉండగా వాటిలో వి.ఆర్.పురం మండలంలో 16,కూనవరం మండలంలో 10,చింతూరు మండలంలో 6 గ్రామాలు ఉన్నాయి.ఆయా గ్రామాల్లో పిడియఫ్‌ల సంఖ్య 13790.చింతూరు మండలంలోని గ్రామాల్లో చింతూరు,చూటూరు,ఉలుమూరు,ఎజి కొడేరు,మార్కండేయపేట గ్రామాలు ఉన్నాయి.

# తిరుమల ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో శుభ్రత గాలికి!

**తిరుమల,ఏప్రిల్ 8ప్రభాతవార్తప్రతినిధి:** ప్రతిరోజూ లక్షమంది భక్తులు....సరాసరి యాభై శాతం మంది భక్తులు అల్పాహారం, మంచి నాణ్యమైన ఆహారం కోసం తిరుమలలోని ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు, హోటళ్ళపై ఆధారపడుతున్నారు. భక్తులకు రుచికరంగా, శుచిగా, శుభ్రమైన వాతావరణంలో ఆహారపదార్థాలు తయారుచేసి వడ్డించాలనే టిటిడి అధికారుల ఆదేశాలు ఇప్పటికీ కొన్ని హోటళ్ళు, ఫాస్టుపుడ్ కేంద్రాల యజమానులు బేఖాతర్ చేస్తున్నారు. నాణ్యత,శుభ్రత విషయంలో రాజీపడని టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఇప్పటికే ఆకస్మిక తనిఖీల్లో దాదాపు 15వరకు దుకాణాలు మూయించేశారు. అయినా ఇంకా కొండపై ఫాస్టుపుడ్ కేంద్రాల యజమానుల్లో మార్పు రాకపోవడం విశేషం. భక్తుల సేవలో తిరుమలలో వ్యాపారాలు చేసుకుంటున్న హోటళ్ళు,ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల నిర్వాహకులు ఆహారపదార్థాలు నాణ్యత లేకుండా తయారుచేస్తూ వడ్డిస్తున్నారు. రోజువారీగా తిరుమలకు వస్తున్న భక్తులు చాలావరకు కొండపై హోటళ్ళు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో తయారుచేసి వడ్డించే ఆహారపదార్థాలు తింటున్నారు. ఏదో ఒకరోజు ఇలా వచ్చాం కదా అని యాత్రికులు కూడా ధరలతో సంబంధం లేకుండా ఇష్టమొచ్చిన, నచ్చిన ఆహారపదార్థాలు భోంచేస్తున్నారు. యాత్రికులు ఒకపూట భోంచేసి వెళ్ళిన వాళ్ళు మళ్ళీ ఏడాదికో, రెండేళ్లకో తిరుమలకు వస్తారు. ఇక్కడ యాత్రికులకు రుచికరంగా, నాణ్యతతో ఆహారపదార్థాలు, తినుబండారాలు తయారుచేయాల్సిన హోటళ్ళు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల నిర్వాహకులు వాటిని గాలికొదిలేశారు. ఏకంగా తిరుమలలో మరుగుదొడ్లు, మూత్రశాలలకు సమీపంలోనే ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు నడుపుకుని రెండు చేతుల్లా వ్యాపారాలు చేసుకోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. గత ఐదేళ్ళలో తిరుమలలో విచ్చలవిడిగా హోటళ్ళు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు ఆహారపదార్థాలు రుచిగా లేకున్నా, నాణ్యత పాటించకున్నా అడిగే అధికారిగానీ, పట్టించుకున్న పాపాన లేదు. భక్తుల నుండి ఫిర్యాదులు వచ్చినా కనీసం నామమాత్రం స్పందన కరువైంది. ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు ఇష్టదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి వస్తున్న భక్తులకు వీలైనంత వరకు సంతోషకర సేవలందించాలని టిటిడి అధికారులకు ఆదేశం చారు. తొలుత నాణ్యతగా ఉన్న ఆహారపదార్థాలు వడ్డించేలా, రుచిగా శుచిగా ఉండేలా చూడాలని సూచించారు. టిటిడి ఇఒ జె.శ్యామల రావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి హోటళ్ళు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలపై తనిఖీలు మొదలుపెట్టారు. ఇలాంటి దోరణిలోనే సిఆర్ఓ సమీపంలో అనేక ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో కూడా కనీసం శుభ్రత పాటించడంలేదనేది భక్తుల ఆవేదన. ఇక్కడ మురుగునీరు క్రింద ప్రవహి స్తున్నా, హోటళ్ళలో వండిన అల్పాహారం ఇడ్లీ, దోస,పూరీలు, పులిహోర, లెమన్‌రైస్, వడలు, సాంబారు తదితర వాటికి కనీసం మూతలు ఉండవు. ధుమ్ము, ధూళి. ఈగలు వ్రాలుతున్నా ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల నిర్వాహకులు పట్టించుకోరు.

# ఆతిధ్య రంగంలో పెట్టుబడులే లక్ష్యంగా మంత్రి కందుల దుర్గేష్ ముంబయి పర్యటన

**విజయవాడ,ఏప్రిల్8,ప్రభాతవార్తప్రతినిధి:** ఆతిథ్య రంగంలో పెట్టుబడులే లక్ష్యంగా ఈ నెల 9వ తేది నుంచి రెండురోజులపాటు ముంబయిలో రాష్ట్ర పర్యాటకశాఖా మంత్రి కందుల దుర్గేష్ పర్యటించనున్నారు.ముంబయి పోవై లేక్ లో 8 10 వరకు జరుగుతున్న దక్షిణాసియా 20వ హోటల్ ఇన్వెస్ట్ మెంట్ కాన్ఫరెన్స్ వర్క్ షాప్ లో పాల్గొననున్న మంత్రి దుర్గేష్ ఆతిథ్య రంగంలో పెట్టుబడుల అవకాశాలు వివరిస్తారు.ఇన్వెస్టర్లను ఆహ్వానిస్తారు.ఇన్వెస్టర్లకు మెరుగైన రాయితీలు కల్పించి పూర్తి సహకారం అందిస్తామని భరోసా కల్పించనున్న మంత్రి దుర్గేష్ మంత్రి దుర్గేష్ తో పాటు పర్యటనలో పాల్గొననున్న పర్యాటక శాఖ సెక్రటరీ అజయ్ జైన్, టూరిజం ఎండీ ఆమ్రపాలి కా అమరావతి: ఆతిథ్య రంగంలో పెట్టుబడులే లక్ష్యంగా ఏప్రిల్ 9,10 తేదీల్లో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ముంబయిలో పర్యటించనున్నారు. ముంబయి పోవై లేక్ లో 810వ తేదీ వరకు జరుగుతున్న దక్షిణాసియా 20వ హోటల్ ఇన్వెస్ట్ మెంట్ కాన్ఫరెన్స్ వర్క్ షాప్ లో మంత్రి దుర్గేష్ పాల్గొననున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా రాష్ట్రంలో ఆతిథ్య రంగంలో పెట్టు బడుల అవకాశాలు వివరించి ఇన్వెస్టర్లను రాష్ట్రానికి ఆహ్వానించనున్నారు. ఇన్వెస్టర్లకు మెరుగైన రాయితీలు కల్పించి పూర్తి సహకారం అందిస్తామని భరోసా కల్పించనున్నారు. పర్యాటక రంగంలో భారీగా ఉపాధి అవకాశాల కల్పన,రూ. 25,000 కోట్ల పెట్టుబడులే లక్ష్యంగా పనిచేస్తోన్న మంత్రి కందుల దుర్గేష్ ఇప్పటికే రూ. 1200 కోట్లకు పైగా పెట్టుబడులు రాబట్టారు. 8 ఎంవోయూలు కుదుర్చుకున్నారు. మంత్రి దుర్గేష్ తో పాటు పర్యాటక శాఖ సెక్రటరీ అజయ్ జైన్, టూరిజం ఎండీ ఆమ్రపాలి కాట ముంబయి పర్యటనకు వెళ్లనున్నారు. తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం తరపున ఈ కాన్ఫరెన్స్ కు వెళ్తున్న బృందం అక్కడికి హాజరయ్యే దేశ, విదేశాల్లోని ప్రఖ్యాత హోటల్స్ గ్రూప్స్ తో ఏపీ నూతన పర్యాటక పాలసీ, పర్యాటక రంగానికి పరిశ్రమహోదా తదితర వివరాలు వెల్లడించి పెట్టుబడులను ఆకర్షించనుంది. వర్క్ షాప్ తో పాటు పదుల సంఖ్యలో వివిధ హోటల్స్ ప్రతినిధులతో భేటీ కానుంది. కూటమి ప్రభుత్వం కొత్త పర్యాటక విధానం ప్రకటించాక ప్రముఖ సంస్థలు రాష్ట్రంలో హోటల్స్ ఏర్పాటు చేసేందుకు ఆసక్తిని కనబరిచాయి. ఈ క్రమంలో రానున్న నాలుగేళ్లలో రాష్ట్రంలో 50,000 గదుల ఏర్పాటు చేయాలన్నారు.

# లక్నో సూపర్ జెయింట్స్ హ్యాట్రిక్ విక్టరీ



## 4 రన్స్ తేడాతో పోరాడి ఓడిన కోల్‌కత్తా నైట్ రైడర్స్

**న్యూఢిల్లీ:** ఐపిఎల్ 2025లో కోల్‌కతా నైట్ రైడర్స్‌పై లక్నో సూపర్ జెయింట్స్ 4 పరుగుల తేడాతో ఉత్కంఠభరితమైన విజయాన్ని నమోదు చేసింది. కోల్‌కతా తన సొంత మైదానంలో వరుసగా రెండో విజయం ఇది. తొలి మ్యాచ్‌లో ఆ జట్టు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు చేతిలో 7 వికెట్ల తేడాతో ఓడిపోయింది. నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 4 పరుగుల తేడాతో లక్నో గెలుపొందింది. మంగళవారం ఈడెన్ గార్డెన్స్ స్టేడియంలో 239 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో కోల్‌కతా 20 ఓవర్లలో 7 వికెట్లకు 234 పరుగులు మాత్రమే చేయగలిగింది. రింకు సింగ్ 15 బంతుల్లో 38 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. కెప్టెన్ అజింక్య రహానే 61, వెంకటేష్ అయ్యర్ 45 పరుగులు చేశారు. వారిద్దరూ 40 బంతుల్లో 71 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ భాగస్వామ్యం తెగిపోవడంతో, కోల్‌కతా జట్టు విడిపోయింది. ఆకాశ్ దీప్, శార్దూల్ ఠాకూర్‌లకు చెరో రెండు వికెట్లు దక్కాయి. అంతకు ముందు బ్యాటింగ్ ప్రారంభించిన లక్నో ప్లేయర్ నికోలస్ పూరన్ (86 నాటౌట్) పట్టపగలే కోల్‌కతా నైట్ రైడర్స్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. క్రీజులోకి రావడమే ఆలస్యం బౌండరీలతో విరుచుకుపడిన ఈ చిచ్చరపిడుగు అర్ధ శతకంతో గర్జించాడు. ఓపెనర్ షాన్ మార్ష్ (81) సైతం తన మార్క్ ఇన్నింగ్స్ ఆడాడు. పూరన్ మెరుపులతో ఆఖరి ఐదు ఓవర్లలో 86 పరుగులు రాబట్టింది. వీళ్లిద్దరి విధ్వంసక బ్యాటింగ్ ఫలితంగా కోల్‌కతా కంచుకోటలో లక్నో నిర్ణీత ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 238 పరుగులు చేసింది. టాస్ ఓడిన లక్నోకు ఓపెనర్లు షాన్ మార్ష్ (81 48 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లు), ఎడెన్ మర్క్‌రమ్ (47)లు శుభారంభం ఇచ్చారు. కోల్‌కతా బౌలింగ్ దళాన్ని చీల్చిచెండాడిన వీళ్లు పవర్ ప్లేలోనే 59 రన్స్ పిండుకున్నారు. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని విడదీసేందుకు అజింక్య రహానే ఎంత ప్రయత్నించిన ఫలితం లేకపోయింది.

అయితే 11వ ఓవర్లో హర్షిత్ రానా సూపర్ డెలివరీతో మర్క్‌రమ్‌ను బోల్డ్‌చేసి కోల్‌కతాకు బ్రేక్ ఇచ్చాడు. ఆ తర్వాత సెంచరీ దిశగా దూసుకెళ్తున్న మార్ష్‌ను రస్సెల్ బోల్తాకొట్టించాడు. దాంతో, 170 వద్ద లక్నో రెండో వికెట్ కోల్పోయింది. షాన్ మార్ష్ ఔటయ్యాక నికోలస్ పూరన్ (86: 35 బంతుల్లో 7ఫోర్లు, 8సిక్సర్లు) విధ్వంసం తారాస్థాయికి చేరింది. ఈ పవర్ హిట్టర్ హర్షిత్, రస్సెల్‌కు చుక్కలు చూపించాడు. 21బంతుల్లోనే హాఫ్ సెంచరీబాదిన పూరన్.. ఆ తర్వాత మరింత రెచ్చిపోయాడు. రస్సెల్ వేసిన 18వ ఓవర్లో 4, 4, 6, 4,6 బాది 24 పరుగులు పిండుకున్నాడు. దాంతో, లక్నో స్కోర్ 200 దాటింది. వైభవ్ వేసిన 20వ ఓవర్ తొలి బంతినే బౌండరీకి పంపాడు పూరన్. ఆ తర్వాతి ఐదు బంతుల్లో 6 రన్స్ మాత్రమే వచ్చాయి. దాంతో, లక్నో జట్టు నిర్ణీత ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 238 పరుగులు చేసింది.



### శ్రీలంక, దక్షిణాఫ్రికాతో త్రైపాక్షిక వన్డే సిరీస్..

## భారత్ మహిళల జట్టు ఖరారు

### టిజి నుండి అరుంధతి, ఎపి నుండి చరవాణిలకు చోటు

**న్యూఢిల్లీ:** శ్రీలంక, దక్షిణాఫ్రికాలతో మహిళల త్రైపాక్షిక వన్డే సిరీస్ నిమిత్తం భారత్ జట్టు ఖరారైంది. ఈ మేరకు శ్రీలంకలో పర్యటించనున్న మహిళా క్రికెట్ జట్టుకు భారత్ క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) ప్రకటించింది. ఈ నెల 27 నుండి శ్రీలంక-భారత్-దక్షిణాఫ్రికా మధ్య ట్రై సిరీస్ మొదలు కానుంది. శ్రీలంక, దక్షిణాఫ్రికాలతో జరగనున్న త్రైపాక్షిక వన్డే సిరీస్‌కు 15 మంది సభ్యులతో కూడిన జట్టును ఉమెన్స్ సెలక్షన్ కమిటీ ఎంపిక చేసినట్లు మంగళవారం ప్రకటించింది. ఈ ప్రతిష్టాత్మక సిరీస్‌లో రెగ్యులర్ కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ భారత జట్టును ముందుకు నడిపించనుండగా, స్మృతి మంధాన వైస్ కెప్టెన్‌గా కొనసాగనుంది. ఇక ఈ జట్టులో హైదరాబాదీ అమ్మాయి అరుంధతి, ఆంధ్ర క్రికెటర్, అన్ క్యాప్ట్ ప్లేయర్ నల్లపురెడ్డి శ్రీచరణి కూడా చోటు దక్కించుకున్నారు.

అంతేకాకుండా శ్రీచరణితో పాటు, మరో ఇద్దరు అన్ క్యాప్ట్ ప్లేయర్లు కశ్వీ గౌతమ్, శుచి ఉపాధ్యాయ్‌కు కూడా సెలక్టర్లు చోటివ్వడం విశేషం. మరోవైపు గాయాల కారణంగా రేణుకా సింగ్ ఠాకూర్, టైటస్ సాధు ఈ వన్డే సిరీస్‌కు దూరమైనట్లు బిసిసిఐ వెల్లడించింది. కాగా జనవరిలో ఐర్లాండ్‌తో స్వదేశంలో జరిగిన వన్డే సిరీస్‌కు హర్మన్ ప్రీత్ కౌర్ దూరంగా ఉంది. హర్మన్ ప్రీత్‌కు విశ్రాంతినిచ్చిన సెలక్టర్లు ఆమె స్థానంలో స్మృతికి సారధ్య బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలో జనవరి 10 నుండి 15 వరకూ జరిగిన ఈ సిరీస్‌లో స్మృతి సేన ఐర్లాండ్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఈ సిరీస్‌లో స్మృతికి దీప్తి శర్మ డిప్యూటీగా వ్యవహరించింది. కాగా ఈ నెల 27 నుండి ప్రారంభమవుతున్న ఈ ట్రై సిరీస్‌లో భాగంగా నాలుగు మ్యాచ్‌లకూ శ్రీలంకలోని కొలంబో మైదానం ఆతిథ్యం ఇవ్వనుండగా, రౌండ్ రాబిన్ పద్ధతిన జరగడంతో ప్రతీ జట్టు 4 మ్యాచ్‌లు ఆడుతుంది.

ఇందులో టాప్-2లో నిలిచి జట్లు ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. ఈ నెల 27న ఇండియా-శ్రీలంక, 29న ఇండియా-దక్షిణాఫ్రికా, మే 4న ఇండియా శ్రీలంక, 7న ఇండియా-దక్షిణాఫ్రికాల మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇక ఈ సిరీస్‌కు భారత్ జట్టులో హర్మన్ ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), ప్రతీకా రావల్, హర్లీన్ డియోల్, జెమిమా రోడ్రిగ్స్, రీచా ఘోష్ (వికెట్ కీపర్, యస్తికా భాటియా (వికెట్ కీపర్), దీప్తి శర్మ, అమన్ జోత్ కౌర్, కశ్వీ గౌతమ్, స్నేహ్ రాణా, అరుంధతి, తేజల్ హసాబ్నిస్, శ్రీచరణి, శుచి ఉపాధ్యాయ్ ఉన్నారు.

## టెన్నిస్ టోర్నీలో..బోపన్న జోడీ డబుల్స్ విజయం

**న్యూఢిల్లీ:** మాంటె-కార్లో మాస్టర్స్‌లో భారత్ టెన్నిస్ దిగ్గజం రోహన్ బోపన్న, అమెరికాకు చెందిన బెన్ షెల్టన్ ద్వయం డబుల్స్ విజయం సాధించాడు. పారిస్‌లోని కంట్రీ క్లబ్ వేదికగా జరుగుతున్న మాంటె-కార్లో మాస్టర్స్‌లో భాగంగా జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో బోపన్న-బెన్ షెల్టన్ జోడీ 6-3, 7-5తో అర్జెంటీనాకు చెందిన ఫ్రాన్సిస్కో-చీలికి చెందిన అలెజండ్రో జంటపై గెలిచి రెండో రౌండ్‌కు దూసుకెళ్లింది. తద్వారా బోపన్న ఎటిపి మాస్టర్స్ 1000 ఈవెంట్ చరిత్రలో సింగిల్స్ లేదా, డబుల్స్ మ్యాచ్ గెలిచిన 45 ఏళ్ల పెద్ద వయస్కుడిగా చరిత్ర సృష్టించాడు. కాగా మాంటె-కార్లో మాస్టర్స్ డబుల్స్‌లో మరో భారత్ ఆటగాడు యూకీ బాంబ్రీ పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది.

### ఓపెన్ టేబుల్ టెన్నిస్‌లో..

## ఛాంపియన్‌గా పెగూలా

### మరో మ్యాచ్‌లో మెయిన్ డ్రాకు నగాల్ అర్హత



**న్యూఢిల్లీ:** అమెరికా టెన్నిస్ స్టార్ జెస్సికా పెగులా తన కెరీర్‌లో ఎనిమిదో సింగిల్స్ టైటిల్‌ను సాధించింది. చార్ల్స్‌టన్ ఓపెన్ డబ్ల్యూటిఎ-500 టోర్న మెంట్‌లో పెగులా ఛాంపియన్‌గా అవతరించింది. అమెరికాకే చెందిన సోఫియా కెనిన్‌తో జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో పెగూలా 6-3, 7-5తో గెలుపొందింది. ఈ సీజన్‌లోకి పెగూలాకు ఇది రెండో టైటిల్ కావడం విశేషం. ఈ విజయంతో జెస్సికా తన కెరీర్ బెస్ట్ మూడో ర్యాంక్‌నుఅందుకుంది. విజేతగా నిలిచిన పెగూలాకు 1,64,000 డాలర్ల ప్రైజ్ మనీతో పాటు, 500 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. కాగా భారత పురుషుల టెన్నిస్ సింగిల్స్ నంబర్ వన్ సుమిత్ నగాల్ మోంజా ఓపెన్ ఏటీపీ ఛాలెంజర్-100 టోర్నమెంట్‌లో మెయిన్ డ్రా కు అర్హత సాధించాడు. ఇటలీకి చెందిన ఫెడరికో ఇనాకోన్‌తో జరిగిన క్వాలిఫయింగ్ చివరి రౌండ్ మ్యాచ్‌లో సుమిత్ నగాల్ 6-4, 6-2తో గెలుపొంది మెయిన్ డ్రాలో చోటు దక్కించుకున్నాడు. 93 నిముషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో నగాల్ తన ప్రత్యర్థి సర్వీస్‌ను మూడు సార్లు బ్రేక్ చేశాడు.

# లీగ్‌తోనే బ్రేకప్!



**న్యూఢిల్లీ:** ఐపిఎల్-2025, 18వ సీజను ఉత్కంఠభరితంగా సాగుతోంది. ఈ టోర్నీ ప్రారంభమై ఇప్పటివరకు రెండు వారాలు గడిచాయి. ఈ రెండు వారాల్లో చాలా మ్యాచ్‌లు హోరా హోరీగా పోరాడాయి. కొన్ని జట్లు బాగా ఆడగా, కొన్ని జట్లు మాత్రం తీవ్ర నిరాశపరిచాయి. ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ టైటాన్స్ వంటి జట్లు ఇప్పటివరకు అద్భుతమైన ప్రదర్శన కనబరిచాయి. ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోని ఏకైక జట్టు ఢిల్లీ క్యాపిటల్స్. ఈ కారణంగా ఆ జట్టు ప్లే ఆఫ్స్‌కు చేరుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అయితే, కొన్ని జట్ల మార్గం ఇప్పుడు కష్టంగా అనిపిస్తోంది. ఇందులో లీగ్ చరిత్రలో అత్యంత విజయవంతమైన జట్టు కూడాఉంది. ఈ ఐపిఎల్‌లో ప్లే ఆఫ్స్‌కు దూరమయ్యే ప్రమాదంలో మూడు జట్లు ఉన్నాయి. వాటిలో సన్ రైజర్స్ హైదరాబాద్, చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ ఉన్నాయి. అయితే ఇంకా వీటికి ప్లే ఆఫ్స్‌కు వెళ్లేందుకు పూర్తిగా దారులు మాత్రం మూసుకుపోలేదు. ఏదైనా అద్భుతాలు జరిగితేనే తప్ప లేకుంటే ఈ జట్లు లీగ్ దశతోను ముగించాల్సి ఉంటుంది. ప్రధానంగా గత సీజన్‌లో ఫైనలిస్ట్ జట్టు అయిన సన్ రైజర్స్ హైదరాబాద్ ఈ ఐపిఎల్‌లో ప్లే ఆఫ్స్ నుంచి నిష్క్రమించే ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది. సన్ రైజర్స్ తొలి మ్యాచ్‌లోనే 286 పరుగులు చేసి సీజన్‌ను ఘనంగా ప్రారంభించింది. అయితే, అప్పటి నుంచి జట్టు బ్యాటింగ్ నిరంతరం విఫలమవుతూనే ఉంది. హైదరాబాద్ జట్టు వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో ఓడి పాయింట్ల పట్టికలో అట్టడుగునఉంది. అలాగేఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన చెన్నై సూపర్‌కింగ్స్ జట్టుకు ప్లేఆఫ్స్‌కు వెళ్లే మార్గం చాలా కష్టంగా మారింది. ముంబై ఇండియన్స్ లాగే ఇప్పటివరకు ఒకే ఒక మ్యాచ్‌లో గెలిచింది. నాలుగు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. చెన్నై సూపర్ కింగ్స్ ప్రస్తుతం కేవలం 2పాయింట్లతో పాయింట్ల పట్టికలో 9వ స్థానంలో ఉంది. చెన్నై సూపర్ కింగ్స్ బౌలర్లు లేదా బ్యాట్స్‌మెన్స్ అంతగా రాణించడం లేదు. ఇక టోర్నమెంట్‌లో ముంబై ఇండియన్స్ ప్రదర్శన ఇప్పటివరకు చెప్పుకోదగిన విధంగాలేదు. 5 మ్యాచ్‌లుఆడగా, వీటిలో ఒక మ్యాచ్‌లో మాత్రమే గెలిచింది. ముంబై ఇండియన్స్ 4 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది.

# వాణిజ్యం

## భారీ లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, ఏప్రిల్ 8:** ట్రంప్ టారిఫ్ దెబ్బతో గత సెషన్‌లో కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు మంగళవారం పుంజుకున్నాయి. సుంకాల విషయంలో ప్రపంచ దేశాలతో అమెరికా చర్చలకు సిద్ధమన్న సంకేతాలతో ఆసియాతో పాటు మన మార్కెట్లూ రాణించాయి. ఈ సారి ఆర్‌బిఐ నుంచి మరో 25 బేసిస్ పాయింట్ల వడ్డీరేట్ల కోత ఉండొచ్చన్న అంచనాలు కూడా కలిసొచ్చాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ ఓ దశలో 1600 పాయింట్లకుపైగా రాణించగా, నిఫ్టీ కూడా 22,600 పాయింట్ల ఎగువకు చేరింది. చివరికి అమ్మకాల కారణంగా లాభాలు కాస్త తగ్గుముఖం పట్టాయి. ఉదయం సెన్సెక్స్ 74,013.73 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. చివరికి సెన్సెక్స్ 1089.18 పాయింట్లు పెరిగి 74,227.08 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 374.25 పాయింట్లు పెరిగి 22,535.85 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.86.27గా ఉంది. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ మినహా అన్ని షేర్లూ లాభాల్లో ముగిసాయి. టైటాన్ కంపెనీ, బజాజ్ ఫైనాన్స్, ఎల్‌అండ్‌టి, ఎస్‌బిఐ, యాక్సిస్ బ్యాంకు షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. బిఎస్‌ఇ మిడ్‌క్యాప్ 100, బిఎస్‌ఇ స్మాల్‌క్యాప్ 100 ఇండెక్సులు కూడా 2శాతం మేర లాభాల్లో ముగిసాయి. ఇక ఆసియా-పసిఫిక్ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడయ్యాయి. జపాన్ నిక్కీ 5.68శాతానికిపైగా లాభపడగా, హాంగ్‌కాంగ్, షాంఘై మార్కెట్లు ఒకటిన్నర శాతం లాభపడ్డాయి. సింగపూర్, తైవాన్, జకర్తా మార్కెట్లు నష్టాల్లో ముగిసాయి. యూరోపియన్ మార్కెట్లు లాభాల్లో ప్రారంభమయ్యాయి. డోజోన్స్ ఫ్యూచర్స్ రెండు శాతం మేర లాభాల్లో ట్రేడవుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 64డాలర్ల వద్ద ట్రేడవగా, బంగారం ఔన్సు 3020 డాలర్ల వద్ద కొనసాగింది. సుంకాలపై చర్చకు కొన్ని దేశాలు ముందుకొచ్చాయని ట్రంప్ చేసిన ప్రకటన మార్కెట్లో ఉత్సాహాన్ని నింపింది. ట్రంప్ కూడా కాస్త వెనక్కి తగ్గుతారనే అంచనాలున్నాయి. దీనివల్ల వాణిజ్య యుద్ధ ఆందోళనలు తగ్గుతాయనే సంకేతాలు సూచీల సెంటిమెంట్‌ను బలపర్చాయి. చైనా, వియత్నాం తదితర దేశాలతో పోలిస్తే ట్రంప్ సుంకాల వల్ల కలిగే నష్టం మనదేశానికి తక్కువనే అంచనాలు ఇన్వెస్టర్ల ఆందోళనలకు కాస్త ఊరటనిచ్చాయి. అటు ముడిచమురు ధర తగ్గుముఖం పట్టడం కూడా మార్కెట్ల ర్యాలీకి ఓ కారణంగా మారింది. కనిష్టాల వద్ద కొనుగోళ్లు సూచీలకు అండగా నిలిచాయి.



## ఇది ఆర్థిక అణు యుద్ధం: ట్రంప్‌నకు నిపుణుల హెచ్చరిక

**వాషింగ్టన్, ఏప్రిల్ 8:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన ప్రతీకార సుంకాల ప్రభావంతో దేశంలో ద్రవ్యోల్బణం పెరగడంతో పాటు, ఆర్థిక మాంద్యం వచ్చే ప్రమాదం ఉందని జెపి మోర్గాన్ సిఇఒ జెమి డిమోన్ అభిప్రాయపడ్డారు. ఆయన వాటాదారులకు విడుదలచేసిన వార్షిక లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. భారత్ వంటి దేశాలను తన దారిలోకి తెచ్చుకొనే కంటే, వాటితో సన్నిహిత సంబంధాలను పెంచుకోవడమే మంచిదని ఆయన సూచించారు. ఇటీవల కాలంలో విధించిన టారిఫ్‌లు ద్రవ్యోల్బణాన్ని పెంచొచ్చు. అందువల్ల ఆర్థిక మాంద్యానికి దారి తీసే అవకాశాలున్నాయి. ఆర్థిక వ్యవస్థ చెప్పుకోదగ్గ స్థాయిలో కుదుపునకు లోనవుతుంది. ఇందులో పన్ను సంస్కరణలు, డీ రెగ్యులేషన్లకు దారితీయడం వంటివి సానుకూల అంశాలైతే, పన్ను, వాణిజ్య యుద్ధం, ఏ మాత్రం తగ్గుముఖం పట్టని ద్రవ్యోల్బణం, ఆర్థిక లోటు, ఆస్తుల విలువలు గణనీయంగా పెరగడం, అస్థిరత వంటివి ప్రతికూలాంశాలు. పన్నుల పెంపు వల్ల దిగుమతి చేసుకొనే వస్తువులే కాదు, దేశీయంగా తయారైన వాటి ధరలు కూడా పెరుగుతాయి. ఇవి స్వల్పకాలంలో కనబడతాయి. ముఖ్యంగా దేశీయ ఉత్పత్తుల ఇన్‌పుట్ ధరలు, డిమాండ్ రెండూ పెరుగుతాయి అని



వెల్లడించారు. ఇక భారత్ వంటి నాన్ అలైన్ దేశాల విషయంలో అమెరికానే స్నేహహస్తం చాచి సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకోవాలన్నారు. కీలక వాణిజ్య భాగస్వాములతో లోతైన సంబంధాలు కలిగిఉండడం ఆర్థిక, భౌగోళిక రాజకీయపరంగా మంచిది. అమెరికా కూటమిలో భాగస్వాములు కాకుండా ఉన్న నాన్ అలైన్ దేశాలైన భారత్, బ్రెజిల్ వంటి వాటితో సన్నిహితంగా ఉండాలి. వారికి వాణిజ్యం, పెట్టుబడుల్లో అమెరికా స్నేహహస్తం అందించాలి అని పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు అతిపెద్ద మద్దతుదారుగా నిలిచిన సంపన్నుడు బిల్ అక్మెన్ కూడా టారిఫ్‌లను తప్పుపట్టారు.

## ప్రైమ్ మెంబర్‌షిప్ రద్దుపై అమెజాన్ పూర్తి రీఫండ్

**ముంబై, ఏప్రిల్ 8:** ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ తన వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ ప్రైమ్ మెంబర్‌షిప్ క్యాన్సిలేషన్ పాలసీలో కీలక మార్పును ప్రకటించింది. సబ్‌స్క్రైబర్లు ఎప్పుడైనా సరే మెంబర్‌షిప్ క్యాన్సిల్ చేసుకుంటే పూర్తిగా రీఫండ్ ఇవ్వనున్నట్లు వెల్లడించింది. ఈ విధానాన్ని ఏప్రిల్ 9 నుంచి ప్రారంభించ నుంది. సాధారణంగా అమెజాన్ ప్రైమ్ మెంబర్‌షిప్ ఉన్న కస్టమర్లకు అదే రోజు లేదా మరుసటి డెలివరీ అందించడం, ప్రత్యేక డీల్స్, ప్రైమ్ విడియో, ప్రైమ్ మ్యూజిక్‌తో సహా అమెజాన్ ప్లాట్‌ఫామ్‌లలో డిజిటల్ కంటెంట్‌కు యాక్సెస్ లభిస్తాయి. అయితే మెంబర్‌షిప్ రద్దు ప్రక్రియను కంపెనీ మరింత సులభతరం చేయాలనే ఉద్దేశంతో తాజా మార్పును తీసుకొచ్చింది. అయితే ఇందులోనూ ఓ మెలిక ఉంది. కొత్త పాలసీ ప్రకారం, సబ్‌స్క్రైబర్లు తమ ప్రైమ్ మెంబర్‌షిప్ రద్దు కోసం ఎలాంటి కొనుగోళ్లు చేయనంత వరకు కొత్త ప్రయోజనాలను ఉపయోగించనంత వరకు ఎప్పుడైనా సరే పూర్తి రీఫండ్‌ను క్లెయిమ్ చేసుకోవచ్చు. ఏవైనా ప్రయోజనాలు పొందితే, వాపసు ఉండదు. ఇప్పటివరకు ఉన్న దాని ప్రకారం, అమెజాన్ మెంబర్‌షిప్ తీసుకున్న మూడు రోజుల్లోపై మాత్రమే దాన్ని రద్దు చేసుకునే వీలుంది. ఇతర సందర్భాల్లో ఉపయోగించిన ప్రయోజనాల ఆధారంగా ఛార్జీలను వసూలు చేసి రీఫండ్ చేయడం జరుగుతుంది.



## ముద్రా యోజనకు పదేళ్లు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:** ప్రధాన మంత్రి ముద్రా యోజన (పిఎంఎంవై) పథకం ఏప్రిల్ 8కి పదేళ్లను పూర్తి చేసుకుంది. 2025 ఏప్రిల్ 8న ఈ స్కీమ్ ప్రారంభమైనప్పటి నుంచి భారతదేశం అంతటా 52 కోట్లకుపైగా లబ్ధిదారులకు రూ.33 లక్షల కోట్లకు పైగా పూచీకత్తు లేని రుణాలను పంపిణీ చేసింది. పిఎంఎంవై స్కీమ్ పదేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ముద్రా యోజన పథకం ఎంతో మందికి, వ్యవస్థాపక నైపుణ్యాలను ప్రదర్శించడానికి అవకాశాలను కల్పించింది. ఈ పథకం ద్వారా మేలు పొందిన కొంతమందితో మాట్లాడాను. వారి ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకం అంటూ ప్రధాని నరేంద్ర మోడీ ట్వీట్ చేశారు. వ్యాపారాలను ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రారంభమైన ప్రధాన మంత్రి ముద్రా యోజన పథకం, ఎంతో మంది ఎదగడానికి ఆర్థికంగా ఉపయోపడింది. గతంలో ఈ స్కీమ్ ద్వారా రూ.10 లక్షలు లోన్ ఇచ్చేవారు. అయితే 2024-25 కేంద్ర బడ్జెట్‌లో పరిమితిని రూ.20 లక్షలకు పెంచారు. ఈ పథకం నాలుగు రకాలుగా ఉంటుంది. అవి శిశు, కిషోర్, తరుణ్, తరుణ్ ప్లస్.




## 'మైక్రోసాఫ్ట్‌లో డిజిటల్ ఆయుధాల తయారీ'

**వాషింగ్టన్, ఏప్రిల్ 8:** వాషింగ్టన్‌లో ఇటీవల జరిగిన మైక్రోసాఫ్ట్ 50వ వార్షికోత్సవ వేడుకలకు పాలస్తీనా అనుకూల ఉద్యోగులు అంతరాయం కలిగించారు. ఇజ్రాయెల్ సైనిక చర్యల్లో మైక్రోసాఫ్ట్ ప్రమేయం ఉందని ఆరోపిస్తూ ఇందులో కొందరు రాజీనామా చేశారు. వీరిలో మైక్రోసాఫ్ట్ ఎఐ విభాగానికి చెందిన ఇండో అమెరికన్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ వానియా అగర్వాల్ కూడా ఉన్నారు. గాజాలో హింసాకాండకు ఈ సంస్థ సహకరిస్తోందని ఆరోపిస్తూ మైక్రోసాఫ్ట్‌ను డిజిటల్ ఆయుధాల తయారీదారుగా అభివర్ణించారు. బహిరంగంగానే రాజీనామా సమర్పిస్తున్నట్లు ప్రకటిస్తూ నినాదాలతో సమావేశం నుంచి బయటకు వచ్చారు. ఇజ్రాయెల్ రక్షణ మంత్రిత్వ శాఖతో మైక్రోసాఫ్ట్ కుదుర్చుకున్న 133 మిలియన్ డాలర్ల ఒప్పందాన్ని అగర్వాల్ ఖండించారు. కంపెనీ ఎఐ, అజూర్ క్లౌడ్ సేవలు పాలస్తీనియన్లకు వ్యతిరేకంగా ఇజ్రాయెల్ సైనిక చర్యలకు మద్దతుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. మైక్రోసాఫ్ట్ క్లౌడ్, కృత్రిమ మేధ గాజాలో ఇజ్రాయెల్ సైన్యాన్ని మరింత ప్రాణాంతకంగా, విధ్వంసకరంగా మార్చేందుకు వీలు కల్పిస్తున్నాయి అని అగర్వాల్ కంపెనీకి సమర్పించిన ఇ-మెయిల్‌లో రాశారు. మైక్రోసాఫ్ట్ టెక్నాలజీని ఇజ్రాయెల్ నిఘా వ్యవస్థలు, యుద్ధ మౌలిక సదుపాయాలతో ముడిపెట్టిన నివేదికలను ఆమె ఉదహరించారు. అమెజాన్‌లో మూడేళ్లకుపైగా పని చేసిన తర్వాత 2023 సెప్టెంబరులో మైక్రోసాఫ్ట్‌లో చేరిన అగర్వాల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్నారు. పాలస్తీనాకు అనుకూలంగా ఉన్న ఉద్యోగుల్లో అసమ్మతి పెల్లుబుకుతున్న నేపథ్యంలో ఆమె నిరసన తెలపడం తాజాగా చర్చనీయాంశం అయింది. ఫిబ్రవరిలో సిఇఒ సత్య నాదెళ్లతో జరిగిన ఒక సమావేశంలో ఇలాంటి ఆందోళన కారణంగా అంతరాయం కలగడంతో ఐదుగురు సిబ్బందిని తొలగించారు. ఈ ఆరోపణలపై గానీ, అగర్వాల్ రాజీనామాపై గానీ మైక్రోసాఫ్ట్ ఇంకా బహిరంగంగా స్పందించలేదు.




## అదానీ కొలంబో టెర్మినల్ షురూ

**ముంబై, ఏప్రిల్ 8:** డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ తాజాగా శ్రీలంకలోని కొలంబో పశ్చిమ అంతర్జాతీయ టెర్మినల్ (సిడబ్ల్యూఐటి)ను ప్రారంభించినట్లు వెల్లడించింది. పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంలో అభివృద్ధి చేసిన సిడబ్ల్యూఐటిని కన్సార్షియం నిర్వహించనున్నట్లు తెలియచేసింది. కంపెనీ అధ్యక్షతన శ్రీలంక దిగ్గజం జాన్ కీల్స్ హోల్డింగ్స్ పిఎల్‌సి, శ్రీలంక పోర్ట్స్ అథారిటీ కన్సార్షియంలో భాగమైనట్లు పేర్కొంది. 35యేళ్ల కాలానికి నిర్మించు,నిర్వహించు, బదిలీ చేయి పద్ధతిలో ఒప్పందం అమలుకానున్నట్లు వివరించింది. 80 కోట్ల డాలర్ల పెట్టుబడులతో 1,400 మీటర్ల పొడవు, 20 మీటర్ల లోతుతో అభివృద్ధి చేసిన కొలంబో టెర్మినల్ వార్షికంగా 3.2 మిలియన్ టిఇయును హ్యాండిల్ చేయగలదని తెలియచేసింది. కొలంబోలో ఇది తొలి డీప్ వాటర్ టెర్మినల్‌కాగా, పూర్తి ఆటోమేటెడ్‌గా ఏర్పాటైనట్లు పేర్కొంది. తద్వారా కార్గో హ్యాండ్లింగ్ సామర్థ్యాలు మెరుగుపడడం, వెస్సల్ టర్న్‌అరౌండ్ సమయం తగ్గడంవంటి సౌకర్యాలకు వీలు కలగనున్నట్లు తెలియచేసింది.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.

# రబీ ధాన్యం సేకరణ రైతు సేవా కేంద్రాల ద్వారా జరగాలి : జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , ఏప్రిల్ 08 ( ప్రభాతవార్త ) :**

రబీ 2024-25 సీజనులో రైతులు పండించిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా సేకరించడం జరుగుతుందని, ఈ ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా జరిగేందుకు అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. మంగళవారం కాకినాడ కలెక్టరేట్ విధాన గౌతమి సమావేశ మందిరంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో కాకినాడ, పెద్దాపురం డివిజన్ పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం సేకరణ ప్రక్రియలో పాల్గొంటున్న సాంకేతిక నిపుణులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, హెల్పర్లు, వెహికల్ మూమెంట్ అధికారులు, కస్టోడియన్ అధికారులకు, మండల వ్యవసాయ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జేసీ రాహుల్ మీనా హాజరై సిబ్బందికి ధాన్య సేకరణ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జేసీ రాహుల్ మీనా మాట్లాడుతూ జిల్లాలో రబీ సీజన్లో రైతుల నుంచి ధాన్యం సేకరణకుగాను 225 ధాన్యము కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన సాంకేతిక నిపుణులు, డేటా ఎంట్రీ అపరేటర్లును నియమించడం జరిగిందన్నారు. ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా సాగేందుకు కస్టోడియన్ అధికారులను కూడా నియమించడం జరిగిందని జేసీ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సాధారణ రకం క్వింటాకు రూ.2,300, ఏ గ్రేడ్ కు రూ.2,320 మద్దతు ధరగా ప్రకటించిందన్నారు. కనీస మద్దతు ధర కంటే తక్కువగా రైతులు ఎవరు ధాన్యం అమ్ముకోకుండా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ అంతా ఆన్ లైన్ లో జరుగుతుందని, మధ్యవర్తులు దళారుల బారినబడి రైతులు నష్టపోకుండా చూడాలన్నారు. ప్రధానంగా ధాన్యం రైతులను దగ్గర నుంచి రైస్ మిల్లులకు తరలించే ప్రక్రియలో అవసరమైన రవాణా, హమాలీలు, గోనె సంచులను రైతే ఏర్పాటు చేసుకున్నట్లయితే ధాన్యం సొమ్ముతో పాటు ఈ ఖర్చులు వారి ఖాతాలో ప్రభుత్వం జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ రబీ సీజన్ నుంచి రైతులు తమ పంటను అమ్మకం కోసం రైతు సేవా కేంద్రాలకు వెళ్ళనవసరం లేకుండా 7337359375 వాట్సాప్ నెంబర్ ద్వారా రైతే నేరుగా షెడ్యూలింగ్ చేసుకునే అవకాశం కల్పించడం జరిగిందన్నారు. రైతులు ఈ సదుపాయాలను వినియోగించుకునే విధంగా చూడాలన్నారు. రైస్ మిల్లు నుంచి వచ్చే గోన సంచులపై సదరు మిల్లుల కోర్టు ముద్రించి ఇవ్వబడుతుందన్నారు.




తూర్పుగోదావరి, కాకినాడ
డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

బుధవారం 09 - ఏప్రిల్ - 2025




# సబ్జెక్టు వారీగా అవగాహన పెంచుకోవాలి

**- ఇంటర్మీడియట్ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ**



**అంబాజీపేట , ఏప్రిల్ 08 ( ప్రభాతవార్త ) :**

ప్రతి విద్యార్థి సబ్జెక్టు వారీగా అవగాహన పెంచుకోవాలని, గ్రూప్ సబ్జెక్టులపై ప్రణాళికా బద్ధంగాను, వత్తిడికి గురికాకుండా చదువుకోవడం వల్ల మంచి మార్కులు సాధిస్తారని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు,జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మిలు అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలు,నోట్ పుస్తకాలను హెచ్ఎం కడలి సాయిరామ్ సమక్షంలో మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీలు మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ఉపాధ్యాయులు చెప్పే సబ్జెక్టులను శ్రద్ధగా వినడంతో పాటు వాటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. కష్టపడి ఇష్టంగా చదివితే మంచి ఫలితాలు ఉంటాయన్నారు.

హెచ్ఎం సాయిరాం మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఈ నెల1 నుండి తరగతులు ప్రారంభించామని తెలిపారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర ఆధ్వర్యంలో జరిగిన పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ పితాని త్రిమూర్తులు, వైస్ చైర్మన్ బండారు అమ్మాజీ, కొర్లపాటి రాజగోపాల్ (గోపి) సుంకర పేరయ్యనాయుడు, కొర్లపాటి వెంకటేశ్వరరావు, నాగాబత్తుల సుబ్బారావు, వలవల బాబి, వీరా సతీష్, ఉపాధ్యాయులు డి.అంజిబాబు, సిహెచ్. ఫణికుమార్, డి.ఎస్.వి. రమణారావు, పి.రాంబాబులు పాల్గొన్నారు.

# జొన్నాడ ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతం చేయాలి : కలెక్టర్ మహేష్ కుమార్

**కోనసీమ బ్యూరో , ఏప్రిల్ 08 ( ప్రభాతవార్త ) :**

ఇటీవల నిలిచిపోయిన జొన్నాడ ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవం తం చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ సృష్టి కాంట్రాక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ గుత్తే దారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నందు జాతీయ రహదారుల అథారిటీ ఆఫ్ ఇండియా అధికా రులు గుత్తేదారులతో సమావేశం నిర్వహించి రిటైనింగ్ వాల్ , గడర్లు సర్వీస్ రోడ్లు అప్రోచ్ రోడ్లు మడికి, చొప్పెల్ల చెముడు లంక వద్ద సర్వీస్ రోడ్ల నిర్మాణం పై సమీక్షించారు. అదేవిధం గా పాసర్లపూడి - మామి డి కుదురు బైపాస్ రోడ్డు నిర్మాణ పనులపై సమీ క్షించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైనింగ్ వాల్ త్వరిత గతిన మట్టితో



నింపుతూ పటిష్ట పరచాలని వీటికి సమాంతరంగా గడర్ల కాస్టింగ్, అప్రోచ్ సర్వీస్ రోడ్ల నిర్మాణాలను చేపడుతూ ఒప్పందం మేరకు సెప్టెంబర్ నాటికి నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు రహదారుల భద్రత మరి యు ప్రమాదాల నివారణ కొరకు మడికి చొప్పెల్ల, చెముడు లంక గ్రామాల వద్ద జాతీయ రహదారి కి అనుబంధంగా సర్వీస్ రోడ్లను నిర్మించి స్థానిక ప్రజానీకం రాకపోకలకు మార్గం సుగమం చేయాల న్నారు. ఎంతోకాలంగా నిలిచిపోయిన పాసర పూడి-మామిడి కుదురు బైపాస్ రోడ్డు నిర్మాణ ప నులు భూసేకరణ జరిగి నంత మేరకు పనులు చేపట్టాలని ఇంజనీర్లను ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న భూసేకరణ సమ స్యలు త్వరలో పరిష్కరిస్తామని తెలి పారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నిషాంతి, డిఆర్ఓ రాజకుమారి, ఆర్డీవో కే మాధవి, జాతీయ రహదారులు అథారిటీ ఆఫ్ ఇండియా పథక సంచాలకులు సురేంద్ర నాథ్ ,జాతీయ రహదారులు 216 సహా య ఇంజనీర్ వెంకట రమణ, సృష్టి కాంట్రాక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ గుత్తే దారుడు రామకృష్ణ, ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్ ఏసు బాబు, ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# వేదాంత కార్యకలాపాలు అడ్డుకున్న నిరుద్యోగులు

**కోనసీమ బ్యూరో , ఏప్రిల్ 08 ( ప్రభాతవార్త ) :**

ఉప్పలగుప్తం మండలం ఎస్. యానం గ్రామంలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని, గ్రామాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలని,గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వేదాంత రవ్వ ఆయిల్ కంపెనీ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మంగళవారంఉదయం నాలుగు గంటల నుండి ఎస్. యానం గ్రామ నిరుద్యోగ యువకులు వేదాంత రవ్వ ఆయిల్ ప్లాంట్ ను స్తంభింప చేసి ఉద్యోగులను ఎవ్వరిని ప్లాంట్ లోపలకి వెళ్ళనీయకుండా కార్యకలాపాలు అడ్డుకుని ధర్నా నిర్వహించారు. అధికారులు స్పష్టమైన హామీ ఇచ్చేంతవరకు ఆందోళన



కొనసాగిస్తామని పి డి ఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతిరావు, సర్పంచ్ జోగి రాజేశ్వరి రాజా, ఎంపీటీసీ సభ్యులు పెట్ట అప్పారావు గ్రామ పెద్దలు దంగేటి చిట్టిబాబు, లంకే భీమరాజు పులిశెట్టి దొరబాబు, పలచోళ్ళ బుజ్జి, అయితాబత్తుల రాజశేఖర్, పలచోళ్ళ పద్మనాభం తదితరులు తెలిపారు.

# మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూల కోలాహలం



**మామిడికుదురు , ఏప్రిల్ 08 ( ప్రభాతవార్త ) :**

మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయం మంగళవారం కోలాహలంగా మారింది.పలు కార్పొరేషన్ల ద్వారా 50 శాతం సబ్సిడీ రుణాలు పొందేందుకు దరఖాస్తు చేసుకున్న వారికి మంగళవారం రెండవ రోజు బ్యాంకు మేనేజర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండల పరిధిలో వివిధ కేటగిరీలో రుణాలు పొందేందుకు1819 మంది దరఖాస్తు చేసుకున్నారు. బీసీ కాపు,ఈబీసీ,ఈడబ్ల్యుఎస్ తదితరులు 102 మందికి సబ్సిడీ రుణాలు కేటాయించనున్నారు.ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మామిడికుదురు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్, డిసిసిబి బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్ మేనేజర్లు దరఖాసుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

# వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

**కాట్రేనికోన , ఏప్రిల్ 08 ( ప్రభాతవార్త ) :**

మండల పరిధిలో పల్లంకుర్రు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు .వేద మంత్రాల సాక్షిగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన, భజనలు ఏర్పాటు చేశారు .మంగళంవారం స్వామి వారిని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు .ఆలయానికి పచ్చని తోరణాలతో విద్యుత్ కాంతులతో అలంకరణ చేశారు.



# సమయ పాలన పాటించాలి



**కాట్రేనికోన , ఏప్రిల్ 08 ( ప్రభాతవార్త )**

ప్రభుత్వం చౌక ధరల దుకాణాల ద్వారా అర్హులైన పేదలకు అందించే రేషన్ సరుకులు పంపిణీలో రేషన్ వాహన దారుల సమయ పాలన పాటించాలని కాట్రేనికోన తహసిల్దార్ పి.సునీల్ కుమార్ అన్నారు. నిరుపేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ బియ్యం అందిస్తోందని సమయ పాలన పాటించి లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు . లబ్ధిదారులకు ఇబ్బందులు తలెత్తకుండా సరుకులను పంపిణీ ప్రక్రియ చేపట్టాలని తహసిల్దార్ తెలిపారు. కాట్రేనికోన మండల పరిధిలోని టి.సావరం గ్రామం వద్ద రేషన్ బండిని ఆకస్మిక తనిఖీ చేసి పలు సూచనలను చేశారు . గ్రామీణ ప్రాంతాలలో వరి కోతల దృష్టిలో పెట్టుకుని ఉదయం 6 గంటలకే సరఫరా చేసే విధంగా చూడాలన్నారు.

# శ్రీ రావులమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం



**అంబాజీపేట , ఏప్రిల్ 08 ( ప్రభాతవార్త ) :**

మండలంలోని గంగలకుర్రు గ్రామ దేవత శ్రీ రావులమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించి గ్రామ ఆడపడుచులు ముడుపులు, మొక్కుబడులు, కానుకలు, చలివిడి పానకాలు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఆలయ ప్రాంగణంలో తీర్థ ప్రసాదాలు అందజేశారు. సోమవారం రాత్రి అమ్మవారి జాతరను గ్రామ వీధుల్లో ఊరేగుతూ ఘనంగా జరిపారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**కోనసీమ బ్యూరో , ఏప్రిల్ 08 ( ప్రభాతవార్త )**

ఆత్రేయపురం మండల పరిధిలోని మెర్లపాలెం సచివాలయం సమిపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు.పశ్చిమగోదావరి జిల్లా గజ్జిరం గ్రామానికి చెందిన జీవరత్నం మోటర్ బైక్ పై వెళుతుండగా వెనుక నుండి లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. మృతదేహాన్ని పోస్టార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ ఎస్. రాము తెలిపారు.



# వినాయకునికి వెండి పళ్ళెం అందజేత



**కాట్రేనికోన , ఏప్రిల్ 08 ( ప్రభాతవార్త )**

అయినవిల్లి మండల పరిధిలోని అయినవిల్లి శ్రీ విఘ్నేశ్వర స్వామి వారికి కాట్రేనికోన గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారి గ్రంది శ్రీ కృష్ణ సుశాంత్ వారి కుటుంబ సభ్యులు శ్రీ విఘ్నేశ్వర స్వామి వారిని దర్శించి కొని స్వామి వారికి 511 గ్రాముల వెండి పళ్లెం బహూకరించినారు.వీరికి ఆలయ ప్రధాన అర్చకులు ఆశీర్వచనం అందజేసి శేష వస్త్రములతో సత్కరించి దాత కుటుంబ సభ్యులను ఆలయ కార్యనిర్వహణాధికారి సత్యనారాయణ రాజు,ఆలయ సిబ్బంది అభినందించారు.

# క్రీడా ప్రతిభను చాటిన ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు కలెక్టర్ ప్రశంస

**కోనసీమ బ్యూరో , ఏప్రిల్ 08 ( ప్రభాతవార్త )**

క్రీడల పట్ల ఆసక్తిని కనబ రుస్తూ క్రీడా ప్రతిభను చాటారని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఇంజనీర్లకు సూచించారు. స్థానిక దండోరా కమ్యూ నిటీ వారు అంబేద్కర్ కోనసీమ జిల్లా స్థాయిలో అందరూ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు డ్రీమ్ 2కె 25 పేరిట స్పోర్ట్స్ మీట్ నిర్వహించి విజేతలకు జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్,జిల్లా పంచాయతీ రాజ్ డిపి. ఓ.పి రామ కృష్ణారెడ్డి వార్ల చేతుల మీదుగా విజేతలకు మెమెంటోలు షీల్డ్ ను బహుకరించారు. ఈ స్పోర్ట్స్ మీట్ క్రీడలను ఆది నుండి వెన్నంటి ఉండి ముందుకు తీసుకొని వెళ్లిన పంచాయతీరాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అన్యం రాంబాబు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గా ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు లకు సహాయం ఇంజనీ ర్లుగా పదోన్నతి పొంద డానికి డిప్లొమా ఇంజ నీర్స్ అసోసియేషన్ తరపున కృషి చేస్తానని తెలిపారు, పి ఆర్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్



ఇంజనీర్ పి ఎస్ రాజకు మార్ మాట్లాడుతూ స్పోర్ట్స్ మీట్ రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచింద న్నారు. జిల్లా గ్రామీణ నీటి సరఫరా పారిశుధ్య విభాగం కార్యనిర్వహక ఇంజనీరింగ్ సిహెచ్ ఎన్వి కృష్ణారెడ్డి ప్రసంగిస్తూ సిబ్బంది నమ్మకాన్ని కాపాడుకోవాలన్నారు. క్రికెట్ విన్నర్స్ కొత్తపేట బృందాన్ని జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ ప్రత్యేకం గా అభినందించారు. ఈ కార్యక్రమంలో రహదారులు భవనాల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ రాము సిపిఓ పి వెంకటేశ్వర్లు, గృహ నిర్మాణ సంస్థ ఇంజనీర్లు, డ్రైనేజీ విభాగం కార్య నిర్వాహక ఇంజనీర్ ఎం వి వి కిషోర్,. అన్ని డిపార్ట్మెంట్ ఇంజనీర్స్,, ఇంజనీరింగ్ అసిస్టెంట్ లు సుమారు 400 మంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆశాజనకంగా రబీ పంట : సిపివో (జేడీ) ఎల్ అప్పల కొండ



**రాజమహేంద్రవరం రూరల్ , ఏప్రిల్ 08 ( ప్రభాతవార్త ) :**

జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్లో రబీ పంట దిగుబడి ఆశాజనకంగా ఉందని జిల్లా గణాంకశాఖ జాయింట్ డైరెక్టర్ ఎల్. అప్పలకొండ తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని రాజవోలు గ్రామములో మంగళవారం క్షేత్ర స్థాయిలో క్రాప్ కటింగ్ విధానాన్ని పరిశీలించారు. రాజవోలు వ్యవసాయ క్షేత్రంనందు పంటకోత ప్రయోగము చేయగా, ప్రయోగ ప్లాటునందు ((5 X5m ) 30.250 కిలో గ్రాములు మరియు బొమ్మూరు గ్రామ వ్యవసాయ క్షేత్రంనందు పంటకోత ప్రయోగము చేయగా, ప్రయోగ ప్లాటునందు (5 X5m ) 25.310 కిలో గ్రాములు దిగుబడి వచ్చినట్లు జిల్లా గణాంకశాఖ జాయింట్ డైరెక్టర్ ఎల్. అప్పలకొండ తెలిపారు. బొమ్మూరు గ్రామములోని గిరిజన సంక్షేమ హాస్టలును సందర్శించి విద్యార్థులును విద్యా బోధన , భోజన సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఉప గణాంక అధికారి జె. సూర్యనారాయణ , వ్యవసాయ విస్తరాణాదికారి పీటర్, గ్రామ వ్యవసాయ సహాయకులు యం. హేమంత్ నాగసురేష్ , ఎస్. రాహుల్ , కె. దుర్గాబాబు , ఎస్.బి.ఐ. భీమా అధికారి , ఎల్. శ్రీధర్ బాబు , రైతు కంటిపూడి ఉమా వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా వాడపల్లి వెంకన్నరథోత్సవం..పోటెత్తిన భక్త జనం





**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , ఏప్రిల్ 08 ( ప్రభాతవార్త ) :**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక దివ్య కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం మధ్యాహ్నం రథోత్సవం కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా కలశ పూజ, నీరాజనం మంత్రపుష్పం, పుణ్యావాసనం,బలహరణ తదితర కార్యక్రమాలు కన్నుల పండుగ జరిగాయి. అనంతరం రథోత్సవాన్ని కొత్తపేటఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఆర్డీవో, పి.శ్రీకర్ రథం తాడు లాగి ప్రారంభించారు.రథోత్సవం మాడవీధుల్లో మూడు గంటల పాటుభారీ భక్తజనం తో నైనా నందకరంగా సాగింది దీంతో మాడ వీదు లన్నీ గోవింద నామస్మ రణ తో మార్మోగాయి. తొలితగా ఎదుర్కోలు ఉత్సవాన్ని ఖండవల్లి వరప్రసాదచార్యులు ,అర్చక బృందం, వేద పండితులు ఘనంగా నిర్వహిం చారు. స్వామివారిని మంగళ స్నానం చేయించి కళ్యాణో త్సవానికి సిద్ధం చేశారు. డీఎస్పీ సుంకర మురళీ మోహన్ నేతృత్వంలో ఎటు వంటి సంఘటనలు జరక్కుం డా విస్తృత భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



# అంగరంగ వైభవంగా ముత్యాలమ్మ తల్లి జాతర



**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్యూరో , ఏప్రిల్ 08 ( ప్రభాతవార్త ) :** అయినవిల్లి మండలం ముక్తేశ్వరం గ్రామ దేవత శ్రీ శ్రీ రాజరాజేశ్వరి ముత్యాలమ్మ అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారి పూజ ఘటాలను గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృత కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు గ్రామ ఆడపడుచులు, భక్తుల పోటెత్తారు. అమ్మవారికి పసుపు కుంకుమలు, గాజులు చీరలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయ వద్ద భారీ అన్న సమాధాన ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకున్న వారిలో గ్రామ సర్పంచి సలాది బుచ్చిరాజు, కోటిపల్లి దేవస్థానం ఉత్సవ కమిటీ అధ్యక్షులు పప్పుల శ్రీను, మాజీ ఎంపీపీ సలాది పుల్లయ్య నాయుడు, టిడిపి మండల శాఖ



మాజీ అధ్యక్షులు సలాది బాబు రావు, సలాది స్వామి నాయుడు, జక్కపు సత్యనారాయణ, గొలకోటి పుల్లయ్య నాయుడు, పడాల గిరి, మేడిశెట్టి సత్తిబాబు, నల్లా అజయ్ తదితరులు ఉన్నారు.

# కేశవ స్వామి కి అనూస్ చిన్నారుల కళా నీరాజనం

## ఆకట్టుకున్న చిన్నారుల వివిధ కళా ప్రదర్శనలు



**కోనసీమ బ్యూరో , ఏప్రిల్ 08 ( ప్రభాతవార్త ) :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆత్రేయపురం మండలం ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ స్వామి వారి కళ్యాణ మహోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి అను సకల కళల ఉచిత శిక్షణా కేంద్రం చిన్నారులు నిర్వాహకుడు శ్యామ్ మాస్టారు ఆధ్వర్యంలో చేసిన కళా నీరాజనం విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో చిన్నారులు డాన్స్, మ్యాజిక్ తో పాటు వివిధ వాయిద్యాలతో తమ కళా నైపుణ్యాలతో కేశవ స్వామి కి కళా నీరాజనాన్ని అర్పించారు. అనంతరం ఈవో బీహెచ్ వి రమణమూర్తి నాగమణి దంపతులు ప్రతిభ చూపిన చిన్నారులకు సర్టిఫికెట్లు, సాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది శ్రీను, దత్తు, సునీత,డాక్టర్ మోహిత్, సీత, అన్నపూర్ణలు, గడ్డం వెంకట్రావులు పాల్గొన్నారు.



# పేదలపై గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో అదనపు భారం తగదు : ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

**మండపేట రూరల్ , ఏప్రిల్ 08 ( ప్రభాతవార్త ) :** పేదలపై గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో అదనపు భారం తగదని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరలపై రూ. 50, పెట్రోల్ , డీజిల్ ధర పై రూ. 2 పెంచిన నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ పెంపు పేద మధ్యతరగతి ప్రజలపై అధిక భారం మోపుతుందని పేర్కొన్నారు. సంపద సృష్టి పేరుతో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు సరైనవి కావని ఆయన మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన లెక్కలతో కూడిన వివరణ ఇచ్చారు. తోట త్రిమూర్తులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర వస్తువుల ధరలు గణనీయంగా పెరిగాయన్నారు. గ్యాస్ సిలిండర్ ధర ఇప్పుడు రూ. 50 పెరిగి, సగటున ఒక సిలిండర్ ధర రూ. 900 నుంచి రూ. 950కి చేరిందన్నారు. ఒక సాధారణ కుటుంబం నెలకు ఒక సిలిండర్ వినియోగిస్తే, సంవత్సరానికి రూ. 600 అదనపు ఖర్చు అవుతుం దన్నారు. అదే విధంగా, పెట్రోల్ ధర లీటరుకు రూ. 2 పెరిగి, సగటున రూ. 105 నుంచి రూ. 107కి చేరిందని విమర్శించారు. ఒక వ్యక్తి నెలకు 50 లీటర్ల పెట్రోల్ వాడితే, అదనంగా రూ. 100, సంవత్సరానికి రూ. 1,200 భారం పడుతుందని అవేదన వ్యక్తం చేశారు. ఈ రెండింటినీ కలిపితే, ఒక కుటుంబానికి సంవత్సరానికి రూ. 1,800 అధిక ఖర్చు అవుతోందని వివరించారు. ప్రభుత్వం సంపద సృష్టిస్తామని చెబుతోంది, కానీ ఈ విధంగా పేదలపై భారం మోపడం ద్వారా సంపద సృష్టించడం న్యాయం కాదని వ్యాఖ్యాని ంచారు. ఒక సామాన్య కుటుంబం నెలసరి ఆదాయం రూ. 15,000



అనుకుంటే, ఈ పెరిగిన ధరల వల్ల వారి ఆదాయంలో 1% కంటే ఎక్కువ ఖర్చు అవుతోందన్నారు. ఇది వారి జీవన ప్రమాణాలను దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్య ంలో, కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకో వాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఉపశమనం కల్పించే చర్యలు చేపట్టాలని తోట త్రిమూర్తులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం పనిచేయాలన్నారు. వారిని ఇబ్బంది పెట్టడం కోసం కాదని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు.

# మద్యం దుకాణం తొలిగించే వరకు ఉద్యమం

## 18 వ రోజుకు చేరిన దీక్షలు..కదలిక లేని యంత్రాంగం



**మండపేట రూరల్ , ఏప్రిల్ 08 ( ప్రభాతవార్త ) :** మండపేట సప్తగిరి థియేటర్ వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణం తొలించే వరకు తమ ఉద్యమం ఆపేది లేదని 28,29,30 వార్డుల్లో మహిళలు హెచ్చరించారు. మద్యం దుకాణం కు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన శిబిరం లో మంగళవారం దీక్షలు 18 వ రోజుకు చేరాయి. ఈ సందర్భం గా మహిళలు మాట్లాడుతూ మహిళల ఉద్యమాన్ని అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎక్సైజ్ అధికారుల్లో కనీసం చలనం లేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో కేత దేవి,మద్దూరి దేవి ,కడియాల లక్ష్మి ,చల్లా లవేశ్వరి,శీలం గణికమ్మ ,కోరుకొండ రామలక్ష్మి,బండారు లక్ష్మి, మోరంపూడి సరస్వతి, పిల్లి లక్ష్మి ,శిలం సంతోషి , మూలపర్తి విజయ రత్నం , గుత్తుల దేవి,28,29,30 వార్డుల మహిళలు ప్రజలు పాల్గొన్నారు.

# ముగ్గురు బెల్ట్ షాప్ నిర్వాహకులు బైండోవర్

**కోనసీమ బ్యూరో , ఏప్రిల్ 08 ( ప్రభాతవార్త )** అమలాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ని అల్లవరం మండలం లో గుడాల గ్రామం లో బెల్టు షాపు నిర్వహిస్తున్న బొంతు వెంకటరెడ్డి, కొమ్ముల వీరబాబు, అద్దంకి సతీష్ అల్లవరం మండల ఎగ్జిక్యూటివ్ మ్యాజిస్ట్రేట్ వారి ఎదుట హాజరు పరిచి సెక్షన్ 129 బి. ఎన్. ఎన్. ఎస్ యాక్ట్ ప్రకారం బైండోవర్ చేసినట్లుగా అమలాపురం ఎక్సైజ్ ఇన్స్పెక్టర్



వి టి వి వి సత్యనారాయణ తెలిపారు. సదరు బెల్ట్ షాపు నిర్వాహకులకు తాసిల్దార్ ఒక్కొక్కరికి లక్ష రూపాయలు షూరిటీ విధించినట్లు పేర్కొన్నారు.

## కమనీయం..కడురమనీయం

# కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవారి కళ్యాణం



- శ్రీ స్వామివారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించిన ఎమ్మెల్యే దంపతులు
- విద్యుత్తు దీపాలు, వివిధ సుగంధ పుష్పాల అలంకరణలో శ్రీవారి కల్యాణ వేదిక

**కోనసీమ బ్యూరో , ఏప్రిల్ 08 ( ప్రభాతవార్త ) :** కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి జగత్ కళ్యాణ మహోత్సవాలు కమనీయంగా జరిగింది. స్వామివారిని మేళతాళాలతో బాణాసంచా ల తో ఊరేగింపుగా తీసుకు వచ్చి శ్రీనివాస ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై ఆసీనులుచేశారు. పండితులు ఖండవల్లి రాజేశ్వర వరప్రాసాదాచార్యులు ఆలయ అర్చకులు వేదపండితులు నేతృత్వంలో కళ్యాణోత్సవం లో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, పాదప్రక్షాళన, వస్త్ర సమర్పణ,గోదానం, మధు ప్రాశన,లజ్ఞాష్టకములు, సుముహూర్తం,కన్యాదానం, జీలకర్ర బెల్లం తదితర మాంగళ్య ధారణ,యజ్ఞోపవీత ధారణ,తలంబ్రాలు, బ్రహ్మ ముడి,మాలా పరివర్తనం, మహదశీర్వచనం,నీరాజన మంత్రపుష్పములు,తీర్థ ప్రసాద వితరణ, తదితర కార్యక్రమాలను రమణీయంగా జరిపించారు. శ్రీ స్వామివారి కళ్యాణం వేదిక ఎదురుగా ఏర్పాటు చేసిన కుండీలలో వందలాది కిలోల కర్పూర హారతులు వెలిగించి మొక్కుబడి తీర్చుకున్నారు. శ్రీ స్వామివారికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దంపతులు, ఆర్డీవో పి శ్రీకర్ దంపతులు, దేవాదాయ ధర్మదాయ డిప్యూటీ కమీషనర్ డి.రమేష్ బాబు, ఆలయ డిప్యూటీ కమిషనర్ కార్యనిర్వాహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు దంపతులు, డిఎస్పి సుంకర మురళీమోహన్ దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు తలంబ్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ముదునూరి వెంకటరాజు,జిల్లా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు, ఆలయ సూపరింటెండెంట్ లు పులపర్తి రాంబాబు, రాపాక శ్రీనివాస్ ,సీనియర్ అసిస్టెంట్ కుమార్, ప్రసాద్, రామాంజనేయులు, తహసీల్దార్ టి ఆర్ రాజేశ్వరరావు, ఎంపీడీవో బి కే ఎస్ ఎస్ వెంకట రామన్,వైద్యాధికారులు, యువోపిఆర్డి యు చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, ఎలక్ట్రికల్ ఏఈ టి అశోక్, ఆర్డబ్ల్యూఎస్ డి ఈ,ఏఈ, లొల్ల సర్పంచ్ కాయల జగన్నాథం గ్రామస్తులు శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవాల్లో పాల్గొని తిలకించారు.







# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది : కలెక్టర్ మహేష్ కుమార్

**కోనసీమ బ్యూరో ,ఏప్రిల్ 08 ( ప్రభాతవార్త )** ప్రతి దరఖాస్తుదారుడు నూటికి నూరు శాతం సంతృప్తి చెందేలా పిజిఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం ఉండాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికా రులకు సూచించారు. మంగళ వారం రీ సర్వే లో అందిన ఫిర్యాదులు, రెవెన్యూ సదస్సుల్లో అందిన భూ సమస్యలు, ప్రభుత్వ భూముల ఆక్రమణ రక్షణ, 22ఎ భూముల తొలగింపు, పి జి ఆర్ ఎస్ దరఖాస్తుల పెండింగు, మూడు కేటగిరీలలో భూముల క్రమబద్ధీకరణ, నీటి తీరువా వసూళ్లు, నీటి తీరువా గ్రామాలు వారిగా డేటా ఎంట్రీ అంశాలపై రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శి,, భూ పరిపాలన ముఖ్య కమిషనర్ జి జయలక్ష్మి 26 జిల్లాల కలెక్టర్లు జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వ హించి జిల్లాల వారీగా సమీక్షించారు.

# ఏపీఎస్పీ లో చలివేంద్రం ప్రారంభం

**: స్కూల్ విద్యార్థులకు, పాదచారులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న కమాండెంట్ నాగేంద్ర**

**కాకినాడ రూరల్ ,ఏప్రిల్ 08 ( ప్రభాతవార్త ) :** వేసవికాలం లో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని కమాండెంట్ ముద్రగడ నాగేంద్ర అన్నారు.కాకినాడ మూడవ బెటాలియన్ ఏపీఎస్పీ బెటాలియన్ సౌజన్య ంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కమాండెంట్ ఎం నాగేంద్ర చేతుల మీదుగా ప్రారంభిం చారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ మూడవ బెటాలియన్ ఏపీఎస్పీ సిబ్బంది, అధికారుల సహకారంతో ప్రతి సంవత్సరం చలివేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందని,ఈ ఎండలలో ప్రయాణిస్తున్న ప్రజలకు వడదెబ్బ నుంచి ఉపశమనం కలిగించడానికి చలివేంద్రం లో ప్రతిరోజు మజ్జిగను మంచినీళ్లను అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో



అడిషనల్ కమాండెంట్ ఎస్. దేవానంద రావు, అసిస్టెంట్ కమాండెంట్స్ బి. చంద్రశేఖర్ , మన్మధ రావు , మోహన్ రావు , ఆర్. ఐ లు విటలేశ్వరరావు ,రవిశంకర్ , అజయ్ కుమార్ , పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు రాజేష్ , పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సాగర తీరంలో సైనిక విన్యాసాలు

## : సూర్యారావుపేట బీచ్ రోడ్డు లో రాకపోకలు నిలిపివేత

**కాకినాడ రూరల్ , ఏప్రిల్ 08 ( ప్రభాతవార్త ) :** రూరల్ మండలం సూర్యారావుపేట సాగర తీరంలో ఇండో అమెరికా సైనిక విన్యాసాలు మంగళవారం నుండి ఈనెల 13వ తారీకు వరకు నేవీ సైనిక విన్యాసాలు, టైగర్ ట్రంప్ కార్యక్రమాల లో భాగంగా కట్టుదిట్టమైన భద్రతా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ డి పి ఓ మనీష్ పాటిల్ తెలిపారు. సైనిక విన్యాసాలు నిర్వహించే రోజులలో లైట్ హౌస్ నుంచి ఉప్పాడ జంక్షన్ వరకు రాకపోకలు నిలిపివేస్తున్నట్లు కాకినాడ రూరల్ సీఐ డిఎస్ చైతన్య కృష్ణ మీడియాకు తెలిపారు. సోమవారం రాత్రి 10 గంటలకు ప్రారంభమైన నేవీ విన్యాసాలు








13వ తేదీ ఉదయం 6 గంటలకు పూర్తవుతాయని, బీచ్ రోడ్ లో ప్రయాణించే సాధారణ ప్రజలకు దారి మళ్లించినట్లు తెలిపారు. సూర్యారావుపేట, పరకాలువా, పోలవరం, జగన్మోహనపురం, నేమాం ప్రజలు పోలీసు వారికి సహకరించాలని ,పర్యాటకులకు బీచ్ ప్రవేశం నిషేధించినట్లు తెలిపారు. మత్స్యకారులు చేపల వేటకు నిషేధిత ప్రాంతాలలో రాకూడదని ఆదేశాలు జారీ చేశారు.డి.ఎస్.పి దేవరాజ్ మనీష్ పాటిల్ సుమారు 130 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. తిమ్మాపురం ట్రైన్ ఏఎస్పీ సుస్మిత పాల్గొన్నారు.

# మట్టి నమూనాల పరీక్ష ద్వారా ఎంత మోతాదులో ఎరువులు వాడుకోవచ్చు

**- నేల పోషక సామర్థ్యాన్ని బట్టి పంటలు వేస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు : వ్యవసాయ కళాశాల డీన్ డా.డి. శ్రీనివాస్**

**రాజమహేంద్రవరం రూరల్ , ఏప్రిల్ 08 ( ప్రభాతవార్త ) :** భూమి యొక్క సారాన్ని పరీక్షించి తెలుసుకోవడం వలన ఆయా భూముల్లో పండిం స్తున్న పంటలకు సంబంధించి మొక్కలు ఎదుగు దలకు ఎటువంటి పోషకాలు అవసరమో ముం దుగానే గుర్తించడం వలన పంట దిగిబడి పెరుగు తుందని వ్యవసాయ కళాశాల డీన్ డా. డి. శ్రీనివాస్ అన్నారు. ఆచార్య ఎన్‌జి రంగా వ్యవ సాయ విశ్వవిద్యాలయం పరిధిలో గల వ్యవ సాయ కళాశాల, రాజమహేంద్రవరం విద్యార్థులు ప్రోగ్రామ్ లో భాగంగా వారం రోజుల పాటు నిర్వహించే జాతీయ సేవా పథకం ప్రత్యేక కార్యక్రమం కోరుకొండ మండలం, శ్రీరంగ పట్నం గ్రామం లో జరుగుతుంది. ఇందులో భాగంగా ఐదవ రోజు మంగళవారం మట్టి నమూనాల సేకరణ మరియు వ్యవసాయ యాంత్రీకరణ పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కళాశాల డీన్ డా. శ్రీనివాస్ మాట్లాడుతూ రైతు నేల యొక్క పోషక సామర్థ్యాన్ని తెలుసుకోవడం వలన ఏ నేలలో ఏ పంట వేస్తే బాగా పెరిగి మంచి దిగుబడులు



వస్తాయో తెలుసుకొని మంచి దిగుబడులు ఇచ్చే పంటను పండించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. వేసిన పంటకు నేలలో తగు నిష్పత్తిలో పోషకాలు లేనపుడు భూసార పరీక్ష ద్వారా నేలలో ఏ పోషకాలు తగ్గినాయో ఆ పోషకాలను మాత్రమే నేలకు అందించడం వలన పంట మంచి దిగుబడిని అందించడమే కాక నేలకు అందించే పోషకాల ఖర్చును బాగా తగ్గించుకోవచ్చునన్నారు. దీని ద్వారా పంటపై పెట్టే పెట్టుబడి తగటమే కాక మంచి దిగుబడుల వలన మంచి ఆదాయం పొందవచ్చు అన్నారు. పంట పండించడానికి నేలకు సరిపడ పోషకాలను అందించటం వలన నేల వాతావరణంలో ఏర్పడే దుష్పరిణామాలను అరికట్టడమేకాక భవిష్యత్ తరాలకు పంట పండించడానికి అనుకూలమైన మంచి నేలను అందించగలు గుతామన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మట్టి నమూనాల పరీక్ష ద్వారా ఎంత మోతాదులో ఎరువులు వాడుకోవచ్చో అనే విషయంపై స్పష్టత వస్తుందని అన్నారు. అలాగే యాంత్రీకరణ ద్వారా కూలీల కొరత ను అధిగమించవచ్చు అని తెలిపారు. అనంతరం కళాశాల ప్రొఫెసర్ డా. ఉషారాణి క్షేత్ర స్థాయిలో రైతుల సమక్షంలో మట్టి నమూనా సేకరణ విద్యార్థుల ద్వారా చేయించి అవగాహన కల్పించారు. ఇలా చేయడం వలన ఎరువులపై చేసే ఖర్చు తగ్గించుకోవచ్చు అని సూచించారు. మట్టి నమూనాలను ఏ సమయాల్లో ఏ ప్రదేశాల్లో ఎలా తీయాలో అనే విషయం పై కూడా రైతులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇంజనీరింగ్ ప్రొఫెసర్ డా. గంగాధర్, వివిధ రకాల యంత్రాలు వాటి పనితీరు రైతులకు వివరించారు. ఈ యంత్రాల వలన డబ్బు సమయం రెండూ ఆదా అవుతాయని చెప్పారు. యంత్రాల వాడకం వలన రైతులు సకాలంలో పనులు చేయడానికి అవకాశం ఉంది అని కళాశాల ప్రొఫెసర్ డా. ప్రవీణ అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, వ్యవసాయ కళాశాల ఆఫీసర్స్ ఆఫీసర్ డా. హెచ్.శ్రీనివాస్, డా. సునీత, గ్రామస్తులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,"Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps